UNIVERSAL LIBRARY
OU_204908
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 82 N21P Accession No. T 2429

Author నారాయణరావు

Title పద్య పుష్పాహాము

This book should be returned on or before the date last marked below.

పద్మవ్యూహము

మూడవ కూరుపు

చింతామణి, వరవిక్రయము, మధుసేన,

చిత్రాభ్యుదయాది [illegible]

కీ॥ శే॥ మహాకవి

[illegible]రాయణ[illegible]

[illegible]చితము.

శాస్త్రుల [illegible] రాజుగారిచే

[illegible]చురింపబడినది.

కాకినాడ

సిటీముద్రాలయమున

ముద్రితము.

1930.

Rights] వెల 1 రు. [Reserved.

అవతారిక.

ఈ నాటకరచన కీ క్రింది భారతశంకలు ముఖ్యకారణములు:

(1) ద్రోణుఁడు ధర్మరాజును బట్టియిచ్చుటకై పద్మవ్యూహమును బన్నిన ట్లున్నది. ధర్మజునకుఁ దద్భేదనోపాయమె తెలియనప్పు డతఁడందుఁ బ్రవేశించు ననుకొనుటకుఁ గాని—తన్మూలకముగాఁ బట్టువచ్చు ననుకొనుటకుఁ గాని—యవకాశ మెక్కడిది ?

(2) సైంధవుఁడు తపము చేసి, పశుపతివలనఁ బాండవులను "వారింప" గల్గుటకై వరము వడసిన ట్లున్నది. తాఁ క్రిందుగ నంత తపము చేసినవాఁడు—"వధింపఁ" గోరక—వారింపఁ గోరుట యేటికో.

(3) వరబలమున, సైంధవుఁడు పద్మవ్యూహము చొచ్చు పాండవుల నడ్డఁగలిగిన ట్లున్నది. అగుఁగాక—అట్టి యడ్డంకిలేని విరాట ద్రుపదు లేమయిరి?—మఱి నాఁడంతకన్న మిన్నయగు వ్యూహము నవలీలగాఁ జొచ్చిన సాత్యకి యే మయ్యెను ?— కామరూపమున గగనవీథినుండియేని పోఁగల ఘటోత్కచుఁ డే మయ్యెను ?

(4) అభిమన్యువధకుఁ బ్రతిక్రియగా నర్జునుఁడు సైంధవుని వధింప శపథము సలిపినట్లున్నది. తన్నచ్చట లేకుండఁ జేసి దారుణవ్యూహము పన్నిన ద్రోణుఁ డుండ-దుర్నయమునకు విరిఘుఁ జేసి మను మాడిన కర్ణాదు లుండ-దమవారిని నిలువరించినంతమాత్రపుఁ బనికి, నెపములకుం గొలగాని సైంధవుం జంపఁ బ్రతిన పట్టుట యర్జునున కేమి న్యాయము- ఏమి విశేషము ?

(5) ద్రోణుని ప్రతిజ్ఞ నాఁడు నెఱవేఱ లేదు- అవ్వల సంబులకై యత్నమును లేదు. అంతవాసిశపథమట్లు వ్యర్థము కావలసిన దేనా?

పై శంకలకుఁ బరిహారకముగా నీపద్మవ్యూహము పన్నఁబడినది.

దొరతనమువారి 1919 వ సంవత్సరపు నివేదికయందు, ఆసంవత్సరము ప్రకటింపబడిన యాంధ్రగ్రంథము లన్నిటిలో నీ పద్మవ్యూహ మగ్రగణ్య మయినదిగను-అనేకవిశేషములు కలదిగను శ్లాఘింపబడినది. దీని ప్రథమ ప్రయోగ గౌరవమును శ్రీ శ్రీ శ్రీ విజయనగరము మహారాజావారు దక్కించుకొనిరి. సర్వజన ప్రదర్శన సౌలభ్యముకొఱకు నొకయంకము తొలగింపబడినది.

కాకినాడ,
20-10-22

మ హా క వి
కా ళ్ళ కూ రి నా రా య ణ రా వు.

Errors, like stars, upon the surface flow ;
He who would search for pearls, must dive below.
Dryden.

పాత్రముల పట్టిక.

పాండవ పక్షమున-	అంకములలో	కౌరవ పక్షమున -	అంకములలో
1 కృష్ణుడు	1.5.6	1 ద్రోణుడు	2.6
2 యుధిష్ఠిరుడు	4.5.6	2 దుర్యోధనుడు	2.4.6
3 భీముడు	5.6	3 అశ్వత్థామ	2
4 అర్జునుడు	1.5.6	4 కర్ణుడు	2.4.6
5 అభిమన్యుడు	3.4	5 దుశ్శాసనుడు	2.4
6 ఘటోత్కచుడు	5.6	6 శకుని	2.4.6
7 సుమిత్రుడు	3.4	7 సైంధవుడు	2.4
8 విశోకుడు	6	అన్యులు	
9 ద్రౌపది	3.5	1 సంజయుడు	1.4.6
10 సుభద్ర	1.3.5	2 వైశంపాయనుడు	1.4.6
11 ఉత్తర	5.6	3 వృద్ధ (ఒక వీరమాత)	5

సుమిత్రుడు- అభిమన్యుని సారథి. విశోకుడు- భీముని సారథి.

సంజయ వైశంపాయనులు- వ్యాసులవారి శిష్యులు.

శ్రీ మేధా దక్షిణామూర్తి పరబ్రహ్మణే నమః.

పద్మవ్యూహము

నాంది

గరువము వాసి, ధర్మరతి, గౌరవవర్ధకతాపటిష్ఠులై
గురుకృప వైరివర్గము నకుంఠితలీల జయించి, జ్ఞాన వి
స్ఫురణఁ జరించునట్టి నరముఖ్యుల కెవ్వఁడు వత్సుఁ డట్టియా
శ్రీహరుఁడు సమాపముగ్రముఁ దుపశంబుఁ గృతార్థులఁ జేయు మిమ్ములన్.

ప్రస్తావన

సూత్ర—(ప్రవేశించి సభ నుద్దేశించి) ఓ విద్వజ్జన మహాజనులారా! ప్రపంచమునందలి సకల సామ్రాజ్యముల పునాదులను సడల్చి, సర్వ సింహాసనముల నత్యంత లూఁగఁ జేసిన యూరోపా మహాసంగ్రామమునందుఁ బ్రభుభక్తమునఁ బాలుగొని, ప్రాణవిత్తములను ధారవోసిన భారతవీరుల పరాక్రమ సాహసములకు గర్వపడుచు; నేఁడు సంగ్రామశాంతి సంఘటిల్లి యభ్యుదయ మానవహిల్లివందుల కై యానందింప సమావేశమైన మీ వినోదముకొఱకు నేఁడు; విద్యచేత నేకాక, వినయముచేతను-విత్తముచేతనే కాక, వితరణముచేతను-వాక్కుచేతనే కాక, వర్తనముచేతను-వన్నెకెక్కిన శ్రీను దుబ్బగిరాజు వీరభద్రరాయని కంకితముగా, మహాకవి కాళ్లకూరి నారాయణరాయనిచే రచియింపఁబడిన వీరాద్భుత రసభరితంబగు పద్మవ్యూహ మహానాటకమును బ్రదర్శించి నా నేర్చిన భరతాగమము సఫలము చేసికొన నభిలషించుచున్నాఁడఁ గావున సావధాన చిత్తమున న్యగ్రహింతురుగాక! (విని) ఏమనుచున్నారు?—

"చ. అనుపమరత్నభూషణము లర్హులు దాల్చినవాఁడె శోభఁ జెం
దనగెడుమాడ్కిఁ, గబ్బములు దక్షయి నేర్చిన సత్కవుల్ ప్రద
ర్శన మొనరించునప్పుడె కరంబుఁ బ్రశస్తి వహించుఁ; గాన, న
య్యనఘునిపట్ల మాకుఁగల యాదరముం బొలిగింపఁ జూడుఁడీ"

అనియా?—చిత్తము, చిత్తము. (తెరవంకఁజూచి) పారిపార్శ్వకా!

పారి—(ప్రవేశించి) ఆర్యా! యేమి సెలవు?

సూత్ర—పాత్రములను సిద్ధపఱిచితివా!

పారి—సర్వమును సిద్ధపఱిచితిని; తమయానుజ్ఞయే తడవు.

సూత్రి—సభ్యులయీదేశము వినియె యుందువు కనుకఁ జరిత్రచర్వణ మవసరము లేదు;—నీ వప్రమత్తుఁడవై యుండి భూమికల ధైర్యోత్సాహములను నీప్రోత్సాహముచేతఁ బెంపొందించు చుండుము.

పారి—ఆర్య మీ కట్టిసందియ మెందులకు?

గీ. ఎందు వీరాద్భుతరసంబు లేపు మీఱు
నదియ యుత్తమరూపక; మట్టిదాని
నభినయింపఁగ మీశిష్యులందుఁ బిన్న
పాపఁడును బ్రౌఢుఁను మించి పరిఢవిల్లు.

సూత్రి—అది నిజమే కాని—

ఆ. వె. గాలిచేతఁ దిత్తి, కరతాడనముచేతఁ
గందుకంబుఁ బెంపుఁ గాంచురీతి;
పొంత నిలిచి యొరులు ప్రోత్సాహపఱిచిన
జనుల శక్తి యుక్తు లినుమడించు.

తెరలో—అది యథార్థమె.

గీ. తమ బలంబులఁ బొరిఁగొను తాతఁ జూచి
తిచ్చవడి యూరకున్న వివ్వచ్చుఁ డల్ల
కంసమర్దను ప్రోత్సాహ కారణమునఁ
దెలివిఁ గని, విల్లుఁగొన్ని, భీష్ముఁ దెగువఁ దాఁకె.

సూత్రి—అదిగో!—నామాటకు నిదర్శన మిప్పుడే కానిపించినది. మనప్రసంగమువలనఁ బ్రోత్సాహ మంది సంజయ వైశంపాయన వేషధారులు ప్రవేశించుచున్నారు. మన మిఁక నిష్క్రమింతము.

(ఇరువురును నిష్క్రమింతురు.)

విష్కంభము

రంగము—కురుక్షేత్రము.

(సంజయ వైశంపాయనులు ప్రవేశింతురు.)

వైశం—("తమబలంబులఁ బారిగొను" అను వెనుకటిపద్యమును మరలఁ బఠించి) అట్లు తాఁకినబీభత్సుం జూచి భీష్మపితామహుం డిట్లు పలికెను:—

చ. గుఱిమెయి మత్స్యయంత్రమును గూలఁగ జేయుట విన్నదాది సం
గరముఖమందు నీపటిమ గన్గొన వేడుక గల్గియుండి య
వ్విరటునిపీటమాత్ర మొకవీసము చూచితి; మంచివీలు చే
కుఱె నిపు, డిన్నినాళ్ళవలెఁ గొంకక చూపుము నీదు పాండితిన్.

సంజ—అందుల కర్జునుఁ డేమనెనో ?

వైశం—ఇట్లనెను:—

చ. ఇరువదియొక్కసారులు మహీతల మెల్ల జయించినట్టి దు
ర్భర బలశాలియైన భృగురాముఁ బరాజితుఁ జేసె నన్న కీ
ర్తిరమ లభించె సర్వజగతీతల నాథులలోన మీకు నొ
క్కరి, కటువంటి మీయెదుట గాండివి యెంతటివాఁడు నిల్వఁగన్.

ఇట్లయ్యిరువు రొకరినొకరు సంభావించుకొని, యగణ్యంబగు ధనుర్విద్యానైపుణ్యంబు మెరయఁ గొంతవడి పోరినమీఁదట, నర్జునుం డొకదివ్యాస్త్రమున సమ్మోహితుఁ డుకాఁగాఁ, పాండవసైన్యంబునందు భయార్భటులును, కౌరవ సైన్యంబునందు జయార్భటులును నొక్కసారిగ బయలు వెడలెను. శ్రీకృష్ణుఁడు మొగము చిన్నబుచ్చుకొని రథము నవ్వలకుఁ దోలికొనిపోయెను. అయ్యవసరమున—

ఆ. వె. తండ్రిపాటు చూచి, తమబలంబుల తొట్రు
పాటు చూచి, మదిని బట్టరాని
యాగ్రహంబు వొడమ నభిమన్యుఁ డానదీ
తనయు వీఁకఁ దాఁకి ధ్వజము ద్రుంచె.

అప్పుడు భీష్ముఁడు మున్నెట్టివీరాధివీరులకు నలవికాని తన తాల ధ్వజము నతఁడవలీలఁ గూలనేసినందుల కాగ్రహానుగ్రహములు రెండును దీపింప నొకయర్ధచంద్రబాణమును వింట సంధించి విడిచెను. అభిమన్యుఁడు దానిని మార్గమధ్యముననె నుగ్గునూచము గావించి, యావృద్ధవీరుని కార్ముకము తుత్తునియలు కావించెను తోడనె గాంగేయుండు కొండొక బాణాసనముం గైకొన, నాతండు దానింగూడ నల్లి కావించెను. ఇట్లు,

ఉ. పట్టినచాపమెల్ల సులభంబుగ భగ్నము సేయ నాత్మలో
బిట్టలుక న్వహించి యలభీష్ముఁడు శక్తి నొకండు వైచి వి
ల్పట్టిన ముష్టిఁ జీల్చుటయుఁ బార్థతనూజుఁడు దాన చాపముం
బట్టఁగ వీలు లేక, యొకవాలు చివాలునఁ దీసె నుగ్రతన్.

కాని, యంతలో నర్జునుని యరద మడ్డు వచ్చినందున నిరుత్సాహుఁడై చికిత్స కనునెపముమీఁదఁ శిబిరమునకుఁ జక్కఁబోయెను. అభిమన్యుఁడు కదనభూమినుండి కదలిపోవుటకుం గలకారణ మిది. శిఖండి విజృంభణము- దేవవ్రతుని శరతల్ప శయనము- గాండీవి పాతాళోదక సమాకర్షణము- మున్నగు తరువాతి యద్భుతచర్య లన్నియు నీవె చూచితివి.

సంజ—తాళు, తాళు!-(వినుట నభినయించును) కృష్ణార్జునుల కంఠస్వరములు వినవచ్చుచున్నవి -యిట్టివేళ వారెచ్చటికి బయలుదేరి యుందురు చెపుమా!

వైశం—ఇచ్చటనుండియె యాలోచన మెందులకు?-చూతము రమ్ము.

సంజ—ఇద్దఱము నిటే పోయిన నెట్లు?-కౌరవస్కంధావారమున నేమి జరుగుచున్నదో- వారుసైన్యాధిపత్యభారము మరల నెవరితల కెత్తుదురో చూడవలసి యున్నదికదా? నీవిటేఁగుము, నేనటేఁగెదను.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది శుద్ధవిష్కంభము.

పద్మవ్యూహము

ప్రథమాంకము

రంగము:— పాండవస్కంధావారము.

[విశ్రాంతివేషములతోఁ గృష్ణార్జునులు ప్రవేశింతురు.]

అర్జు—బావా! రాచపుట్టు వెంతపాడుపుట్టు వయ్యా!

సీ. తండ్రి లేఁడనుమాట తలఁపున బడకుండఁ
ప్రేమతో మమ్మెత్తి పెంచినాఁడు
గురుశిక్షతోఁ దృప్తి కుదురక రణవేద
మును స్వయంబుగ నూరిపోసినాఁడు
ధార్తరాష్ట్రులు మేముఁ దగవు లాడఁగ మా
పక్షమే యెపుడును బల్కినాఁడు
అడవుల కేఁగునాఁ డంబకంబులను ముందు
పొటపాటఁ గన్నీరు పుచ్చినాఁడు
అట్టి ప్రేమ స్వరూపు మహానుభావు
నస్మదీయ పితామహు ననఘుఁ బట్టి
పొట్టనుం బెట్టికొన్న పాపులకు మాకుఁ
బుట్టగతు లుండఁ బోవునే! కట్ట! యింక.

కృష్ణ—దానికేమి కాని- భగవంతుఁ డీమహామహుం జేసి, యూయ
చ్చు నంతటితోఁ దీసివేసె నని చెప్పందగును.

సీ. వాహనంబు సిడంబుఁ బాగయు శస్త్రంబు
లేనివారల నేయఁ బోనిఘనుఁడు
ఎనసి నూర్వురుయోధు లెత్తివచ్చినఁ గాని
విల్లు చేఁ బట్టని వీరవరుఁడు
తెగువ నిర్వదిమూఁడు దినములు పోరాడి
భార్గవుం గెలిచిన బాహుబలుఁడు

కాశీశు సుతలకై కడఁగి వచ్చినన్నృపా
వళి నొంటినోర్చిన వాఁడిమగఁడు
తండ్రిసౌఖ్యమె కోరిన ధార్మికుండు
బ్రహ్మచర్యంబు నెగ్గిన పావనుండు
చావుఁ దనచేత నిడికొన్న సాధ్వితుండు
కరము మహిమాన్వితుండు గంగాసుతుండు!

(ఇరువురు మౌనముతో ముందునకు నడతురు.)

అర్జు—బావా! నీ వేమన్నను సరియే కాని- యుద్ధము బహువిరుద్ధ కార్య మయ్యా!

ఉ. ఆరయఁ, దండ్రియుఁ దనయుఁ డన్నయుఁ దమ్ముఁడుఁ, శిష్యుఁడుం గురుం
డీరస మొప్పఁ దారసిలి, యెడ్డ వివేకము వీడి, వాఁడిమిన్
ధారణికోసమై పెనఁగి ధారణిపా లగుకంటె వేఱుగా
దారుణకర్మ మింకఁ గలదా! వలదా యలదాని రోయఁగన్?

కృష్ణ—పాపము శమించుఁ గాక!- నీకు మరల మతి పోయిన ట్లున్నది యుద్ధ మనఁగా వీరకర్మము- వీరకర్మమును నిందించుట వీరులను నిందించుట కాదా? చూడు,-

సీ. పురహరు కర్బుర శరాసన శింజి
నీరవ మింకఁ జల్లార లేదు
అలశిబి యజ్ఞహయావళి గిట్టల
గుంట లింకను బూడికొంట లేదు
పరశురాముండు తర్పణ మాచరించిన
బావు లింకను నింకిపోవ లేదు
దశరథరామ భూధవుఁడు కట్టిన సేతు
కట్ట యింకను వార్ధిఁ గలియ లేదు
వీరుల చరిత్రలీరీతి విశ్వమెల్ల
నిండి సాక్ష్యం బొసఁగుచుండ నీవు వీర

కర్మమున నెగ్గు గలదన్న ధర్మవిదులు
పరిహసింపక విడతురే! పార్థ! నిన్ను.

అర్జు—బావా! యుద్ధము, క్షామము, ఉప్పెన, భూకంపము, మహామారి, పారతంత్ర్యము, ననునివి యీయాఱు దేశమునకు మహోపద్రవకరములు. అట్టియుద్ధము ధర్మబద్ధ మనుట నాబుద్ధికి నచ్చకున్నది సుమీ!

సీ. బెబ్బులి చేరఁబడ్డ పెనుసంత వంతునఁ
గదలి దేశంబెల్లఁ గలఁత నొందు
దంతి మ్రింగిన కపిత్థంబు చందఁబున
నిట్టి కోశంబెల్ల వట్టిపోవుఁ
గార్చిచ్చునం గాలు కానవిధంబున
స్వజనసంతతి వినాశంబు నొందు
సాయంతనపు టింద్రచాపంబు వడువున
మాటిమాటికి సిరి మార్పుఁ జెందు
ఓజ చెడి యొడ్డుపట్టిన యోడ భంగి
దిక్కుమాలి గృహంబులు దిబ్బ లగును;
కటకటా! యెంచి చూడ సంగరముకంటె
ధాత్రిలోపల మఱి యనర్థంబుగలదె!

కృష్ణు—ఓయి వెఱ్ఱినాఁడ!—

సీ. పౌరుషంబు త్యజించి బ్రతికి యుండుటకంటెఁ
దొలుదీవివారికి దొసగు కలదె
పూర్వుల విఖ్యాతి బూదిఁ గల్పుటకంటె
నార్యసంతతి కమర్యాద కలదె
ఆయుధ దారిద్ర్య మనుభవించుటకంటె
భారతీయులకు లోపంబు కలదె
ఆత్మగౌరవముపై నాస్థ వీడుటకంటె
హైందవులకు మానహాని కలదె

రాజ్యమెల్లను బరుల కర్పణము చేసి
మగతనము చంపుకొని, కీర్తి మాపుకొని, య
హర్నిశలు పొట్టకొఱకు దాస్య మొనర్చు
కంటె మనజాతి కింకం గళంకంబు కలదె ?

అదికాక:—

సీ. సంగరాభావంబు సంఘటిల్లిననాఁడు
క్షాత్రబీజంబు నాశంబు నొందు
దానశస్త్రాస్త్రవిజ్ఞానంబు హరియించు
నవ్వల వ్యాయామ మంతరించు
నామీఁద దేహదార్ఢ్యము సన్నగిల్లును
నటువెన్క రోగము లతిశయిల్లుఁ
బదపడి దుర్బల హృదయులు ప్రభవింతు
రంతటఁ బెకబుద్ధు లావహిల్లు;
నదియె మొదలుగ నైకమత్యంబు సెడును
కత్తులుఁ గఠారములుఁ బుటగతము లగును
దేశ మంతటితోఁ దల్పు తెఱచియున్న
యిల్లువోలెను గుక్కల కెక్క యగును !

అర్జు—బావా ! అట్లయిన, యుద్ధము ధర్మబద్ధ మనియే నీ నిశ్చితాభిప్రాయమా ?

కృష్ణ—అదిగో ! అచ్చటమాత్ర మొకధర్మసూక్ష్మ మున్నది. రాజ్యస్థాపనార్థ మనియు, ధర్మస్థాపనార్థ మనియు యుద్ధము రెండువిధములు. అందు ధర్మస్థాపనార్థ మగుయుద్ధము కేవల ధర్మబద్ధము ఇప్పుడు మీ రొనర్చునది ధర్మస్థాపనార్థమే యగుటఁ జేసి యవశ్యమాచరింపఁ దగినది. ఎట్లందువా ?—

గీ. దశముఖుండు సీతనుంబోలె ధార్తరాష్ట్రు
లపహరించిరి మీరాజ్య మక్రమముగ;
దాశరథి సీతఁబోలెను చందాన మీరు
శాత్రవులఁ జంపఁదగు స్వరాజ్యంబుఁబోలెను.

అర్జు—(నడచుచు నడచుచుఁ గుడివైపునకు మరలును.)

కృష్ణు—అర్జునా! యేమది— యటు మరలితివి?— సుభద్రాదేవి యెందుచేతనో యీపూఁట జ్వరతాపాక్రాంతయై భోజనము సేయక పండుకొన్న దని విని యామెశిబిరమునుఁగూర్చి కదా బయలు వెడలితిమి?

అర్జు—అచ్చటి కిది చాలఁ జేరువతోవ. ఈ పాంచాల శిబిరముల యావలివే మన రాణివాసపు గుడారములు.

ఇద్దఱు—(పరిక్రమింతురు.)

కృష్ణు—(ఇరుకెలంకులు పరికించి) ఈదిక్కువారింకను విశ్రమింపలేదు.

సీ. కవచధారణమునఁ గలిగినయుమ్మచ
ల్లారంగ బయట నల్లాడువారు
తమవారియందు శాత్రవులందుఁ బడి మర
ణించినవారి గణించువారు
సలిపివచ్చిన సాహసపుఁ గృత్యములు తమ
ప్రియజనంబులకు విన్పించువారు
మఱునాఁటిసంగతి మనమున శంకించి
శకునపరీక్షలు సలుపువారు
ఆయుధములు సానల వాఁడి సేయువారు
గాయములకుఁ జికిత్సలు గాంచువారు
నెందుఁ జూచిన నీరీతి సందడిగను
నున్నవారదె, యీదెస నున్నవారు.

అర్జు—బావా! యీయోధులం జూచినపుడెల్ల నాహృదయము కట కట పడక మానదు సుమీ!

సీ. తనసముదగ్రి సౌధము తక్క నెఱుఁగక
ననవోలె విలసిల్లు నాగరకుఁడు
తనదుక్షేత్రంబు సేద్యము తక్క నెఱుఁగక
శ్రమఁ బాటుపడియెడు జానపదుఁడు
తనయింటిపట్టు సందడి తక్క నెఱుఁగక
సాధువై మెలఁగు వయోధికుండు
తనయాలి బిగికౌఁగిటిని దక్క నెఱుఁగక
యుత్సవాంబుధిఁ దేలు యువజనుండు
పెండ్లికై వచ్చినట్లు సంప్రీతిఁ దరలి
వచ్చి, మానిమిత్తము తమ ప్రాణములను
యుద్ధభువి కప్పనము సేయుచుండ నెట్లు
మానసము నీరు గాకుండ మాను నయ్య.

కృష్ణ—అర్జునా! యోధులు కుంపట్లవంటివారు శాంతిసమయముల యందు వేసఁగికుంపట్లవలె నేమూలనో పడియుండి, యుద్ధసమయములయందు శీతకాలపుఁ గుంపట్లవలెఁ గనకనలాడుట వారి ధర్మము సరి కాని- నీవనినట్లు శీఘ్రముగానే వచ్చితిమి! అదేకదా సుభద్రశిబిరము?

అర్జు—అదే. అడుగో! ద్వారపాలకుఁడు మనలఁజూచి, నివేదించుటకై లోపలి కరుగుచున్నాఁడు.

[అంతటఁ దెర యెత్తఁబడగా, సుభద్ర శిబిరము గోచరించును.]

సుభ—(శయ్య దిగి) రా చిన్నన్నా రమ్ము!—(అర్జుననివంకఁజూచి) *బాబును జూచినారా?

అర్జు—చూచుటకై పోతిమి కాని.—యప్పుడె నిద్ర పట్టినట్లు పరిచారకులు చెప్పినందునఁ జూడకయే రావలసి వచ్చినది. వైద్యులు కట్టు కట్టునప్పుడు నీవు దగ్గరనే యుంటివఁటకదా- వారేమి చెప్పిరి?

---

* అభిమన్యుఁడు.

సుభ—గాయము పూర్తిగా మానువఱకు యుద్ధరంగమునకుఁ బోఁ గూడ దనియు, నీలోపల నతనికి యుద్ధవృత్తాంతము లేమియుఁ దెలియనీయఁ గూడ దనియుఁ జెప్పిరి. (కృష్ణునివంకకుఁ దిరిగి) ఏ మన్నా! నిలుచుండియే యుంటి వేమి?

[కృష్ణార్జునులు కూరుచుండ, సుభద్ర శయ్యా నానుకొని నిలుచుండును.]

కృష్ణ—చెల్లెలా యీపూట నీముఖమునందుఁ గానవచ్చు విచారము నకుఁ గారణము బాబు గాయ మేనా?

సుభ—(బలవంతముగా నవ్వి) అన్నా? దానికి విచార మేల?—

క. వీరునకుం బోరునఁ బ్రతి-వీరునిశస్త్రమున సంభవిలు గాయంబు
న్నారీ ఫాలమునకుఁ గ-స్తూరీతిలకంబువోలె శోభయ కాదే?

కృష్ణ—అట్లయిన నేఁటివిచారమునఁ కేదో విశేష కారణమె యుండ వలెను.

సుభ—అన్నా! నావిచారమునకుఁ బదుమూఁ డేఁడ్లు ప్రాయము రాఁగా నేఁటి దనెద వేమి?

కృష్ణ—కురుక్షేత్రమున మారణభేరి యెప్పుడు మ్రోఁగెనో అప్పటితో దాని కవసానము రానేవచ్చినది కదా?

సుభ—(నిట్టూర్పుతో) అయ్యో! అంతటితో నేమయ్యినది?

గీ. సమరము తుపానుగాడుపు చందమునను
నెప్పు డేగతి మాఱునో యెఱుఁగ రాదు!
దానని జయాపజయములు దైవవశము
లనుచుఁ బెద్దలు వచియింతు రన్న! వినవె?

కృష్ణ—అది యట్టిదే కాని—మన మామెట్లు గడచితిమి.

ఉ. ఎవ్వని నాత్మలోఁ దలఁచి యెల్లపు డేను దలంకుచుందునో
యవ్విలుకాఁడు భీష్ముఁడు రణాంగణముం గయిసేసె నేఁడీకఁ
గవ్వలగుత్తుల ట్లఖిల కౌరవయోధుల మస్తకంబులం
గవ్వడి భీము లొక్క-క్షణకాలము లోపల దుల్చివేయరే?

సుభ—చిన్నన్నా

గీ. ఆదినుండియు భీష్ముని యడలు నీకుఁ,
గర్ణు నడ లెప్డుఁ జెప బావగారి, శస్త్ర
గురుని యడలు సదా నీకు మఱఁదగారి,
కలజయద్రథు నడ లనయంబు నాకు!

అర్జు—(పరిహాసముతో) ఏమిగా! యెన్నఁడుఁ జెప్పవైతివి!—సైంధవుఁడు నీదృష్టిలోఁ గర్ణ భీష్మద్రోణులకన్న మిన్న కాఁగలిగెనుగా!

చ. అడవుల నున్ననాఁడు ద్రుపదాత్మజ యొంటిగ నుంటఁ జూచి యా
జడమతి గొంచుఁ బోవుటయు, జాడల వెంబడి నేఁగి యాఖలున్
వడముడి కట్టి తెచ్చుటయు, వత్సలుఁ డగ్రజుఁ డాత్మ దుస్సలన్
గడుఁ దలపోసి పుచ్చుటయుఁ, గంజదళాక్షి! యెఱుంగ వేమొకో!

సుభ—ఎఱుఁగ కేమి?—నాభయకారణము దానికి సంబంధించినదే.

క. పరిపరివిధముల నెదఁ ద
త్పరిభవమున కడలి యడలి పలుయత్నములన్
దురమున మిము గెల్వఁగ దు
స్తరమగు సస్త్రం బొకం డతండు గడించెన్.

కృష్ణ—చెల్లెలా! * అలాతపిశాచన్యాయముగా—దానికొఱకు నీ వింతభయపడవలసిన పని లేదు. అది స్తంభనాస్త్రము కాని—మారణాస్త్రము కాదు; మఱియు నొకసారితో దానిపని సరి.

సుభ—అది యట్టిదె కావచ్చును. కాని. నాభయమునకు గొప్పకారణ మింకొకటి కలదు. అతని శిర మెవరైన నేలఁ గూల నేసినచో—

కృష్ణ—నేలఁ గూలనేసినఁగదా? త్రిశంకుస్వర్గమునఁ బడ నేయవచ్చును లెమ్ము. ఇంతకు, నివి తలఁపునకుఁ దెచ్చికొనియేనా నీవిట్లున్నది?

సుభ—అన్నా! తలఁపునకు నేను దెచ్చికొనలేదు-దుస్సల తెచ్చినది.

కృష్ణ—చెప్పు, చెప్పు—అదెట్లు?

సుభ—ఉత్తర వేవిళ్ళబాధ చూచి యేమియుఁ బాలుపోక, అత్తగారితోఁ జెప్పిరమ్మని మందారికను బంపితిని. అది మగిడి వచ్చునప్పుడు దుస్సల చూచి—"నీ వెవతె" వని యడుగ "అమ్మా

---

* కొఱవి చూచి దయ్య మనుకొనినట్లు.

సుభద్రాదేవిగారి పరిచారిక'' నని యది యుత్తర మొసఁగెనఁట. ఆపాటున మఱుక్క మారెమును మూతి బారెమును జేసికొని. "తన మగఁడు నాకొడుకుం జంపి నాకుఁ బుత్త్రశోకము కలిగించినందులకు నీయజమానురాలు పొంగి పొరగిలఁబడుచున్నది కాఁబోలును—! నామగఁడు తనకొడుకుం జంపి నాకూఁటఁ గలిగింపఁ గలఁ డని యూకులుకులాడితో నాపలుకులుగాఁ జెప్పుము." అని పలికినదఁట!

కృష్ణు—మందారిక యంతమాట విని యూరక వచ్చునది కాదే!

సుభ—రానే లేదు—"అమ్మా! నీమగని మగతన మంద తెలిసినదే కాని—నేఁ బోయి యీమాట చెప్పిన నీకుఁ బుత్త్రశోకమునకుఁ దోడు భర్తృశోకముకూడ సంపాప్రిప మగునేమో యాలోచించు కొనుము!" అని మఱి చక్క వచ్చిన దఁట.

అర్జు—సరియే—అనవలసినమాట యేమో మందారిక యననే యన్నది; దానినే నేను స్థిరపఱిచెదను:—

చ. వల దని ధర్మనందనుఁడు వారణ సేయు వధింపమాని య
య్యలఘుబలుండు భీముఁడు జయద్రథు లజ్జ హరించె నాఁడు; తొ
య్యలి! యల * సింధురాణ్మహిషి♦ యెదువ రాలితనఁబు నీమనం
బెలరుప రేపొ మాపొ హరియించెద నే నిఁక నూరడిల్లుమా!

కృష్ణు—అమ్మాయి! వింటివిగదా మీయాయనప్రతిజ్ఞ?— సైంధవు నిపూఁటతో లేనివానిఁగా నిశ్చయించుకొని, పోయి భోజనముచేసి విశ్రమింపుము. అర్జునా! దుర్యోధనుఁడు సర్వసేనాధిపత్యమును గూర్చి యాలోచించుటకు రాజుల నందఱను సభాశిబిరమునకు రప్పించు సన్నాహములో నున్నాఁ డని మనగూఢచారులు వచ్చి చెప్పిరికదా?—పైసంగతి యేమిజరిగినదో పోయి తెలిసికొందము రమ్ము (అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము.

---

* దుస్సల ♦ మహారాణీత్వము.

పద్మవ్యూహము

ద్వితీయాంకము

రంగము:—కౌరవ స్కంధావారము.

[శకుని దుర్యోధనులు విశ్రాంతి వేషముతోఁ బ్రవేశింతురు.]

శకు—సరి కాని—యెక్కడికి కిప్పుడు మన ప్రయాణము ?

దుర్యో—ఆచెట్టుక్రిందికి. ప్రత్యేకము నీతో నొకసంగతి మాట్లాడ గోరి, యందుల కదియ ర్హస్థల మని తీసికొని వచ్చినాఁడను.

శకు—నీవు మాట్లాడఁ గోరినసంగతి సేనాధిపత్యమును గూర్చి యై యుండవలెను.

దుర్యో—మామా ! పరేంగిత జ్ఞానమునందు నిన్ను మించినవా రెవ రున్నారు ! అందువలననే నీతోఁ జెప్పక యేకార్యమునందును బ్రవేశింపను.

శకు—గమ్యస్థానము చేరినారము. ఇఁక నీవు చెప్పఁదలఁచిన దేమో చెప్పుము.

దుర్యో—మామా ! చెప్పుట కేమున్నది ?— సేనాధిపత్యమును గూర్చి *దధిప్రీహిన్యాయముగా నాకేమియుఁ బాలుపోవుటలేదు.

చ. గురుఁ డఖిలాస్త్ర కోవిదుఁ, డకుంఠిత విక్రముఁ, డాజిలో సురా
సురులకుఁ గూడ దుర్జయుఁడు; నూతసుతుండును నట్టివాఁడె;యీ
యిరువురిలోన సైన్యముల కెల్ల నధీశ్వరుగా నొనర్ప ని
వ్వరు తగువారలో యని యవారిగ నామది శంకఁ బొందెడున్.

ఇంకొకటి—

గీ. గురునియెడ నెల్లవారికి గురియు, కాని—
పార్థునెడ నాయన విశేషపక్షపాతి ;
కర్ణుఁ డలపార్థు నెడలఁ గర్కశుఁడె, కాని—
యతనియెడఁ గొందఱకుఁ గిట్ట దాత్మయందు.

---

* పెరుగు వడ్లు కలిసినట్లుగా.

అది యటుండనిచ్చి, కర్ణున కాధిపత్య మిచ్చితి మనుకొనుము,

మ. ధనురాచార్యుని నన్ను నల్పునిగ స్వాంతంబందు భావించి యా
తని కర్పించెఁ జమూధిపత్వ మని రోషం బెందు ద్రోణుం డెడన్;
ఆతనిం గాదని యాచార్యున కిచ్చిన,—
తనకై ప్రాణము లొడ్డి యర్జునుని దోర్దర్పం బడంపంగ నెం
చిననన్నుం జినచూపు చూచె నని రోషించు న్మది నర్జునున్.

కాబట్టి, వ్యవహార మిదమిత్థ మని నిర్ణయించుటకు వలనుపడక ముందునకు వచ్చిన గోయి, వెనుకకుఁ బోయిన నూయి—యను సామెతకుఁ దార్కాణముగా నున్నది. ఈలాంటి విషమస్థితియందు నీబుద్ధి నడచిన ట్లెవరిబుద్ధియు నడవదు. కావునఁ, గర్తవ్యము * నిర్ధరించి నాయాందోళనము నివారింపుము.

శకు—సేనాధిపత్యమున గతి తరువాత నాలోచింతము కాని—నీ కింకను యుద్ధము సాగింపవలె ననియే యున్నదా ?

దుర్యో—(ఆశ్చర్యముతో) ఏమి మామ ! అట్లడిగితివి !

శకు—ఏమా ?

క. కనుబల్లిదుఁ డగుభీష్ముని-బడ నేసినవారి కింకఁ బరు లధికులో!
గుడి మ్రింగినవారలక-ప్పడములె కాతలుపు లనఁగఁ బార్థివముఖ్యా!

మఱియు,

చ. కలన నదీతనూభవు శిఖండి శరావలి నొంచి రక్తధా
రలు వెడలించుచుండ; గుణరావముతో విశిఖాళి రెండుచే
తుల సిగిడించి యీఁగలను దోలినయట్లు కిరీటి తూల్చె దో
ర్విలసన మొప్ప నేఁడు మనవీరుల; వారి జయించు టెట్లిఁకన్ ?

దుర్యో—(అనిష్టముతో) మామా ! నాముందు వారిప్రతాపవర్ణన మెందులకు గాని— యింతకు వచ్చినతరువాత సంధి చేసికొ మ్మనియెదవా ?

శకు—(చిరాకుతో) పాడుసంధి !—సంధిమాట యెత్తినవా రెవ్వరు?

దుర్యో—మఱి ?—

---

* నిర్ణయించి.

శకు—మఱి మార్గమే లేదా?—ఆగర్భశత్రులను నడంచుటకు యుద్ధమె కావలెనా?

దుర్యో—(ఆశతో) అట్లయిన, నీవృథాప్రయాస మంతయు నెందులకు? అదే చెప్పుము.

శకు—చెప్పెడి దేమిటి?—

గీ. నచ్చుబాటుగ మన కచ్చివచ్చినట్టి
పాచికలు చల్లఁగా నుండఁ బవర మేల
అధిప! నేను సృజించిన యత్నములకుఁ
గలదె తిరుగింక మూఁడులోకములయందు?

దుర్యో—(వికాసముతో) మామా! యీమాట నామనసునందును నున్నదే కాని—యందుల కవకాశ మబ్బుట యసంభవ మని పయికిఁ దేల లేదు.

శకు—అనగా—•నాద్యూతప్రియుఁ డొంటరిగా నెట్లు దొరకు నని యేనా?—అందులకిదియే తగిన యదను.

ఉ. దిట్టతనంబు మీఱఁగ యుధిష్ఠిరు నెవ్వరు పట్టి తెత్తురో
యట్టి యవక్రవిక్రములకంచిత సర్వబలాధిపత్యపుం
బట్టము గట్టువాఁడ నని పల్కుము నిండుసభాంతరంబునం,
బెట్టుగ నీతలంపు నెఱవేఱును దప్పక కౌరవేశ్వరా!

దుర్యో—(ఉత్సాహముతో) సెబాస్! మామా! సెబాస్!—
* ఏకక్రియా ద్వ్యర్థకరీ బభూవ యనునట్లు—నీయాలోచన ముభయతారకముగా నున్నది!

గీ. స్వామికృపచేత నీయెత్తు సాగెనేని
కడఁగి యీసారి నూత్నేండ్లు కానలందు
వాస మొనరింపఁ బందెము వయిచి, వార
లూరిమొగి మెన్న డీక జూడకుండఁ జేతు,

శకు—ఈసరికి రాజు లందఱు సభాశిబిరము చేరి నీకొఱకు నిరీక్షించు చుందురు, పోయి ముందుపని చూతము రమ్ము.

• ధర్మరాజు   * ఒకపనివలన రెండుప్రయోజనములు,

ఇద్దఱు --(మరల వెనుకకు నడతురు.)

(అంతటఁ దెర యెత్తబడఁగా—కృపాశ్వత్థామ దశ్శాసన సైంధ ప్రభృతులు కోలాహలముతోఁ బ్రవేశింతురు)

దుర్యో—(సత్వరముగ సమీపించి) దుశ్శాసనా కర్ణుఁడు రాలేదా

దుశ్శా—వచ్చి, నీవు లేవని కాఁబోలును, తాతగారిని జూచివత్తు నని చెప్పి యేఁగినాఁడు. (వినుట నభినయించి అదిగో బండిచప్పుడు! మాటలోనే వచ్చినాఁడు.

అశ్వ—(కృపునితో రహస్యముగా)మామా! చూచితివా మహారాజు పక్షపాతము? ఇతనికిఁ గర్ణుఁ డొక్కఁడే వెలితిగఁ దోఁచెను

కృపు—(రహస్యముగానే) అబ్బాయీ! యిదివఱ కతఁడు యుద్ధము నందు లేఁడు కదా? అందువలన నతనింగూర్చి ముందు విచారించుటలోఁ దప్పేమియు లేదు.

(అంతటఁ గర్ణుఁడు ప్రవేశించును.)

దుర్యో—(కర్ణున కెదు రేఁగి) మిత్రమా యెచ్చటి కేఁగితివి?

కర్ణ—నేనా?

గీ. ఎవరికతమున నీపది దివసములును
దాల్చెనెతినో శస్త్రము మా తాతగారి
పోంత సమరంబున కనుజ్ఞఁ బొందుకొఱకు
వసుమతీశ్వర! నేఁ బోయి వచ్చినాఁడ.

దుర్యో—ఈలాటిమర్యాదలు నీసొమ్ము. సరి కాని. సర్వసేనాధిపత్యమునుగూర్చి యేమి యాలోచించితివి.

కర్ణ—ఆలోచన కేమున్నది? మన సేనాను లందఱుఁ *సేనానులే కదా!

దుర్యో—అదే వచ్చినచిక్కు—అందువల్లనే యేమియుఁ బాలుపోక, నీయిష్టపడినచో నొకదారి త్రొక్కుటకు నిశ్చయించుకొన్నాఁడను.

కర్ణ—మహారాజా! యేవిషయమునందుఁ గాని నాయిష్టముకొఱ కెన్నఁడు నెదురుచూడ వలదు సర్వత్ర నీయిష్టమే నాయిష్టము.

* కుమారస్వామి

దుర్యో—అట్లయిన రమ్ము. (కర్ణుని చేయి పట్టుకొని కొలువుకూటము నకు వచ్చి కృపునివంకఁ జూచి) ఆర్య! ఆచార్యులవారేరి?

కృపు—మహారాజ! వైద్యు లలుగులం దీయుట పూర్తి కానందున నీవు కొలువుకూటమునకు రాఁగనే వర్తమాన మంపవలసిన దని చెప్పి ముందు మమ్ములం బంపినారు.

దుర్యో—దుశ్శాసనా! సత్వరముగ బండి తీసికొనిపోయి యాచార్యులవారిని దోడుకొనిరమ్ము.

దుశ్శా—(నిష్క్రమించును)

దుర్యో—(సైంధవును ద్దేశించి) బావా! కడమవారందఱు వచ్చినట్లేనా!

సైంధ—అందఱు వచ్చి, యిక్కడ నుక్కగా నున్నందున నరుగో! పార్శ్వభాగములయందలి చవికలలోఁ గూర్చున్నారు.

దుర్యో—(కలయం జూచి) లేవకుఁడు, లేవకుఁడు,-ఇప్పుడు డట్టిమర్యాద లవసరము లేదు. (కర్ణునివంకఁ దిరిగి) అన్న ట్లడుగ మఱచితిని. [1] భవితవ్యమును గూర్చి తాతగా రేమయిన సెలవిచ్చినారా?

కర్ణ—కోటి సెలవిచ్చినారు. అన్నిటియొక్కయు సారాంశము- సంధి చేసికొనటయే శ్రేయస్కర మని.

దుర్యో—(వికటముగా నవ్వి) సుయోధనుని కంఠమునఁ బ్రాణ ముండగాఁ నది యెన్నఁడుఁ బొసఁగనేర దని చెప్పకపోయితివా?

కర్ణ—అట్లు చెప్పలేదు కాని—కర్ణుని కంఠమునఁ బ్రాణ ముండఁగా నది పొసఁగనేర దనిమాత్రము చెప్పితిని.

అశ్వ—(వికటముగా) మేలంగరాజా!-మేలు! యథార్థము చెప్పితివి! సంధియెడ నీకు మొదటినుండియు సవతితల్లి ప్రేమయే గదా!

కర్ణ—నాకే కాదు-నీకును, నీతండ్రికిని, నీమామకును దక్కఁ, గడమయందఱకును గూడ నట్లే. కారణము తెలియునా?-

గీ. భీరు లెప్పుడు సంధియే కోరుచుంద్రు
[2] విగ్రహామె కోరుచుందురు వీరు లెప్పుడు;

---

1 ముందరిసంగతి 2 యుద్ధము

అశ్వ—అట్లుకాదు—

ఎపుడు నీచులు కలహమే యిచ్ఛగింతుర్తి
సంధియే యిచ్ఛగింతురు సాధు లెపుడు.

అని శాస్త్రము.

కర్ణ—(రోషముతో) అలా గేమి ?—

చ. అవనిపు నువ్వగల్లు దిను నాతని శత్రుల మేలు గోరి రే
పవ లిటు సంధికై పలవువారలె నీచులో—రాజుకోసమై
బవరమునందు ముందుఁ దమ ప్రాణము లర్పణ సేయుఁజూచు వీ
రవరులె నీచులో యనుగరాదె సభంగల పిన్న పెద్దలన్ ?

కృపా—అబ్బాయి ! పాకము ముదురుచున్న దిఁక విరమింపుము.

అశ్వ—(వినిపించుకొనకయే) ఓహో! లజ్జాదేవి యీతని నెంతవిచ్చల విడిగా విడిచిపెట్టినది ! రణరంగమునకు ముందడుగు వేసి, రాజు నిమిత్తము ప్రాణము లొడ్డు మేము శత్రులమేలుగోరు కృతఘ్నుల మఁట !—యేదో వంక నాధారము చేసికొని యింతవఱకు నింట గూరుచుండి—* ఉలూఖల శేషన్యాయముగా-నిపుడు సిద్ధపడిన తాను రాజుకొఱకుఁ బ్రాణము లర్పించు పరమభక్తుఁడఁట !

ఉ. దండిమగండు భీముఁ డతిదర్ప మెలర్పఁగఁ ద్రిప్పి పెద్దదా
దండము వీచినప్పుడును; దత్తనయుండు ఘటోత్కచుండు కో
దండము త్రుంచి తెరిసయితంబుగ మీఁదికి నెత్తినప్పుడున్
దండను నెవ్వరుంటఁ బతి దక్కెనొ సభ్యు లెఱుంగ కుండిరే !

కర్ణ—మహారాజా ! వింటివా యీ మెత్తిపోఁడుపు !— దండు వెనుక నిలచి యాశీర్వచనపనస చెప్పవలసినవారికి, విల్లమ్ములు చేతికిచ్చి వీరవేషము వేయించిన నేమనుటకు సాహసింపఁగు !

అశ్వ—ఇది రెండవ తప్పు !— స్తోత్రపాఠములు చదువుటకు దండు వెనుక నుండుపృత్తి సూతుండగు నిది కాని నాది—కాదు.

దుర్యో—మిత్రమా ! కృపాచార్యులవా రన్నట్లు పాకము ముదిరి పోవుచున్న దీసీ నెన నింతటఁ విరమింపుము.

* ఉలూఖలము అత్తగారు పెట్టినప్పుడు ... విహాస్యముగా రోలువాకపట్లు.

కర్ణు—(వినిపించుకొనకయే) అది యట్లే కావచ్చును; కాని—

గీ. యజనములయందు శ్రాద్ధములందుఁ దేర
కూళ్ళతోఁ బొట్టలను నించికొనుచుఁ, జిలుక
పలుకులం జీవనము పుచ్చు కాఁప లేమి
ఘనులు సూతులకంటె లోకంబునందు ?

అశ్వ—"వినాశకాలే విపరీతబుద్ధి" యనునట్లు, చివరకు నీ కీబుద్ధి కూడఁ బుట్టినదా !

క. బ్రాహ్మణవేషముఁ దాలిచి,
బ్రాహ్మణసన్నిధిని విద్యలం బడసి, చివరకుం
బ్రాహ్మణనింద యొనర్చెదు
బ్రహ్మద్వేషంబు చిచ్చువంటిది సూవే !

మ. అతిపాతంబుగ హైహయాధముఁడు బ్రహ్మద్వేషముం బూని భూ
స్థిత రాజన్యకులంబు లన్నిటికిఁ దెచ్చె న్మూలవిచ్ఛిత్తి; దు
ర్మతి ! నీ విప్పు డకారణంబుగను బ్రహ్మద్వేషివై దుర్మదో
ద్ధతిఁ గల్పింపఁగఁబోకు సూతకులవిధ్వంసంబు నీపేరిటన్.

కృపా—అబ్బాయి ! అతనితో నేమి?—జగత్పూజ్యులగు నగ్రజన్ముల యౌన్నత్య మెవ్వ రెఱుఁగరు ?

కర్ణు—ఆహా !—యెఱుఁగ కేమి ?

ఉ. లోకుల వాకిళు ల్పవళులు న్నిశలుం బాడిగాఁగ మెట్టుచు
న్వాకొను చిచ్చకంబులు తృణంబున కేనియుఁ జేయి చాచుచున్
మాకుఁ జిరాయురున్నతులు, మాకు శుభంబు,సుఖంబు మాకటం
చేఁగెడు బ్రాహ్మణాధముల నెవ్వ రెఱుంగనివారు ధారణిన్.

అశ్వ—ఓరీ, వీరంమన్యా ! * అలాబూ పాషాణ న్యాయముగా—నీపుట్టువునకుఁ దగినట్లే పలికితివి ! చూడు—

మ. పాను పొవ్ప న్మను దస్యులం గెలిచి జంబూద్వీప మాద్యంతమా
ర్జనముం జేసిన దెవ్వ?—రాగమములున్ శాస్త్రేతిహాసంబులున్

* జాతిలోఁ బుట్టిన సొరకాయ జాతనెటియు రయిట్లుండునో యట్లే పెరుగునట్లు

దనరం గల్పన నల్పి జ్ఞానమును బోధ్యల్లీల వ్యాపింపఁ జే
సినవారెవ్వరు? బ్రాహ్మణోత్తములె కా? చింతింప మూఢాత్మకా!
ఇంకను జెప్పుమనెదవా ?

సీ. ఆదికాలమున నార్యావర్త మెల్లను
పాలించిన [1] మనువు బ్రాహ్మణుండు
ధరణీతలంబెల్లఁ దనదిగాఁ గన్న త
తస్వి కశ్యపుఁడును బ్రాహ్మణుండు
[2] శక్రునిచేత ముజ్జగము లేలించు నే
ర్పరి బృహస్పతియును బ్రాహ్మణుండు
క్షత్రిజాతి నిరంకుశత్వ మడంచిన
పరశురాముండును బ్రాహ్మణుండు
పృథివిపులకెల్ల విలువిద్దె బిచ్చు మిడిన
ప్రథితయశుఁడు నాతండ్రియు బ్రాహ్మణుండు;
ప్రాకటంబగు బ్రాహ్మణ ప్రాభవమున
కింతకంటె నిదర్శన మేమి వలయు ?

కృపా—అబ్బాయి! అతనితోపాటు నీకుఁ గూడ మతి పోయినదా యేమి అన్నికంఠము లొక్కకంఠమై, యన్ని చేతు లొక్క చేయిగాఁ బని చేసి, యాత్మగౌరవము కాపాడుకొనవలసిన యిటు వంటి విషమస్థితియం దన్నిటికిని హానికరమైన యీబ్రాహ్మణా బ్రాహ్మణ వివాద మేమిటి! అదికాక—మానవసంఘ మొక వృక్షము వంటిది:—

సీ. బ్రాహ్మణుల్ [3] మూలంబు భంగి విజ్ఞానజీ
వనము సర్వత్ర వ్యాపనము సేయ
క్షత్రియుల్ [4] స్కంధంబు చాడ్పున సకలభా
రంబోర్పునం ధారణం బొనర్ప
వైశ్యులు [5] శాఖల వడువున దిశ లంటఁ
బ్రాఁకి దారిద్ర్యాతపం బడంప

1 స్వాయంభువుఁడు, 2 దేవేంద్రుఁడు. 3 వేరు. 4 మొదలు. 5 కొమ్మలు.

శూద్రులు [1] త్వచమట్లు సుత్రిక్కుచు నెండవా
నలఁ బరసంరక్షణంబు సలుప
మహిత మానవ సంఘ [2] ద్రుమంబు భువన
నందనంబున కెల్లను నంద మగుచు
నలచతుర్విధ పురుషార్థ ఫలసమృద్ధిఁ
గాంచుఁ; గొఱవడెనేని నశించు నిజము।

అశ్వ—అట్లయిన, మామా! యిఁక నే నిట్టిప్రసంగము సలిపి యితరుల కవమానవ్యథ కలిగింపను. కాని—

గీ. శంతనుతనూజుఁ డనిఁ గూలునంతవఱకు
శస్త్రము త్యజింప శపథము సలిపె నితఁడు;
ఇతఁడు తెగునంతవఱకు నే నిదె మదీయ
శస్త్రము త్యజించుచుంటి నిశ్చయముగాను.

(అని ఖడ్గమును విడుచును.)

కర్ణ—[3] అంధకరదీపికాన్యాయముగా-నీవంటివాఁడు శస్త్రము ధరించినను, త్యజించినను గూడ సమానమే!

అశ్వ—వింటివా మామా! యీతుంటరి వాగుడు!—ఓరీ! రథకారకుల కలంకా! రాధా గర్భ భారభూతా!

గీ. శస్త్ర ముడిగితి నని సాహసంబు వలదు
ముష్టియే చాలుఁ జుమి నిను మోది చంప
ముష్టియుంగూడ నేల నీమూర్ధ మిదిగో!
కాలఁ జిదుప్రలు గావింతుఁ గాచికొనుము!

(అని తన్నఁ బోవును.)

కృపా—(అడ్డుకొని) వత్సా! వత్సా! వీనిమాట లేమి లెక్క?—రాజు మొగము చూడుము. (అని వెనుకకుఁ దీసికొనిపోవును)

కర్ణ—(ఆగ్రహముతో) ఓరీ! వాగాడంబరా! కుక్షింభరా!

గీ. అరయఁ బిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రమనుచు
సైచినకొలంది నీసాహసంబు హెచ్చె;

---

1 పట్టు. 2 చెట్టు. 3 గ్రుడ్డివాని చేతి దివ్వెయువలె.

రగన్న నీకండలం జెక్కి రాపులుంగు
గమికి సంతర్పణ మొనర్తుఁ గాక మూర్ఖ!

(అని ముందున కుఱుకును.)

దుర్యో—(పట్టుకొని) మిత్రమా! యేమి యన్యాయ మిది! మనలో మన మిట్లు తగవు లాడుకొనిన శత్రువులు పరిహసింపరా?—

అశ్వ—(అపవారించుచు) మహారాజా! * ఉద్ఘాటదంష్ట్ర భుజగన్యాయముగా-బ్రతుకు వీని నీవింకను నెందులకు రక్షింపఁ జూచెదవు?-

ఉ. వీఁడె కతంబు పోరునకు, వీఁడె సుమీ శనిగాఁడు నీకు నీ
తోడి సమస్తయోధులకుఁ, దుంపెసలాడక మానసంబునన్
వీడుము వీనిపై నెనరు, వీడుము నాకెడగల్గ, నేటితో
మూఁడెను వీని కాయు వీఁక బోలదు సైపఁగ సుంతయేనియున్.

కర్ణ—మహారాజా యితని దుష్ప్రలాపములకు నాయొడలు మండి పోవుచున్నది— వీనిరక్తమునందు మజ్జన మాడినఁ గాని యిది చల్లఁ బడదు. విడువుము- నన్నిఁక విడిచిపెట్టుము (అని పట్టు వదల్చుకొనును.)

దుర్యో—(మరల నడ్డుకొని) అదిగో బండిచప్పుడు—ఆచార్యులవారు వచ్చుచున్నారు—

కర్ణ—(అంతలో నపవారించి) రానిమ్ము -ఆయన కెవరు శిష్యులో వారు భయపడుదురు

చ. గిరిసుత తల్లివోలెఁ దిలకింప, శరాసన వేద మర్మముల్
పురహరు సన్నిధానమునఁ బూర్తిగ నేర్చి, పరీక్షయిచ్చి, యా
హరుని కటాక్షమాలికయు, నాయన గొడ్డలియుం గడించి సు
స్థిరయశుఁడైన భార్గవుని శిష్యుఁలు కర్ణుఁడు నీ వెఱుంగవే?

అశ్వ—చెట్టుపేరు చెప్పి కాయ లమ్ముకొనుట యనఁగా నిదియే!

గీ. తెలిసి, సలిపిన మోసము-తెలిపినట్టి
విద్య వ్యర్థము గాఁగ శపించి వెడలఁ

* కోఱలు తీయఁబడినపాము పైకి భయంకరముగఁ గాన్పించుటయే కాని-కరవ నేరదు.

గొట్టిన న్నిగ్గు విడిచి యాగురుని పేర
చెప్పికొని యిందు మర్యాదఁ జెందఁజూచు !

కృపా—హాఉష్ ! కట్టుకట్టు కనఁబడుటలేదా ?- (అని వచ్చుచున్న ద్రోణుని సూచించును.)

(అంతట దుశ్శాసన ద్రోణులు సత్వరముగఁ బ్రవేశింతురు.)

ద్రోణు—మహారాజా నాయాలస్యమును మన్నింతువు గాక. (పార్శ్వములకుఁ దిరిగి) సభ్యులారా మీకందఱకు శ్రమ కలిగించి నందులకుఁ జింతిల్లుచున్నాఁడను. (కర్ణుని వంకఁ జూచి) ఏమిది యంగరాజు మొగము కోపరసమునఁ దేలియాడు చున్నది (అశ్వత్థామవంకఁ జూచి) సరి — నాయాలస్యమునకు నేను జింతింపవలసిన పనిలేదు ! అంగరాజును మావాఁడును గలిసి సభ్యుల కేదో వినోదము గలుగఁ జేయుచునే యున్నవారు (రాజువంకకుఁ దిరిగి) మహారాజా ! కర్తవ్య మేమి ?

దుర్యో—సర్వసేనానాయక నిర్ణయమే

ద్రోణు—దానికిఁ బెద్ద యాలోచన మెందులకు ?- నీకుఁ దోఁచినవారి నొక్కరిని నీవే పేర్కొనుము.

దుర్యో—ఆభారము నాపైఁ బెట్టికొనుట నాకిష్టము లేదు.

ద్రోణు—మఱి యెట్లు సేయ నెంచితివి ?

దుర్యో—ఇట్లు; —(అని సభవంకకుఁ దిరిగి) ఓసభాస్తారులారా

గీ. ప్రాణములతోఁడ నెవ్వరు పాండవాగ్రి
జన్ముఁ గొనితెచ్చి యర్పింప శపథ మాచ
రింపనేర్తురొ వెండు వారికి సమస్త
వాహినీనాయకత్వ మర్పణ మొనర్తు.

(అని కర్ణునివంకఁ జూచును.)

కర్ణ—(గర్వముతో) మహారాజా నావంకఁ జూచెద వేమి ?

మ. ధనురాచార్యుఁడ నంచుఁ బేరుఁ గొని యత్యంతంబు నీచేత మ
న్ననలం గాంచెను ద్రోణుఁడుండ-మఱి యెన్నన్ రానిశూరుండుత

త్తనయుం డుండ నిఁకేల మూర్ఖులు చేత న్వాతఁ గావట్టివా
రనుమానింపక యుందుఁ జూపు మనవయ్యా! వారిసామర్థ్యముల్.

ద్రోణు — (తిరస్కారముతో) అగరాజా! [1] కరభదోహనన్యాయముగా - ఈభారము నిగలకెత్తుట యయుక్తమే అర్జునుని నీకు వంతువేసి మహారాజు నీపైఁ గొండంత యాన పెట్టుకొని యున్నాఁడు. అదిమాత్రము నిర్వహించి యతనిముద్దు చెల్లించితివా-చాలును. (దుర్యోధనునివంకకుఁ దిరిగి) మహారాజా! యీ సంగ్రామమున నిన్నొకటి యడుగవలసి యున్నది; యెవ్వరో యొకరు పాండవాగ్రజుం బట్టి యర్పింతు రనుకొనుము- అప్పుడు నీ వతని నేమి చేయుదువు?

దుర్యో — మీయభిప్రాయము తెలిసినది- చేఁజిక్కినవానిఁ జంపునంతటి యక్రమమునకు సుయోధనుఁడు పాల్పడునని యెన్నఁడును శంకింపవలదు.

ద్రోణు — అట్లయినచో,—

చ. సురగణ మెల్లఁ గోటవలెఁ జుట్టును గ్రమ్మినఁ గ్రమ్ముఁగాక! శం
కరుఁడు స్వయంబుగా వెసలి కావఁగ వచ్చిన వచ్చుఁగాక! భూ
వర! విను మస్మదీయ భుజపాటవముం గని మీరలెల్ల ర
చ్చేరువుపడన్ యుధిష్ఠిరుని జీవముతోడనె పట్టియిచ్చెదన్.

(తెరలోఁ గలకలము.)

దుర్యో — ఆచార్యోత్తమా! మీశపథము విని సభ్యు లందఱు జయజయధ్వానములు సేయుచున్నారు. అభిషేకద్రవ్యము లాచవికలో సిద్ధము సేయఁబడి యున్నవి. దయచేసి, [2] పట్టము ధరింపుఁడు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది మహాకవి కాళ్ళకూరి నారాయణరాయ విరచితంబగు
పద్మవ్యూహ మహానాటకమున
ద్వితీయాంకము.

---

1 అప్రయత్నముగా గాడిదపాలు పితికినట్లు. 2 అభిషేకకాలమున నొసట గట్టు పట్టె.

విష్కంభము.

సుమిత్రుఁడు—(ప్రవేశించి) పసిబిడ్డముద్దే ముద్దు-పనిముద్దే ముద్దు మూఁడుదినములనుండి బాబుగారు శిబిరమునందే యుండవలసి వచ్చుటంజేసి- "ముంజేయి యాడిన మోచేయి యాడు" నను సామెతగా—ఆయనసారథి నగు నేనును బలికి మొగమువాచి గోళ్ళు గిల్లుకొనుచుఁ నింటఁ గూర్చుండవలసినవాఁడనైతిని! (పరిక్రమించి) చిన్నదొరగారు నిన్న భగదత్తుం బ్రదుంచినప్పుడును, గర్ణు నోంచినప్పుడును జూపిన ప్రతాపమును గన్నులారఁ గాంచఁగలిగిన నాతోడివారి యదృష్టమే యదృష్టము! నేఁడు తెల్లవారుసరికి వినవచ్చిన కింవదంతి నిజ మగు నెడలఁ గౌరవులకు నిన్నఁ గలిగిన పరాభవమే యందులకుఁ గారణమై యుండవలెను, కాని, మొన్నను నిన్నను లేనిది నేఁడట్టి యుధిష్ఠిరమహారాజుగారిం బట్టఁగలుగుటకు ఆచార్యునకుఁ గ్రొత్తగా వచ్చిన కొమ్ము లేమిటి! (వినుట నభినయించి) ఆ మహాకలకల మేమయి యుండును జెపుమా (ప్రక్కకుఁజూచి) భేరి పాఱవేసిన గుఱ్ఱమువలె వచ్చు నీతఁడెవ్వడై యుండును! (పరికించి) ఓహో! ఆఁడంగులకు యుద్ధవార్తలు నివేదించు జంఘాలికుఁడా!—భద్రా! ఆకలకల మేమి?—ఓరి పొగరుబోతా! నోరు విప్పిన నోటిలోని ముత్తెములు రాలిపోవు ననియా పలుకకుండనే పరుగిడుచున్నాఁడవు? పోనిమ్ము, బాబుగారి స్థితి నేఁ డెట్లున్నదో చూచినవెనుక నేనె పోయి తెలిసికొనెదను. (కొంచెము నడచి) భద్రా! బాబుగా రేమి చేయుచున్నారు!-ఏమంటివి?—ఉత్తరకుమారికా ద్వితీయులై యున్నా రనియా?-అట్లయిన నిది సమయము కాదు-తరువాత వచ్చెదను.

(అని నిష్క్రమించును)

ఇది విష్కంభము.

పద్మవ్యూహము.

తృతీయాంకము.

రంగము—అభిమన్యుని శిబిరము.

(తల్పగతుండై యభిమన్యుండును, ఆసీనయై యుత్తరయును ప్రవేశింతురు)

ఉత్త—ఆర్యపుత్రా! నేఁడు మీకన్నులు కొంచె మెఱ్ఱగా-నున్నవి. రాత్రి సరిగా నిద్ర పట్టలేదా యేమి?

అభి—(బలవంతముగా నవ్వి) ప్రేయసీ! యిది నిద్రవచ్చుసమయమా!

సీ. ధర్మమూలకమగు తమరాజ్యమును బరుల్
వంచనచేసి హరించు నపుడు
అన్నిటం దాము ప్రజ్ఞాన్వితు లయ్యు న
న్యులకు లోఁబడి యుండవలసి నపుడు
స్వజనంబు నిజరాజ్య సంపాదనార్థము
పలువిధంబులఁ బాటు పడెడు నపుడు
పెరవారు ధర్మతత్పరబుద్ధిఁ దమకు సా
యంబుగ నిల్చి పోరాడు నపుడు
తమకొ తమవైరికో విజయమునఁ జేసి
శాశ్వతంబగు కీర్తియు, సకలరాజ్య
పదవియు లభించుతరుణము వచ్చునపుడు
కూర్కు వచ్చునె యెంతటి కూళకైన!

ఉత్త—ఆర్యపుత్రా! స్వర్గసామ్రాజ్య మెన్నిసారులు దుష్టుల చేతులలోఁ బడ లేదు?-కాని, యెవ్వ రెంతకాలము బావుకొనఁ గలిగిరి? అట్లే—

చ. భరత నలాంబరీష శిబి బాణ భగీరథ రంతిదేవ సం
వరణ పురూరవః ప్రముఖ పార్థివసత్తము లేలినట్టి యీ

ధర ఖలు లాక్రమించినఁ దక్కఁడు వారికి; రాహుబారిలో
ఖరకరమండలంబు చిరకాలము చిక్కుట సంభవించునే?

అభి—(ఉత్సాహముతో) ఓహో!-యెంత చక్కఁగాఁ బలికితివి!-ఏదీ-యొకసారి ముద్దు పెట్టుకొననిమ్ము.

ఉత్త—(లజ్జతోడి చిఱునగవుతో) ఇప్పుడే గదా యైనది!—మరల నింతలో నేనా!

అభి—ప్రియురాలా! ఆమాధుర్యము నీచెక్కుటిలో నున్నది. నాపెదవులు స్వప్నమునందుఁ గూడ దానిని జవిచూడఁ గోరుచునే యుండును.-ఆఁ! యేమది- అట్లు కంపించితివి?-నాపలుకులయందు భయకారణ మే మున్నది?—

ఉత్త—ఆర్యపుత్ర! వేకువజామున నాకొక వింతయైన స్వప్నము రాఁగా దానివలన నాహృదయ మేమో కాని—చేయిపెట్టి కలచి నట్లయినది. ఇక్కడికి వచ్చినది మొదలు మాటలసందడిలో దానిని మఱచితిని. కాని యిప్పుడు మీరు స్వప్న మనుటచేత మరల నది జ్ఞప్తికి వచ్చి యిట్లు కంపింపఁ జేసినది.

అభి—(మందహాసముతో) ముద్దరాలా! విరాటసంతానము స్వప్నములకుఁగూడ భయపడునంత పిరికిగుండె కలదని యిదివఱకు నే నెఱుఁగను సుమా! అయిన, నాస్వప్న మేమో వినిపించెదవా?

ఉత్త—మనమిరువుర మొకయున్నతమైన పర్వతశిఖరమునఁ గూర్చుండి యిష్టగోష్ఠిలో నుండ, నాకస్మికముగ మనయిరువురినడుమ నొక ధూమరాశి బయలువెడలి మిన్నుముట్టఁ జుట్టుకొన్నది! తన్మధ్యమున మీరు కెంపువలె నెఱ్ఱనైన మేనితో నృత్యము సేయుచుండ నేను భయభ్రాంతనై "ఆర్యపుత్రా! ఆర్యపుత్రా!" యని యఱచుటకు మొదలుపెట్టితిని! అప్పు డాపైనుండి యొకచంద్రబింబ ముదయించి చరచర నాకసమునకుఁ బోయి మరల త్రెప్పపాటులోఁ గ్రిందికివచ్చి నాగర్భము చొచ్చినది! అంతలో వైతాళికుల ప్రాతఃకాల వర్ణనమువలన మెలకువ వచ్చినది—అప్పటి

నుండియు దీనియర్థ మేమయి యుండునా యని హృదయము పరిపరివిధముల గుంజులాడుచున్నది.

అభి—(మందహాసముతో) ముద్దరాల! స్వప్నములకును శకునములకును నర్థము తెలియుటకుఁ జాలఁ బాండిత్యము కావలయును! కాని దీనియర్థము స్పష్టముగాఁ దెలియుచునే యున్నది. నీగర్భస్థశిశువు పూర్ణశశివలె-చంద్రునివలెఁ జక్కనివాఁడును- జల్లనివాఁడును- సర్వజనాహ్లాదకరుఁడును నగు నని దీనిభావము. ఇందులకు నీవు సంతసింపవలసినదే కాని-చంచలింపవలసిన పని యేమున్నది?

ఉత్త—(లజ్జతోఁగూడిన మందహాసముతోఁ దల వంచుకొనును.)

అభి—దీనికేమి కాని—ఈసమయమునందు నీకు జరుగవలసిన ముద్దుముచ్చటల కభ్యంతరము కలిగినందులకు నాకుఁ జాల విచారముగా నున్నది!

గీ. గాసమునకుఁ గూడ గతిలేని కష్టజీవు
లైనఁ గడుఁ గూర్చుచుందురు చూలాండ్ర కెపుడుఁ;
పాండవుల కోడలవు మత్స్యభర్తసుతవు
జరుగకయె పోయె నొక్కముచ్చటయు నీకు.

ఉత్త—(సిగ్గుతోడి చిఱునగవుతో) అత్తగారిపాట మీరుగూడ మొదలుపెట్టినారా? మీరు కడుపులో నుండగా నామె కెన్నియో వేడుకలు జరిగినవఁట—నా కట్టు జరుగుట లేదని యామె రేయింబవళులు పలువరించుచున్నది. ఇంకొకటి—ఆమెకు నెల తప్పినది మొదలుగ మామగారు నీ కేమికోరిక యున్నదో చెప్పు మని ప్రతిదిన మడిగెడివారఁట. చివర కొకనాఁ డామె "పద్మవ్యూహ మెట్లుండునో చూడవలె నని యున్న" దని చెప్పెనట. తోడనె మామగా రామెను ద్వారకకుఁ దోడికొనిపోయి, యాదవకుమారులచే నా మొగ్గరముం బన్నించి- యామెచే దానిం భేదింపించిరఁట. ఈగాథ చెప్పి నీకేమేని కోరిక యున్నచో దాఁపక తెలుపు మని అత్తగారు నన్నడుగని దినము లేదు.

అభి—ఓహో! అలాగునా ?-నా కీసంగతి తెలిసినచో నేనే యడిగెడి వాఁడనే ! కానిమ్మిదిమొదలుగఁ బ్రతిదినముఁ గాదు—ప్రతిక్షణము నడుగుచుండెదను.

తెరలో—అయ్యో ! అయ్యో ! చిన్నదేవిగా రెందులకో కాని-పట్టుగొడుగుం బట్టవచ్చు పరిచారికను మరలి పొమ్మని చేయి వీచుచుఁ గడుసత్వరముగఁ గాలినడకనె విచ్చేయుచున్నారు !

అభి—(ఉలికిపాటుతో) ఏమి! అమ్మగారా! ప్రేయసీ! చూడుచూడు

ఉత్త—(తొట్రుపాటుతో లేచి వెళ్ళి సుభద్రతోఁ బ్రవేశించును.)

సుభ—(రోజుచు) బాబు ! వింటివా యీ విపరీతము!

చ. నలుదిశలం జయించి గగనంబున కంటు జయధ్వజంబులన్
నలుజలరాశితీరముల నాటిన నల్వురు మేటితమ్ములం
గలిగి, నిరంకుశస్థితిని గ్రాలెడు నీపెదతండ్రి యాజిలో
బలిమిని నేఁడు బందిగను బట్టుకొనంబడె నంట వైరిచేన్.

అభి—(అదరిపాటుతో) ఆఁ ! యెంతమాట ! ఎవఁడురా, అక్కడ ధనుస్సు ! ధనుస్సు ! (అని చివాలున లేచి యాకసమువంకఁ జూచుచు) ఓ కౌరవ వాహినీపతులారా !

ఉ. అగ్గిని మూటఁ గట్టి యొడిసియుం దిడికొంటయుఁ గాలకూటముం
బుగ్గను బెట్టికొంటయు- [1] బుభుక్షను గర్జ యొనర్చు [2] కేసరిన్
దగ్గఱి కోర లట్టిటు గదల్చుటయు న్నరి కావు లేశముం
బగ్గకుఁ బోయి ధర్మసుతుఁ బట్టుటకు న్మదిలోన నమ్ముఁడీ !

(సాశంకముగా) అమ్మా ! యొకవేళ నీవు విన్నది పొరపాటై యుండదు గదా? ఏమో ?—

చ. అమరుల నెల్లరం గొని [3] బలారి స్వయంబుగఁ దోడుసూపినం
బ్రమథుల నందఱం గొని [4] కపర్దియె సాయ మొనర్ప వచ్చినన్
[5] యమతనయున్ స్పృశించుటకునైన వశం బగునే విరోధివ
ర్గమునకుఁ ! గృంగిపోవదె ధరాతల మద్దియె సంభవించినన్.

1 ఆఁకలి 2 సింహము. 3 ఇంద్రుఁడు. 4 శివుఁడు. 5 ధర్మరాజు.

సుభ—తండ్రీ! పొరపా టేమియు లేదు. అంతఃపురమున ననురక్త వృత్తాంతము వినిపించు జఘూలికుఁడు జరిగిన దంతయు స్వయముగఁ జూచి వచ్చి చెప్పినాఁడు.

అభి—ఎందుల కని?—ఎట్లని?

సుభ—అన్నన్నా! నీ కిట్టిపలిసమాచార మేమియుఁ దెలియదు కాదా! తాతగారు శరతల్పగతులైన వెనుక నీపిత్తండ్రిగారిని బట్టియిచ్చు శపథముమీఁద సర్వసేనాధిపత్యము భారద్వాజులవారి కొసంగబడినది. కాని, యింతవఱకు నాయన యందుఁకు సాహసింప లేకపోయెను. నిన్నటిసంగ్రామమున నీతండ్రిగారిచేత సంచాలితలోకంబగు సుప్రతీకంబుతోఁ గూడ భగదత్తుఁడు మడియుటయు, అంగరాజు భంగపడుటయుఁ దటస్థింప, దత్పరాభవమునకు సహింపలేక రాత్రి గురునియొద్ద నాశపథమునంగతి యెత్తి కురురాజు నిష్ఠురములాడె నఁట—దుశ్శాసనుఁడు తూల నాడె నఁట—శకుని మేలమాడె నఁట! ఆచార్యులవా రందులకు రోషస్వాంతులై, యెల్లి తప్పక పట్టియిచ్చెద నని చెప్పి, నేఁడందులకై పద్మవ్యూహమును బన్నిరఁట.

అభి—పన్నఁ గాక :—

ఉ. ఖాండవము గ్రహించిన యఖండపరాక్రమశాలి, [1] భర్గుతో
ఖండన మాచరించి సులభంబుగ గెల్చిన బాహుశాలి, [2] దో
ర్దండయుగంబున న్విశిఖతండము గుప్పు ప్రతాపశాలి, [3] యా
ఖండలు నర్ధపీఠమును గాంచిన ప్రాభవశాలి లేఁడొకో.

సుభ—అయ్యో! వా రచ్చట నున్న నింక నేమి! అట్లయినఁ దమ యెత్తు సాగ దని యాచార్యులవారు త్రిగర్తేశ్వరుఁడగు సుశర్మకుఁ బురెక్కించి, నీతండ్రిగారిని సమరభూమినుండి తొలఁగించి దూరమునకుఁ గొంపోయి నిలువరించుభార మాతనిపై నిడ, నతఁడందుల కగ్గిముట్టి బాస చేసి, నీతండ్రిగారిని బ్రత్యేకయుద్ధమున కాహ్వానించి సరస్వతీ హ్రదప్రాంతమునకుఁ దీసికొనిపోయె నఁట!

1 శివుఁడు 2 రెండుచేతులతో 3 ఇంద్రుఁడు.

అభి—(నిట్టూర్పుతో) అగుఁ గాక :—

చ. [1] శమనుని కాలదండమును [2] శక్రుని వజ్రముఁ [3] జక్రపాణి చ
క్రముఁ [4]ద్రిపురారి శూలమును గల్పనసల్పిన దేవశిల్పి డెం
దమున నసూయఁ జెందఁ నెది [6] దానవశిల్పి సృజించె, నగ్గదో
త్తమమునుదాల్చి పోలు నల [7] దంతిసహస్రబలాఢ్యుఁ డేమగున్.

సుభ—అయ్యయ్యో! ఆయఁనుమాతో మచ్చట నుండనిచ్చిరా! ఆచార్యులవారాయనను దూరమునకుఁ గొంపోయి నిలువరించు భారము సుదక్షిణత్రిగర్తపాలునిపై నిడ, నాతండును నట్లే చేసి, కళింగాంబష్ఠ పౌండ్రక దేశాధీశులను సాయముగాఁ గొని యాయన నింకొకదెస కాహ్వానించి తోడుకొనిపోయె నఁట!

అభి—సరి, కానిమ్మా—

చ. గురుని రణంబునం దునుముకోసమె పుట్టిన [8] పార్షదుండు, సం
గరభుని వహ్నివాయువుల కైవడిఁ బొల్చు [9] కవల్, కడంగి ని
ర్జరతతినేని యోపఁగల సాత్యకియు న్సతతంబుఁ దోడుగాఁ
బరఁగెడు నా పెదయ్య నెటు పట్టఁగ నోపుదురమ్మ! శాత్రవుల్.

సుభ—ఇదిగో, తెలిపెద వినుము. ఆచార్యులవారట్లు తమ్ముమొగ్గరముం బన్ని, తాము ముఖమున నిలిచి సంతతశరధారాపాతంబున నెవ్వరిని దాఁపునకు రానీయకున్నంగని మనవారు వెక్కసమును వెఱగుపాటును, వెల్లఁదనమును దోఁప—

సీ. హరియున్న నిపుడు సేయుండగ్గవని యిది
యని యేర్పరింపఁడే యనుచు నొకరు
అర్జునుతోఁడ నియ్యది యెల్లఁ దెల్పి తో
డ్కొనిరాక తీఱునే యనుచు నొకరు
అనిలసూనునకుఁ గా కాచార్యుఁ బట్టి ము
ట్టాడ నన్యులకుఁ గా దనుచు నొకరు

---

1 యముఁడు 2 ఇంద్రుఁడు 3 విష్ణుఁడు 4 శివుఁడు 5 విశ్వకర్మ 6 మయుఁడు 7 భీముఁడు 8 దృష్టద్యుమ్నుఁడు 9 నకుల సహదేవులు

శాత్రవుల్ గుండెన క్షణములో నిడియుద్ధ
తునిమి తూటాడెడే యనుచు నాకడ
ఎదఁవలం డీలువడి, యూహ లెల్ల వీడి
కదన సంరంభముం జెడి, కలఁగుడు వడి
బెగడి బె బేలువడి, మిన్ను విఱిగి మీఁదఁ
బడినట్లైవడి నైరఁట! కొడుక! వింటె!

అభి—అందువల్లఁ బెదనాయనగా రేమని తొందర పడ లేదు గదా?

సుభ—అదే జరిగినది! అట్టి విషమస్థితియం దేమిచేయుటకును బాలుపోక, వారియావేశమునకుఁ దమసాహసమె సాధనముగా నెంచి యొక్క పెట్టునం బోయి, వ్యూహముఖమున నున్న యాచార్యుల వారిం దాఁకిరఁట. అది చూచి, యెల్లవారును వెండియుం జేవ గల్పించుకొని చని తమతేరికి బాసట యగునంతఁ, గొంతసేపు ఘోరంబగు పోరు జరిగెనఁట. అట్టియెడ నాచార్యుఁడు నొచ్చిన ల్లభినయించుచు నోసరిల్లి—

శా. వీరావేశవశంబున న్మానసి నీ పెత్తండ్రి యత్యంత దో
స్సారం బేర్పడఁ దమ్మి మొగ్గరము నిశ్శంకక్రియం జీల్చి, దు
ర్వారాటోప మెలర్ప ముందునకుఁ బోవన్ దోడుగా వెన్క నే
తేరం జూచు బలంబు నడ్డెనఁట యుత్సేకంబు రెట్టింపఁగన్.

అభి—సరిసరి-యిదియా సంగతి! మంచిది-నేవేగి క్షణములో విడిపించి కొని వచ్చెదలెమ్ము. (అని దిగ్గున లేచి) ఓకుత్సిత బ్రాహ్మణుఁడా!

ఉ. అంతయొ యింతయో గురుఁడ వంచును, విప్రుఁడ వంచు, బెద్దవం
చెంతయు నాదుతండ్రులు సహించి యుపేక్ష వహింప, నెంతు నా
యంతటివాఁడు లేఁడని మదాంధత నుంటివె బొల్తు! వట్టిసా
మంతము చెల్లదిఁక నభిమన్యునిముందట, నేమి యెంచవే!

తెరలో—భద్రా! బాబు శిబిరమునకు సుభద్రాదేవి వచ్చినదా?

సుభ—(విని యుదరిపాటుతో) బిడ్డా! చూడు! చూడు! పెద్దత్త గారి కంఠమువలె నున్నది

ఉత్త—(నిష్క్రమించి మరల ద్రౌపదితోఁ బ్రవేశించును.)

ద్రౌప—బాబు! ఈపూట నీచేయి యెట్లున్నది?

అభి—తల్లీ! ఆచార్యుని దుర్మదము నపమదము చేయుటకుఁ జాలిన ట్లున్నది.

ద్రౌప—(వెఱఁగుపాటుతో సుభద్రవంకఁ జూచి) ఓసి తెలివిమాలిన దానా!—బాబుతో సంగతి యంతయుఁ జెప్పితివా యేమి!

సుభ—అక్కా! చెప్పక చేయవలసిన దేమి?

ద్రౌప—చేయవలసిన దేమా!—అందులకేకదా వెళ్ళితివి!—నేను రణ సమాయత్తము చేయించుకొని వచ్చునరికి నీవు మాయమైతివి!

సుభ—అక్కా! నీయభిప్రాయము నాకు బోధపడ లేదు. ఎందులకు రథము?

ద్రౌప—నీకుఁ బద్మవ్యూహమును భేదించువిధము తెలియునుగదా! నాకు సారథ్యము తెలియును. ఇరువురముఁ గలసి నూఁదిమొనయంత సందు చేసినచో—నీయన్న సాత్యకియు, నాయన్న దృష్టద్యుమ్నుడును మిగిలినపని పూర్తి చేయుదురు.

సుభ—అమ్మయ్యో! అంతటి వీరాధివీరులను మనము తెరల్పఁగలమా!

ద్రౌప—ఇసీ! యెంతమాటాడితివి!

ఉ. వీరులనెత్తురుచేతఁ గురువిందము చందము నొందినట్టి యీ
భారతభూమియందుఁ గనుపావనవంశమునందుఁ బుట్టి, దు
ర్వార పరాక్రమాఢ్యులగు పాండుతనూజుల యిల్లు మెట్టి, యీ
తీరున శాత్రవాళికి మదం దలఁకం దగునే? తలోదరీ!

అభి—అమ్మా! యీమె యిట్లు పలికినది నన్ను ఘనతపఱుపవలెనని కాని—శత్రువులయందలి భయముచేఁ గాదు. ఇంతకును,

ఉ. ఆనతి యిచ్చి పంపిన, బలారి విరోధికిఁ దోడు వచ్చినం
గాని జయించి రాఁగల యఖండ పరాక్రమశాలి యీ భవ
త్సూనుని ఇంట నుంచి, పువ్వుసోఁకినఁ గందెడు మీరు విల్లు చేఁ
బూని రణాంగణంబునకుఁ బోవఁగ నేమిటి కమ్మ? యాంబరో!

ద్రౌప — చాలుఁ జాలు! — నిన్నుఁ బంపుట కిదియా సమయము !

అభి — అయ్యో, తల్లీ ! — అట్లనెద వేమి ?

సీ. పెదమామ సీరి నేర్పిన గదాయుద్ధకౌ
శలముఁ జూప నిఁకెప్డు సాగు నమ్మ
చినమామ శౌరి యిచ్చిన సర్వ దివ్యాస్త్ర
ములకిఁ కెప్పుడు పని కలుగు నమ్మ
కడతండ్రి పనిపట్టి కఱపిన ఖడ్గవి
ద్యకిఁ కెప్పు డవసర మబ్బు నమ్మ
బావప్రద్యుమ్నునిఁ బ్రతిఘటించిన ధను
ష్పాండిత్య కిఁక నెప్డు ఫలిత మమ్మ
తండ్రి సవ్యసాచి దైవాజ్ఞ బోధగా
వించినట్టి వ్యూహ భేదన ప్ర
కారములకిఁ కెప్డు కార్యంబు గాఁగల
దమ్మ ? యిట్టులాడ నగు నఁటమ్మ !

ద్రౌప — బాబూ! నీతండ్రిచేత నశ్వమేధము చేయించి, నీపరాక్రమ
మప్పుడు ప్రకటింతువు గాని లెమ్ము.

అభి — అమ్మా ! నాయభిప్రాయము నీకు విశదపడ లేదు.

సీ. దాయాదజనుల యధర్మకృత్యంబులు
పిన్నపెద్దలనోట వినెడునపుడు
అడవుల నున్న మి మ్మాత్మఁ దలంచి దుః
ఖించునంబను దిలకించునపుడు
పగవారి పంచను బడియుండి యిడుములు
పడు బామ్మ జ్ఞప్తికి వచ్చునపుడు
కయిసేత లేక యోగతిని జీరాడు నీ
కుంతలంబులు గనుంగొనెడు నపుడు
నేమి యనుకొను చుందు నాయెడఁద దాని
కఖలవిధములఁ దగుసమయంబు వచ్చె;

నడ్డుపెట్టక యిపు డని కరుగనిచ్చి
కొమరుని యభీష్టముం దీర్చుకొనఁగ నిమ్మ!

ద్రౌప—(ఆనందబాష్పములతోఁ జుబుకము పుడికి) అయ్యో వెట్టి తండ్రి!—నే నేమి సేయుదును!—

ఉ. దాపున లేరు మామయును దండ్రియునుం బెదతండ్రి, చేరియుం
దా-పెనుగాయ, మూలము-మహాబలశాలురతోడ, మొగ్గరం
బా-పటుదుర్గమంబు, రిపులా-గతపాపభయుల్, వయస్సునం
దా-పసివాఁడ, హీనమయముం దని కంపఁగఁ జెల్లునే నినున్!

సుభ—అక్కా! మనకుఁ దోడువచ్చిన వారందఱు నిట్లే వితర్కింప బూనినచో మనకు సహాయులే లేకపోయెడివా రేమో! చూడు,

చ. కడుపునఁ బుత్త్రికుం బడయఁ గల్గిన రాచపడంతి యాత్మ నె
ప్పుడు నెది కోరుచుండుఁ బువ్వుఁబోఁడిరో! దానికి నిప్పు డిట్టు లే
ర్పడె సమయంబు-సందియము వాసి యనుజ్ఞ యొసంగవమ్మ, నీ
కొడుకు కనపాయుఁడై యశము కూర్చును, జేర్చును దద్రిసంటికిన్.

ద్రౌప—చెల్లెలా! నీవింత జాతిగుండెదాన వని యెఱుఁగను జుమా

సుభ—అక్కా! నన్నిట్టు లంటివి కదా—అత్తగారు తమకుమారుల కంపిన సందేశ మేమని?—

శా. “మీరాజ్యంబు హరించి యెల్లయిడుమల్ మీపాలు గావించి మి
మ్మా రాటిల్లఁగఁ జేయు శాత్రవుల బాహాబాహి నిర్జించి, ని
ర్వైరంబైన స్వరాజ్య మేలుటయొ పోరాటంబునం జచ్చి యు
ర్వీరన్స్వర్గము చూఱకొంటయొ సుండీ! విధ్యుక్తముల్ మీకికన్.”
అని కాదా?—యామె జాడనేకదా మనము నడువవలసినది?

ద్రౌప—అట్లని, సమయాసమయ విచార మక్కఱలేదా?

సుభ—అక్కా! సమయాసమయ విచారమునకుఁ గూడ సమయాసమయములు కలవు. ఈసమయమున నే నేపాటి వెనుకఁ దీసినను

చ, తమయజమానుఁ డేఁగి రిపుతండము మధ్యను జిక్కి యొంటిగా
శ్రమపడుచుండ-నాయకుని సాయ మొనర్పఁగఁ బోయి యొండవో

యమపురిఁ జేరుచుండఁ—దనయాత్మజు నంపుదుపట్ల నెంతలో
భము వహియింపఁ గల్గెను సుభద్ర యటంచు జనుల్ హసింపరే!

ద్రౌప—హసింతురుగాక!- నేనైనచో నందులకయిన సహింతును గాని—చేతిబిడ్డను నూత వేసి లోతుఁ జూచుటకు సిద్ధపడను.

సుభ-అట్లయిన మన మెన్నటికిని వీరమాతల మనిపించుకొననేలేము.

ద్రౌప—(కోపముతో) అట్లయిన నీయిష్టము!—అవును దూడయు నుండ, నడుమ గుంజ యుఱుకుట తప్పు! (అని వెళ్ళఁబోవును)

అభి—(అడ్డుకొని) అమ్మా! అమ్మా! ఒక్కమాట!—మాయమ్మ మీఁది కోపముచే, నన్ను దీవింపకయే వెడలిపోవుట ధర్మమేనా?

మ. అనుమానింపక నాకనుజ్ఞ యిడు మద్యాచార్యుఁ గృపాచార్యుఁ, గ
ర్ణుని ద్రోణుం గసిదీఱ నుక్కడఁచి "మెుత్తో! పార్థుఁడే మే, ల్చుటు
క్కన నాయమ్ములునాటు వీనిశరముల్ క్రూరమ్ము"లంచున్నమో
ధనుఁ డెంతేఁ గుయివెట్టఁ జేసి, తుటిలో ధర్మాత్మజుం దెచ్చెదన్.

ద్రౌప—తండ్రీ! నీసామర్థ్యము నెడ నందేహ మెవరికి? మఱేమన్న అంతగాయముతో ధను వెట్లు పట్టఁగల వని నాదిగులు.

అభి—దానికేమి—ఇదిగో! వాపు తగ్గినది—గాయము మానుపట్టినది—వ్రేళ్ళు వంగుచున్నవి—

సీ. మాలోటు పూరించి మాట దక్కించె బా
బని కృష్ణపార్థులు హర్షమొంద
పెంచినందుల కుద్ధరించె నేఁ డని ధర్మ
తనయుఁ డెంతయుఁ బ్రమోదంబుఁ జెందఁ
బసివానిచే నెంత భంగపాటయ్యె నం
చరిచమూపతులెల్ల నాత్మఁ గుందఁ
దమవారి, యెదిరి సత్త్వము తేటపడి సుయో
ధనుఁడు చిత్తమున నుత్తలముఁ బొంద
గురుని నవలీల నొంచి, యెుగ్గరము చించి
పాండవాగ్రజు విడిపించి, ప్రఖ్యాతిఁ గాంచి

సుఖముగా వత్తు నాప్రజ్ఞ చూడవమ్మ !
భయము వలదమ్మ ! దీవించి పంపవమ్మ !

ద్రౌప—నాయనా ! చెప్పవలసినమాటగనుకఁ జెప్పితిని. నీకు వీలుగా నున్నట్లు తోఁచినయెడల మంచి దట్లే పోయిరమ్ము. కాని,—

గీ॥ తనకుమారుని నీతండ్రి దండధరుని
దండకుం బుచ్చెనని జయద్రథ హతకుఁడు
మదిని నీయెడఁ బగఁ బూని మసలు నంట !
అతఁడు దరి నైన తరి నలక్ష్యంబు వలదు.

సుభ—(ఉలికిపాటుతో) అక్కా ! నీ కనేక వందనములు! నేను మఱచినను, యుక్తసమయమునఁ జెప్పవలసినమాట చెప్పితివి !

అభి—(నవ్వి) అమ్మా ! [1] అగ్ని వమ్రి న్యాయ మెఱుఁగవా !—మహాగజము తెగింపోవునప్పుడు మశకమా నిలుచునది !

ఉ. చిన్నతనంపుమాట లని చిత్తమునందుఁ దలంపఁబోకు, వే
గన్నులవాఁడు తోడుపడుఁ గాక-! విరోధులనెల్లఁ గ్రొల్లుపిలి
సన్న [2] కురంగశాబముల కైవడి దిక్కులు పట్టఁ జేసి, న
న్నన్నబుణంబుఁ బెంచినబుణంబును దీర్చెద నేఁడు చూడుమీ!

(ద్వారమువంకఁ జూచి) భద్రా ! క్షణములో నారథము సిద్ధము చేసికొని తెమ్మని నాసారథి సుమిత్రునితోఁ జెప్పుము. తల్లులారా ! యింతలో నేను లోపలి కేఁగి యాయిత్తమై వత్తునా ?

ద్రౌప—బాబు! మంచిది. చెల్లెలా! మన మీ లోపలఁ గ్రొత్త సమాచార మేమైన వచ్చెనేమో పోయి తెలిసికొని మరల వత్తమురమ్మ.

(సుభద్రా ద్రౌపదులు నిష్క్రమింతురు.)

ఉత్త—(తనలో) అమ్మయ్యా ! బ్రతికితిని !—ప్రాణేశ్వరునితో నా యభిమతముం జెప్పుకొనుట కవకాశము దొరకినది—

అభి—ప్రియసీ ! సన్నాహము త్వరగ ముగియుటకు నీచేతులు గూడ నా కెర విచ్చెదవా ?

---

1 నిప్పునకుఁ జెదలు పట్టవని. 2 లేడిపిల్లలు,

ఉత్త—ప్రాణేశ్వరా! నన్నాహవమునందే కాదు-సంగ్రామమునందుం
గూడ నా చేతులకు మీ సేవాభాగ్య మనుగ్రహింపుఁడు.

అభి—మేలు! మేలు! సుభద్రాదేవికోడ లెట్లనవలెనో యట్లే
యంటివి? (అని ముద్దు పెట్టుకొని) సరికాని—సంగ్రామము
నందు నీవు నా కేవిషయమునఁ దోడుపడఁ గలవు?

ఉత్త—ఒక్క విషయమున నన నేల?

సీ. చెమట గ్రమ్మినఁ బైఁట చెఱఁగు వీవన చేసి
విశ్రాంతి యొదవఁగ విసరఁ గలను
సమయోచితములైన శస్త్రాస్త్రముల నెత్తి
యెప్పటికప్పు డందీయఁ గలను
సూతుఁడు డస్సినఁ జేతఁ గళ్లెము గొని
కడునేర్పుగ రథంబు గడపఁ గలను
శత్రులు దళమైన సరగఁ జాపముఁ బూని
గుఱి తప్ప కలుగులు గుప్పఁ గలను
చెప్ప నేటి కెట్లు చేదోడు వాదోడు
గాఁ జరింతు నెల్ల కార్యములను;
ఏమి యంటి ననుచు నెడఁద భావింపక
చిత్తగింపు మనవి జీవితేశ!

అభి—సెబాసు! ఇదిగో యీ పవిత్ర భారతపుత్రికా లక్షణము॥

గీ. సమయ మరుదెంచునప్పుడు జంకు లేక
భర్తవెనువెంటఁ జచ్చునఁ బఱట కేవి
సిద్ధపడఁ జాలునట్టి విశుద్ధురాండ్రె
తగిన బిడ్డలు భరతమాతకు నిజంబు.

ప్రేయసీ! లోపల మాటాడుకొందము రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

విష్కంభము.

విష్కంభము.

సంజ—(ప్రవేశించి) పనివచ్చునప్పుడు కాని పాండిత్యము వెల్లడి కాదు. భారద్వాజుని ధనుర్వేద వైదుష్యమంతయు నీపద్మవ్యూహ రచనయందుఁ బ్రతిఫలిత మగుచున్నది.

చ. దళములుగా సమస్త వసుధాతలనాథుల నిల్పి, గేసరం
బులుగ నమర్చె సర్వ నృపపుత్రులఁ; గర్ణికగా నొనర్చె దో
ర్బలయుతులైన కర్ణ కృతవర్మ సుయోధన దుస్ససేన ము
ఖ్యుల; నిఁకఁ దక్కుచోట్ల నెలకొల్పె జయద్రథ సౌబలాదులన్.

ఆపయిని,

చ. నిలిచి ముఖంబునం దిశలు నించుచు నిష్ఠుర బాణపంక్తులం
బ్రలయసమీర సంక్షుభిత వార్ధివిధంబున పొద్దు మీఱి వి
చ్చలవిడిఁ బొంగి వచ్చు రిపుసైన్యము నొక్కట నిల్వరించి, తాఁ
జలిపె సహాయహీనుగ సజాతవిరోధిని మొగ్గరంబునన్.

పాపము! యుధిష్ఠిరుఁ డేస్థితిలో నున్నవాఁడో--యాదుష్టులందఱుం గలిసి యతని కేమియెగ్గు సేయుచున్నారో తెలియకున్నది. ఒకటిమాత్రము నిజము- ధర్మమార్గమునఁ దలపడినచోఁ బ్రపంచమంతయు నెత్తివచ్చిన నతని చెక్కు చెమర్పదు.

వైశంపాయనుఁ డీవైపున నుండు ననికదా యిటు వచ్చితిని? (కలయఁ జూచి) ఆమఱ్ఱిచెట్టు పలవలలోఁ గూరుచుండి నావంకఁ జేయి వీచుచున్నవా రెవరయి యుందురు? (నిదానించి) ఇంక నెవరు!— అతఁడే! మేలు!--వ్యూహ మంతయు దృక్పథమున నుండు నెలవు కనిపెట్టినాఁడు! (పరికించి) మిత్రమా! యేమి విశేషములు!— యుధిష్ఠిరునకు క్షేమమేనా?— ఏమనుచుంటివి?— "దుర్యోధనుఁ డేదియో చెప్పి యతనిం గాలిపడక సికేతోడుకొని వచ్చుచున్నాఁడు శీఘ్రముగ మీరిటకి రి" మ్మనియా?—ఇదిగో వచ్చుచున్నాఁడను,

(నిష్క్రమించును.)

పద్మవ్యూహము.

చతుర్థాంకము.

రంగము—పద్మవ్యూహగర్భము.

(లోపల, పాదచారులై యుధిష్ఠిర దుర్యోధనులును,
వెలుపల, జెట్టుపైఁ గూరుచుండి సంజయ వైశంపాయనులును ప్రవేశింతురు.)

యుధి—సుయోధనా! నీవు నిర్దేశించిన స్థలమునకు వచ్చినారము— చెప్పఁ దలఁచిన దేమో యిఁకఁ జెప్పవచ్చును.

దుర్యో—(మందహాసముతో) అన్నా! నీవుమిగుల దయామయుఁడవని యుఁ బ్రాణిహింస నీకు బొత్తిగాఁ గిట్ట దనియుఁ జెప్పికొందురు-మన మిత్రమిందఱు మడియుచుండ నీవెట్లు సహింపఁ గలుగుచుంటివి?

యుధి—ఆమాట నన్నా? యడిగెదవు?

గీ. అయినను గ్రామముల నైదైన నిమ్మనిననాఁడు
నీకుఁ జెప్పితిఁ గాదన్న నీవ కాదె
మొన్న గురుతరమగు నీ ఘోరకృత్య
పాతకమునకును, బంధువిధ్వంసమునకు?

దుర్యో—అట్లయిన, నీవు న్యాయధర్మములనువదలి సామ్రాజ్యము గ్రహింపవే దన్నమాటయేమో?

గీ. ధరణి యంతయుఁ బాలింపఁ దగిన మాకు
యాచకుల కట్లు పదునైదు గ్రామములను దాన
మిమ్ము, కన్నుగుఱుతుగాఁ గిట్టడమిఁ
దప్పుగా నెంతు నే మనఁ దగు నిఁకన్న!

యుధి—ఓహో! అలాగునన్నా! అట్లయిన, సమయప్రకారము మాయర్ధ రాజ్యము మా కిచ్చుట కేల లోభిపవలసి వచ్చెనో!

దుర్యో—అందులకుఁ గారణము చెప్ప మనెదవా? **అధికమాసములు** గలిసికొన కున్నఁ బదుమూఁడేఁడులును బూర్తి కానేరవు.-వానిని వేఱుగా లెక్కించుటకు శాస్త్రము లేదు. కాఁబట్టి మీ సమయము నెఱవేఱిన దనుటయే తప్పు.

యుధి—అట్లయిన, దానిని నిర్ణయింప వలసినవారు పెద్దలు—

దుర్యో—(వికటముగా నవ్వి) పెద్దలయందును, వారి నిర్ణయమునందును నాకు విశ్వాసము పోయి చాలకాల మయినది ఇంతకు నొక యొఱలో రెండు కత్తు లిముడుట కవకాశము లేనప్పుడా విచారమే యనవసరము. మీరో మేమో రాజ్యమంతయు ననుభవింపవలసిన దేకాని-పంచుకొనుటయు, మరల ననూయలు పెంచుకొనుటయు నా కిష్టము లేదు. రక్తపాతము లేకుండ దానిం దేల్చుకొనుటకు మనయిరువురకు సమ్మతమయిన మార్గ మొక్కటియే యున్నది

యుధి—అట్లయిన, నదేమో చెప్పరాదా ?

దుర్యో—చెప్పుటకేగదా పిలిచితిని.

క. నలువురి యెదుటను నక్ష
మ్ముల గెలిచితి నీదు రాజ్యమును నే మొదటన్;
గెలువుము నీవును నక్ష
మ్ములచేతనె సకలరాజ్యమును నల్గురిలోన్.

యుధి—ఓరి ! మాయకాఁడా ?—యిదియా నీ రాకడ !

ఆ. వె. నాఁడు నీ యసూయ, నా యవివేకంబుఁ
గలిసి చేసినట్టి కార్యమునకు
ఫలిత మీ సమస్తబంధుక్షయము!- సిగ్గు
విడిచి మరల నదియె తడవె దేల ?

దుర్యో—అందె దగ్గేమున్నది!—దానివలన నీబంధుక్షయ మింతటితో నిలిచిపోవును గదా ?

యుధి—వెఱ్ఱివాఁడా! * మార్జాల దుగ్ధపాన న్యాయముగా-నీరాకడ నేను గనికట్ట లేదని యేల యింకను భ్రమపడెదవు ?—

* పిల్లి కన్నులు మూసికొని పాలు త్రాగినట్లు.

చ. మకురుతనంబున న్శకునిమామ సృజించిన మాయదారి పా
చికల మముం బరాజితులఁ జేసి సమస్తము నీవ మింగు కో
రిక లిఁకఁ గట్టిపెట్టి, తగురీతని సగపాలు మా కొసం
గి, కులము వర్ధిలం గని సుఖింపఁగఁ జూడుము యిప్పు డేనియున్ !

దుర్యో—ఏమీ ! కలిపోసి పెట్టినను నట్టివంకనే దృష్టియా! మీనిలివ డేసి నేలలకంటె మీ కధికముగా నిచ్చువాఁడ నని యెన్నఁడు నను కొన వలదు.

యుధి—అనకొననే లేదు ! ఏమా?—నీవు చిల్లపెంకువంటివాఁడవు. చిల్లపెంకు పగులును గాని—వంగదు, మంచిది, యీయనే వలదు కాని—

చ. పరువుఁ బ్రతిష్ఠయుం గలిగి పావనమై తనరారునట్టి స
త్కురుకుల మందుఁ బుట్టి, యిటు ధూర్తుఁడవై మనఁజూచెదేల! నీ
శరములు విండ్లుఁ గాల్చి మసి సల్పుట కా! మముఁ బోరఁ గెల్చి సు
స్థిరముగ నేలికొమ్ము జగతీతల మెల్ల నిరంకుశంబుగన్.

దుర్యో—ఓహో ! వంటయిలు సొచ్చినకుందేలు వంటరితోడనే చెలగాటము లాడుచున్నదే !

చ. అడవుల నీవుఁ దమ్ములును నా కలముల్ తిని, మాడి, మగ్గి, చే
డ్పడి, చెడి, చేరుకొంటి రని భావమునం గరుణించి, మంచికై
తొడరగఁ దార్చువారి యిటు తుళ్ళైను-కంపలఁ బడ్డ కాకివై
పెడఁద నెఱుఁగకుంట ! నివు డెవ్వరు నీ కిట దిక్కు మంద్యుఁడా !

యుధి—ఓ యవివేకుఁడా ! నీతమ్ము లగ స్వభ్రాత లగుటచే నీకు దిక్కు లేకపోవలెను గాని—నా కేమి ?——

చ. నలుదిశలం గట్టి నరనాథుల నెల్లర బాహుశక్తి వ
శ్యులుగ నొనర్చి నాదు పదయుగ్మమునం బడవైచినట్టి త
మ్ములఁ గలవాఁడ నేను ! నిను బొట్లకు నగ్గనువిచ్చి చూడనే
నలవియా ! చేటు దగ్గఱుట నారయకుంటివిని కాదా! మూర్ఖు

దుర్యో—(రోషముతో) ఆలాగుననా ! మంచిది—చేటుకాల మెవ
రికిఁ జేరువయ్యెనదో యిప్పుడు తేలఁ గలదు-వచ్చి రథమెక్కుము !
లోటిపిటశూలరోకళ్ళం గాని పోదు గదా ! (అని వెనుకకు
దిరిగి చప్పటులు గొట్టును.)

దుశ్శా—ఉ. చాలును జాలు! నేల తెగసాగెదు! చావఁగవచ్చితిచ్చటన్
కర్ణు— వ్రాలుము చక్రవర్తి పదపద్మములం బ్రతుకం దలంచినన్
సైంధ— గాలమునం దగుల్కొనిన గాడిద వైతివి నేఁడు చూచితే
శకు— తాళుఁడు మీర-లీతని మదం బడఁగించెద నే నొకండనే.

(అని పలుకుచుఁ దెరఁ జిమ్ముకొని బ్రవేశింతురు.)

యుధి—ఓహో—యేమిమీ రాలాపములు ! ఓవ్యర్థప్రలాపులారా !

శా. నిర్వక్రస్థితి మీ నృపున్ సఖుల బద్ధీభూతులం జేసి గం
ధర్వుల్ తోడ్కొనిపోవునప్పుడును; మా తమ్ముం డమరాస్త్రముం
బర్వంజేసి శిరోంబరంబులు గ్రహింపం బూనికొన్నప్పుడున్
గర్వగ్రంథుల రీర లేమయితిరో కాసింత విన్పింపరే !

దుర్యో—ఓ యసందర్భప్రలాపీ ! యెప్పటిమాటయో యిప్పు డేల ?
ఇప్పుడు నీవు వచ్చితివి చూచుకొనుము !—

యుధి—ఈ బెదరింపులు చావన్న భయపడువానికడ నుపయోగిం
చును గాని, నాకడఁ గావు ! నా కెట్లయినను సంతోషమే.

ఉ. మమ్ముల్ పాపభీరుల నమాయికులం గను మాయ చేసి రా
జ్య మ్మఖిలమ్ముఁ జూరకొనినట్టి నినుం దెగటార్చి రాజ్యసౌ
ఖ్యమ్మయినం గడింతు; నటు కానియెడ న్నిహతుండనై స్వరా
జ్యమ్మునకై యొసంగెదను వన్నెయశం బయినం గడించెదన్.

అందఱు—మొదటిది కల్లగాని—రెండవదిమాత్ర మిదిగో! యిప్పుడే
యథార్థము కాఁగలదు ! (అని చుట్టుకొందురు.)

(తెరలోఁ బెద్ద కలకలము.)

అందఱు—(నిశ్చేష్టులై దిశలు పరికింతురు.)

దుర్యో — దిగ్గజ కర్ణకుహరంబులను బిబ్బళ్ళు వాఱఁ జేయు నీమహా
కిలకిల మేమయి యుండును జెప్పుమా !

కర్ణు — శంఖమహాప్రభా విభాసితంబయి, భూమండల నభోమండలముల
నేకము సేయు నా ధరాపరాగమో !

తెరలో — ఓహో ! వీరభటు లారా !

మ. రథ సోల్లాసము లొప్ప, సంక్రాంతి యపారంబై దిశ ల్గప్ప; వీ
రభటానీకము నొంచి, ద్రోణుని శరీరంబెల్లఁ గారించి, వీ
తభయుండై యభిమన్యుఁ డుద్ధతమునం దర్పంబుమైఁ జొచ్చె! భూ
విభునిం జేరఁగఁ బోయి శీఘ్రమున నీ వృత్తాంతమున్ దెల్పుఁడీ !

దుర్యో — ఏమీ ! చీమయో దోమయో మొగ్గరము సొచ్చినందుల
కేనా యీ సింగినాద మంతయును !

తెరలో — గీ. పార్థసూనుఁడు వ్యూహము సాయగా నొ
నర్చి నాయకుఁడుగ ముందు నడచుచుండఁ,
గడమవారలు దమ యిరుగడలవారి
నొంచుచు న్వెంటఁ బఱతెంచు చున్నవారు !

దుర్యో — (తొట్రుపాటుతో) అట్లయిన, వెంటనే యావంకకు వెళ్ళి
తీఱవలెను ! (కర్ణునితో) మిత్రమా ! * గృహబద్ధ కుమారీ
న్యాయముగా - నీతని నిప్పటి కిచ్చటనే యుండనిచ్చి, శీఘ్రముగా
రథస్థుఁడ వై వీరినిఁగూడ వెంటఁ గొని నీవును నచ్చటికే రమ్ము.

(దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని సైంధవులు నిష్క్రమింతురు.)

యుధి — అన్నన్నా ! యొంటరిగా నే నిందుఁ జిక్కువడినందులకుం
గొందలపడుచు వారు తొందరపడి యస్వస్థస్థితియందున్న బాబును
దోడ్కొనివచ్చిరి కావలయును! నిజమునకుఁ బార్థునితరువాత నిత
డు తక్క నీవ్యూహభేదన క్రమ మెఱిఁగినవారు లేనప్పుడు వారింత
కంటెఁ జేయఁ దగినది లేదు కాని — నానిమిత్తము, వలను దప్పి
పడియున్న పసిపిల్లవాఁడు లేచి కావలసి వచ్చుట సంతాపకరము!
...... కానిమ్ము — మించినదానికి వగచిన నేమి లాభము —

* ఇంటఁ గట్టిన కలబంద చావను జావక పెరుఁగను బెరుఁగక యుండునట్లు.

అన్యోన్య సాహాయ్యమున నాచార్యుని యత్నమును, సుయోధనుని యాశయమును గూడ వ్యర్థములు గావించి, భీమార్జునులు లేనిలోటు కానరాకుండఁ జేసినము. (అని నిష్క్రమించును.)

వైశం—అమ్మయ్యా! ఇప్పటికి నాగుండెలు కుదుటఁ బడినవి! * జాల మత్స్య న్యాయముగాఁ జిక్కువడి యున్న యీతని కాదుష్టు లేమి యొగ్గు సేయుదురో యని నాహృదయము తల్లడిల్లినది !

సంజ—నరి కాని—అటు చూచితివా !—

సీ. తనదు సంగర సముత్సాహంబు నిజముఖ
సీమ నత్యంతముఁ జిందు లాడఁ
దన కర్ణికార కేతన రోచు లంబర
దేశంబునకుఁ జాలఁ దేటఁ గూర్పఁ
దన రథనేమి నిస్వనము దంతావళ
తురగ సంతతులకు దుర్భ్రమం జేయఁ
దన ధనుర్జ్యానినదం బరాతి చమూస
మూహంబు నెల్ల సమ్మోహపఱుప!
కదనతల మెల్ల దివ్యాశుగములచేతఁ
బగఱ హృదయంబు లెల్ల విభ్రమముచేతఁ
బ్రబలముగఁ గప్పివుచ్చుచుఁ, బ్రళయకాల
రుద్రుఁ డోయన వచ్చు సౌభద్రుఁ గంటె !

వైశం—వచ్చుటమాత్రమే కాదు !—

సీ. వీరుల మస్తముల్ విరియుముగ్గిన తాళ
ఫలములలీల భూస్థలిని రాల
తేరులు పిడుగు మొత్తిన శాల్మలీవృక్ష
ముల విధంబునఁ బెళపెళను వ్రీల
కుంజరయూథముల్ కులిశఘాతము లైన
యద్రుల పోలిక నవిసి కూల

* వలలోఁ జిక్కిన చేపఁ లోపల నుండి సర్వమును జూచుచు బయటికిరాఁజాలన

ఘోటకపరితతులు కుట్లు పీకిన కీలు
బొమ్మల చందానఁ బుడమి వ్రాల

ధ్వజవితానంబు లెల్ల సూత్రములు తెగిన
గాలిపడగల పగిది నల్లడలఁ దూఁగ
కౌరవబలంబులం గడుఁ గసిమసఁగి
చీల్చి చిందర వందర సేయుఁ దొడఁగె!

సంజ—పాప మిప్పు డేమగునో గాని—ఆచార్యుడు వెనుకవచ్చి వారి నడ్డెను;—ఒకవైపునుండి దుర్యోధన దుశ్శాసన కర్ణ వికర్ణ ప్రభృతులును—మఱొకవైపునుండి కృపాచార్య కృతవర్మ వృషసేన ప్రభృతులును—వేఱొక వైపునుండి బాహ్లీక సోమదత్త భూరిశ్రవో లక్ష్మణకుమార ప్రభృతులును—దమతమబలంబులం బురికొల్పుచు నొక్కపెట్టునం బోయి ముట్టడించుచుండిరి'......
ఆఁ! పోసిమ్మ—యుధిష్ఠిరుఁ డతనిం జెంబోవుచున్నాఁడు.

వైశం—కాని—యీ యసహాయశూరుని కీతని సాయ మవసరమె లేక పోయినది!

గీ. పరుగు పరుగున బఱతెంచు పగతురు తన
పజ్జకుం జేరికొని తలపడక మున్నె
రివ్వు రివ్వున శరములు రువ్వి వారిఁ
జెట్టులుం బుట్టలుం బట్టఁ జేసె నదిగొ!

సంజ—ఓహోహో! కర్ణునంతవాడు గూడఁ గాలికి బుద్ధిచెప్పికొన్నాఁడే!—సరి కాని—రథంబు డిగ్గి-మొగంబు వాడ, పిగ మిడి పీడఁ, తూలేర మూడఁ, జెమ్మట లోడ, బ్రాణములమీఁది తీపిమె యీతఁగా నీవంకకుఁ బరువిడి వచ్చు నీతఁడెవఁడు?

వైశం—(నిదానించి) ఎవరోనా! మీదుశ్శాసన మహారాజుగారు! అదిగో! అభిమన్యుఁడును సత్వరముగాఁ దేరు తోలించుకొని యీతనికొరకే కావలయు నిటే వచ్చుచున్నాఁడు

(తెరలో)

చ. నిలు నిలు! పోకు పోకు! మవినీతుడ! మింటికిఁ బాఱినన్, రసా
తలమునఁ దూఱినన్, జలధి డాఁగిన, నాదు నిశాతసాయకం
బులు నిను వీడి క్రమ్మఱఁగఁ బో; విధి బుద్ధియె నిన్నుఁ బోలున
త్కులజానకుం? గులంబునకుఁ గూర్తువె మాయనిపుచ్చ దుర్మతీ!

సంజ—శివాశివా! అతని కేక యితనిపరుగును మఱింత పెంపొందించినది

వైశం—తాళు తాళు. అభిమన్యుఁడు మరల నేమో యనుచున్నాఁడు!

తెరలో—ఏమీ! నాయుపాలంభనము నిన్ను నిలుప లేకపోయినదిగా!—మంచిది—ఇదిగో—యీశ్వాఖిలాస్త్రము నిలుపఁ గలదు చూడుము!

దుశ్శా—(పరుగునఁ బ్రవేశించి యట్టె నేలఁ గూలును)

అభి—(ఒక్క దాటునఁ బ్రవేశించి, దుశ్శాసనుని రొమ్ముపై మోకాలూని హస్తుఁడై దట్టిలోని యసిపుత్త్రికం దీసి) ఓరీ! కౌరవకులకళంకా! నీవు నా బారినుండి బ్రతికి పోఁజాల వని చెప్ప లేదా?

చ. పరమ పతివ్రతామణియుఁ, బావకజాతయు, నైన ద్రౌపదిం
బరబర కేశపాశమును బట్టి సభాస్థలి కీడ్చి, మేని యం
బర మొడలింపఁ బాల్పడిన పాపఫు నీకయిదోయి ముందుగా
నఱికి, భవచ్ఛిరంబు దశనం బొనరించెదఁ గాక! యవ్వలన్.

(తెరలో)—బాబు! తొందరపడకు! తొందరపడకు!

గీ. వీనివక్షంబుఁ జీల్చి యావెచ్చనెత్రు
తలకు మెఱుఁ గిడి, నీ పెదతల్లి కురులు
ముడువ శపథంబుఁ గొనె వడముడి; తదీయ
సమయమున కంతరాయము సలుపఁ దగదు.

అభి—(ఎత్తిన చేయి దించి) ఏమీ! అలాగుననా? ఓదుష్టుఁడా! పెదనాయనగారి యాదేశ మిప్పటికి నిన్ను బ్రతికించినది: (వక్షము నుండి లేచి) నీయదృష్టదేవతను స్మరించుకొనుచుం బోయి, మరల నాయెదుటఁ బడకుండ మాత్రము మసలికొమ్ము.

దుశ్శా—(లేచి యొడలు దులిపికొనుచుఁ జక్కఁబోవును)

సుమి—(అంతటఁ బ్రవేశించి) భర్తృదారకా! మిమ్ము రథమునుండి దిగనీయవలదని దేవిగారు నాతో మఱిమఱి చెప్పినారు. కాని, మీరాకస్మికముగ నేలకు లంఘించుటంజేసి వారించుట కవకాశము లేకపోయినది. దయచేసి, యిఁక రథ మధిష్ఠింపుఁడు.

అభి—(నవ్వి) ఏమి! కుక్కలు కాలు కఱచునని కావలయును దల్లిగారి భయము! మంచిది—అట్లే చేయుదును గాని—యీకట్టు సడలినది—కొంచెము బిగింపుము. (అని యెడమచేయి చాచును.)

సుమి—అమ్మయ్యో! గాయము రేఁగినది కావలయును. జుట్టినపట్టి మంతయు నెత్తుటఁ దడిసిపోయినది! రథము కడకు రండు. ఈకట్టు తీసివేసి క్రొత్తపట్టము చుట్టెదను.

అభి— మంచిది నడువుము. (అని సుమిత్రునివెనుక నడచును)

(తెరలో)

చ. నిలు మిదె వచ్చుచుంటిఁ, దెగనీల్గెద వేమిటి కింతలోనె? యి
ల్లలికినతోనె పండు వగునా? మునిబాలకు దారి యీయ రాఁ
గలిగితి, నంతెకాక మొనగాఁడవె యబ్బలకంబె! నేఁడు నీ
తలఁ దెగఁగొట్టి పార్థుని మదం బడఁగింపక వీడువాఁడనే!

అభి—(చివాలున వెనుకకుఁ దిరిగి) ఏమీ—కురురాజనా!... సుమిత్రా! శాత్రవుఁడు వచ్చి పిలుచుచున్నపుడు వెనుక కడుగు వేయుట వీరధర్మము కాదు. నీవు పోయి రథమునే యిచ్చటికిఁ గొనిరమ్ము. (అని సుమిత్రుఁడు నిష్క్రమింప; దుర్యోధను నుద్దేశించి) ఓ కురుకులపాంసనా!—సుయోధనా!

ఉ. కాంచితొ లేదొ తమ్మునకుఁ గల్గిన పాట్లిపు! డాహవం బనన్
వంచకవృత్తిఁ బాచికలు వైచుటగా—మది నించు కేని నె
గ్గెంచక సాధ్వులన్ సభల కీడ్చుటగా—వడి వారివల్వ లూ
ల్చించుటగాఁ-దలంచితొకొ? [illegible] లాడఁగఁ జొచ్చి [illegible]యున్!

(అని యంతలో రథము రాఁగా దాని నధిష్ఠించును)

దుర్యో—(రథస్థుఁడై ప్రవేశించి) ఓ క్షీరకంఠుఁడా!—

అభి—ఔను, నేను క్షీరకంఠుఁడనే—కాని, నీవు విషకంఠుఁడవు! తరువాయి చెప్పుము.

దుర్యో—విషకంఠుఁ డన నెవరో యెఱుఁగుదువా?—నిటలాక్షుఁ డన్న మాట!—

అభి—నిటలాక్షుఁ డన నెవరో యెఱుఁగుదువా?—నా తండ్రిచేఁ బరాజితుఁ డయినవాఁ డన్న మాట! నాఁ డావిషకంఠుని మదము నాతండ్రి యడంచెను; నేఁ డీవిషకంఠుని మదము నే నడంచెదను.

దుర్యో—పిట్ట కొంచెము, కూఁత ఘనము ననునట్లు, పలుకులకుఁ బెద్దవే!

అభి—పలుకులకే కాదు—ములుకులకుఁ గూడను. చూడు ;—

సీ. అదయాంతరంగుఁడ వగుచు నన్నములోన
విషము పెట్టించిన కొడఁగుఁదనము
నడురేయి నిద్రించు నెడఁ జలంబున లక్క-
యిల్లుఁ గాల్పించిన హీనవృత్తి
అక్రమాక్షంబుల నఖిలరాజ్యంబును
దోఁచుకొన్నట్టి దుర్నయంబు
సాధ్వీమతల్లి పాంచాలిని సభ కీడ్చి
వలువ లొల్పించిన తులువతనము
తలఁపునకుఁ దెచ్చి, నీతలఁ దరిగి, తల్లి
దండ్రులకుఁ బ్రీతిఁ గావించు తఱుణ మెప్పు
డబ్బునా యని చూతు- నేఁ డది లభించెఁ
బాఱిపోవక నిలిచి- నా ప్రజ్ఞ గనుము!

(తెరలో.)

చ. చచ్చెను జచ్చెఁ! బార్థివుఁడు! చంపక మానెడువాఁడు గాఁడు వి
వ్వచ్చునిపట్టి నేఁడు! కృతవర్ముఁడ! చూచెద వేమి? కర్ణుడా!

చెచ్చెరఁ బొమ్ము—బాహ్లికుఁడ! చేరుకొనంగదె తేరి-నేనునున్
వచ్చుచునుంటి-నో కృపుఁడ! వాహినులం బురికొల్పు మాదెసన్!

అభి—(తనలో) ఓహో! ఆచార్యులవారి ప్రభువిశ్వాసము! కాని ముమ్మ—వారు వచ్చులోపలనె నే నీతనిం దెగటార్చి యంపటుకు నాశాభంగము కావించెదను. (అని వింట శరమును సంధించి) ఓ మూఢసుయోధనా!

గీ. సాలెపురు వన్యములకునై సంతరించు
పట్టునం దానె సమసెడు భంగి; ధర్మ
పుత్త్రునింగూర్చి కూర్చిన మొగ్గరమునఁ
జచ్చెదవు నీవె చూడు మీ శరము చేత!

తెరలో—ఆఁ! ఆఁ!—బాబు!—విడువకు! శరము విడువకుఁ!!

గీ. కదనమున వీనితొడలు భగ్నంబు సేయ
భీమసేనుఁడు ప్రతిన గావించి యుండె.

అభి—(నిరుత్సాహముతో) ఏమి! యీతనికిని ఆయనశపథమే యడ్డము వచ్చినదా! ఈ యమోఘాస్త్ర మింక నెవరిపై విడుతును!

కర్ణ—ఉ. ఓరి యువాధమా! మదమదోద్ధతిఁ బ్రేల్చిపడంగఁ బోక నీ
తేరు మరల్చి యీదెసకుఁ, దేఁకువతో నను దాఁకి, నీదు దో
స్సారముఁ జూపు! మింక నిను సైప, భవన్మృతి యాలకించి నీ
వారలు గుండె వ్రీలి విడువన్వలెఁ బ్రాణము లొక్కపెట్టునన్!

(అని పల్కుచు రథస్థుఁడై ప్రవేశించును)

అభి—(తిరస్కారముతో నవ్వి) ఓహో, అంగరాజుగారా! రండు రండు—ఇందాఁకటి మీ స్థితి చూచి మరల దర్శనము కా దనుకొన్నాను! సరి కాని-మనలో మన మాట!—

చ. పలుకుదువంట వీరములు ఫల్గును నేఁ దెగటార్తు నంచు!—నీ
పలుకుల నుబ్బి యీనృపతి ప్రాభవవంతునిగా నొనర్చి, ని
చ్చలు దనతో సమానముగ సర్వము నీకిడుచుండు నంట!—కే
వల మటు భీతిఁ దేరు దిగి పాఱుటకుం దలప లేకపోయెనే?

కర్ణ—(రోషముతో) ఓరి వాచాలుఁడా! ముక్కుపచ్చి యారని ముగుదుఁడ వని సైప, నీస్థితి శ్రుతిని మించి రాగమునఁ బడినదే!

గీ. తండ్రి యడవుల పాలయి తనరు చుండఁ
జేరి మామల పంచను, దేరకూడు
గుడిచి, దొరబిడ్డ లాగునఁ గ్రొవ్వి, యిట్లు
మిడిసి పడియెద వేమందు మిడుత వోలె!

అభి—(నవ్వి) ఓహో, యెంత దోసము వెదకితివి!

గీ. మేనమామల యింటను మెలఁగుటయును
గించుదన మేని—పెరవారి పంచఁ జేరి,
పవలు రే యిచ్చకము లాడి, బ్రతుకు నీదు
జీవితం బెట్టి దానో యోజించుకొనుము!

కర్ణ—ఓరీ! వదరుఁబోతా! పెద్దల యందు పెట్టుకొనఁగల విశ్వాసములేని నీతోఁ బ్రసంగ మనుచితము. ఏదీ—నీకభిమానముగల యస్త్రమేదో దానిని నాపైఁ బ్రయోగింపుము!

అభి—(ధనుస్సు పైకెత్తి) అంతవఱకుఁ బని లేదు—మీ రాజుకొఱకు సంధించిన బాణ మిదిగో సిద్ధముగానే యున్నది! చూడుము,

ఉ. దారుణమైన యీరణము తారసిలెం భవదీయ గర్వయు
క్ప్రేరణచేత; నాజిఁ బృథివీపతి మమ్ము జయింప నిన్ను నా
ధారముగా గణించుకొని త్రవ్వుకొనెం దనగొయ్యి తాన! నీ
బీరము లెల్లఁ జెల్ల మగుఁ, బృథ్విపు నాశయుఁ దీఱు దీనిచేన్!

తెరలో—బాబు! వలదు! వలదు! ఈతనింగూడ నీవు విడువవలసినదే!

గీ. ద్రుపదసుతఁ గాంచి నవ్వినందులకు సభను
పార్థుఁ డీతని వధియింపఁ బ్రతిన పట్టె!

అభి—(విసుగుతో) ఇస్! అబ్బా! అయినవారిని నలుగురిని వారే పంచుకొనినప్పు డిఁక నాచేతి కేమి పని యున్నది!

(తెరలోఁ జప్పుడు)

దుర్యో—(చప్పట్లు గొట్టుచు) సెబాసు! బృహన్నలా! సెబాసు!

నోటిలోనిమాట నోటిలో నుండఁగనే ముదిరాజును జక్కఁగా మూర్ఛఁ బొందించితివి !

అభి—(ఉలికిపడిచూచి) ఓరి దుష్టుఁడా! మదేశ్వరునితోఁ బోరుచున్న మా పెదనాయనగారి సారథముల చాటునుండి యేసితివా ! ఇదిగో !- మీరాజకోటికై సంధింపఁబడిన యీవిషబాణమును నీవు చవి చూడుము ! (అని ప్రక్కకు విడుచును)

దుర్యో—(చూచి విషాదముతో) అన్నన్నా ! మన మిచ్చట నుండఁగనే యీబుడుతఁడు బృహద్బలు నిట్టు బలిగొనినాఁడే ! (ఆగ్రహముతో) ఓరీ! బాలహంతకుఁడా! మా బృహద్బలుని వెనుకనే నీవును యమపురి కేఁగఁ గలవు చూడుము—

తెరలో—ఆ. వె. కావు మయ్య కర్ణ! కావుము కురునాథ !
అంబరంబునుండి యసురుఁ డొకఁడో
విలయమేఘము వలెను పిడుగులు గురియుచు,
నుల్క వోలె దిగుచు నుండె భువికి !

దుర్యో—(గిచ్చపాటుతో) ఎవఁడు చెప్పుమా వీఁడు!- కానిమ్ము ! ఎవఁడైన నేమి.- ఓ సైనికులారా ! వెఱవకుఁడు ! ఇదిగో మేము మా వెంబడినె వచ్చుచున్నారము. మిత్రమా ! రమ్ము, రమ్ము ! అదేమో ముందు చూడవలెను. (అని కర్ణునితో నిష్క్రమించును)

అభి—(తనలో) ఒకవేళ, మాయన్న ఘటోత్కచుఁడు కాఁడుగదా ! అతఁడే! అదిగో! నన్నుద్దేశించి యేమో యనుచున్నాఁడు;

(తెరలో)

మ. జనయితృల్ప్రవంగ నీకుఁ గలన న్యాయంబుగా నుండ వ
చ్చినవాఁడం, బెదతండ్రి మూర్ఛ కలిగించె న్విఘ్న మద్దాని; కీ
యన సిజ్జేరిచి యిడ్డై వచ్చెదను, సైన్యం బంతయు న్నివె పె
ల్చన దున్మాడక తమ్ముఁడా! యిడుము నా సాఁబాలు నాకేర్పడన్.

అభి—(పైకిఁ జూచుచు) అన్నా ! సమయమునకుఁ జక్కఁగా వచ్చితివి ! ఇచ్చట మనయిరువురకుం జాలినంత పని లేదు కావునఁ-

బెదనాయునగారిని జాగ్రత్తతోఁ గొనిపోయి శిబిరముఁ జేర్పుము.
తెరలో — ఓహో. వీరాగ్రేసరులారా !

ఉ చూచెదరేమి ఔచిత్యవడి చోద్యముగా వెఱఁబొగ్గు లట్ల ! యా
నీచుఁడు పాండవాగ్రసరునిం దన తేరునకుం దరల్చి, సం
కోచములేక మింటి కదిగో ! కొనిపోయెను; గుప్పరయ్యె నా
రాచపరంపరల్ గిరగిరం భ్రమరించును నేలఁ గూలఁగనే.

అభి — ఓరోరి దుష్టులారా ? నే నిచ్చట నుండఁగా మీరు మాయున్న
నిగపూవునైన వాడిఁపఁ గలరా ? సుమిత్రా ! అదేమో చూత
ము-శీఘ్రముగ మనరథ మటు పోనిమ్ము.

సుమి — చిత్తము. (అని రథము తోలుకొని పోవును)

సంజ — ఓహో ! ఘటోత్కచుని యాకాశయాన మెవ్వరికిం గానరా
కుండ నెంతలో నంతర్థాన మయినది !

(తెరలో గొప్ప కలకలము)

వైశం — మిత్రమా ! ఆవంక నాకలకల మేమై యుండును ?

సంజ — ఆవంక జరుగునది నీవు చూడనె లేదు కావలయును ! భార
ద్వాజుఁ డిందాఁక విరోధి నిరోధనభారము సైంధవునిపై నిడి,
తాను దుర్యోధన సంరక్షణార్థ మిటు వచ్చుచు యుధిష్ఠిరునిచే
నిలువరింపఁ బడెను గదా ? సైంధవున కది దుర్భర మైనందున
నతఁడు చిరకాలమునుండి పాండవులకొఱకు దాఁచి యుంచికొనిన
స్తంభనాస్త్రముం బ్రయోగించి, నకుల సహదేవ విరాట ద్రుపద
దృష్టద్యుమ్న సాత్యకి ప్రభృతులను స్తబ్ధులం జేయఁ గౌరవబలము
కరతాళధ్వనులతోఁ గోలాహలము సేయుచున్నది.

(తెరలో మరలఁ బెద్ద కలకలము)

వైశం — (ఉలికిపడి) ఈవంక నీకలకల మేమిటి! (నిదానించి) ఓహో
తెలిసినది ! కర్ణ దుర్యోధనులతో నొక్కసారిగఁ దలపడి, వారిని
బాణవర్షమున ముంచి యెత్తుచున్న యభిమన్యుని సంరంభము
చూచి, యాచార్యుఁడు చేయిపిచి పురికొల్ప-రథనేమి గజఘంటా

హయకింకిణీ నినదంబులతోడను, పదాతిసింహనాదంబులతోడను, యోధాగ్రయోధు లందఱు నొక్కపెట్టున నంబోయి మహారౌద్రముగ సౌభద్రుం జుట్టుముట్టుచున్నారు !

సంజ — కాని, యేమిలాభము!- వారు ప్రయోగించిన యాయుధము లన్నియు * తప్తాయసపతద్బిందు న్యాయముగా- వ్యర్థము లైనవి

సీ. కర్ణుఁడు చచ్చిన గతి సొమ్మసిల్లెను,
దుర్యోధనుఁడు తేరు దుమికి పాఱె
వైశం-అశ్వత్థాముం డిలఁ గూలె, నల రుక్మరథుఁ డీల్గె,
విందుఁడు సారథి వెనుక నొదిగె
సంజ — కృతవర్మ పఱచెను, కృపుఁడు మూర్ఛిల్లెను,
కటకటా ! కంటె ? లక్ష్మణుఁడు చచ్చె !
వైశం-వృషసేనుఁ డోడె, సువేగుఁడు మడిసెను,
శల మద్రవిభులు నిస్సారు లైరి
సంజ — పేరుగలవార లంద ఱీతీరు గాఁగఁ,
గొఱవి త్రిప్పిన చందానఁ గుమ్మరిలుచు—
వైశం— మూఁడి మసఁగిన విధమున మారణంబు
సలుపఁగాఁ జొచ్చెఁ గురుసేన పలుచపడఁగ.

సంజ — తాళు, తాళు !-మూర్ఛ తేఱిన కర్ణు నుద్దేశించి యభిమన్యుఁ డేమో యనుచున్నాఁడు.

తెరలో-గీ. తాను నీజోలి కిఁక నంగరాజ ! భీతి
మాని, దిటవూని, చాపముఁ బూని పరశు
రాముకడ నీవు నేర్చిన దేమొ—నాదు
కడఁ బరీక్ష యొసంగుము కలఁకఁ దేఱి !

వైశం— ఆమాట యాయువుపట్టున నాటినది కావలయును !-కర్ణుఁడు కాలపృష్ఠమును మ్రోయించుచు మరలఁ దలపడుచున్నాఁడు ! ఓహో ! ధనుర్విద్యాపారంగతులగు నయ్యుభయుల దివ్యాస్త్ర ప్రయోగకౌశల మెంతచమత్కారముగా నున్నది !

* కాలిన పెనముపైఁ జల్లఁబడిన నీటిచుక్కలవలె.

గీ. కన్ను మిన్నుఁ గన్పడని చీఁకటు లొకప్డు;
వేయిసూర్యులు పొడిచిన వెలుఁ గొకప్డు !
అంబునిధు లింకు నగ్ని హోత్రం బొకప్డు;
జగతి నెల్లను ముంచు వర్షం బొకప్డు !

సంజ — ప్రేక్షకులగు కౌరవయోధుల యవస్థ యంతకంటెను జమత్కారముగా నున్నది !

గీ. అంగరా జస్త్ర మడరించు నప్పుడెల్ల
బహుళతరామోదమునఁ దాండవం బొనర్త్రు;
పార్థసూనుఁడు నవ్వుచుఁ బ్రతిశరమున
దాని నడఁగించు నప్పుడు తలలు వంత్రు !

వైశం — అన్నిటికంటెను జమత్కార మింకొకటి —

క. విడిచిన యస్త్రము నడుమనె
చెడ, నెడఁ దను రిచ్చపాటుఁ జెందెడు కర్ణుం
గడు హెచ్చరించి యభిమ
న్యుఁడె జ్ఞప్తికిఁ దెచ్చుచుండె నొండు శరంబున్ !

సంజ — అంతియే కాదు — దుర్యోధన ప్రేరితులయి శత్రుంజయుఁడు, చంద్రకేతు, సువర్చన, సూర్యభాను, మేఘవేగు లతివేగంబుపోయి కర్ణునకు బాసటగాఁ దాఁకి యఖండ శరవర్షము గురిసియు, నైదు క్రూర నారాచంబుల నైదుగురి కంఠంబులం దుంచి, యాసందున నొవ్వఁ జేసిన కర్ణుని జర్జరిత శరీరుం జేసి సాగనంపి, కర్ణికలోఁ బ్రవేశించుచున్నాఁడు కనుము !

వైశం — కర్ణదుర్యోధను లిరువురుఁ బాదచారులై యెందులకుఁ జెపుమా యిటు వచ్చుచున్నారు ?

(అంతటఁ గర్ణ దుర్యోధనులు ప్రవేశింతురు.)

దుర్యో — మిత్రమా !

చ. పలుచనడెం బలంబు బహుభంగుల ! — మొగ్గర మంతయు న్శవంబులకు నిధానమై, రుధిరపూరిత మై కనుపట్టుచుండె ! — బె

బ్బులిఁ బొడగన్న లేళ్లగమి పోలిక సైన్యము లెల్ల విచ్చి వి
చ్చలవిడిఁ బాఱఁజొచ్చె!—నిఁక సాధన మేమియు లేదె దీనికిన్?

కర్ణు—మహారాజ! వీఁ డర్జునునికంటె నసాధ్యుఁడని మొదటనే చెప్పి
యుంటిని గదా? అమీఁద, నాచార్యుఁ డేమని పూనుకొనునే మో
యని చూచుచున్నాను.

దుర్యో—మిత్రమా! యేమి నీ కీవెఱ్ఱి! ఆచార్యున కాపాటి సహాను
భూతియె యున్న యెడల వీఁడు మొగ్గరమునఁ గాలు పెట్టఁ
గలఁడా! సైంధవుఁ డిందాఁక దైవమువలె నడ్డుపడకయున్న నీపా
టి కేమి కావలసినదో! (ముందునకుఁజూచి) ఎవ రావచ్చువారు?

కర్ణు—సింధురాజే—

దుర్యో—బావా! రమ్మి, రమ్ము—ఈపూఁట నీవలన మర్యాద
దక్కినది. ఆమాటయే యిప్పు డంగరాజుతో ననుచుంటిని.

సైం—(గర్వముతోఁ బ్రవేశించి) ఎక్కడి కేఁగిన నిదియే మాట—
ఏరినిఁ జూచిన నిదియే మాట! సరికాని—యీ బాలయమునిం
బరిమార్చుట కేమయిన దారి దొరకినదా?

దుర్యో—అదియే యాలోచించుచున్నాము—

సైంధ—అట్లయిన, నే నందులకే నీకొఱకు వెదకులాడుచు వచ్చినాఁ
డను. ఏదో మాటలసందర్భములో-ఘంటినుండి యుల్కగాలినట్లు
ఆచార్యుని నోటినుండి యొకరహస్యముజారి బయటఁ బడ, దానిని
నాల్కకుఁ దగిలించుకొని చక్కవచ్చితిని.

దుర్యో—(ఆత్రముతో) బావా! చెప్పు, చెప్పు!—ఏమది?

సైం—వీనికిఁ గవచధారణ మనువిద్య తెలియునఁట: అందువల్ల
రథ తురగ సూత కార్ముకముల నేకకాలమునఁ దునిమి, నేలకుఁ
దెచ్చి, చీకాకు పఱిచినం గాని వీనిం జంపుటకు సాధ్యపడ దఁట.

దుర్యో—మేలు! బావా, మేలు! మంచిసమాచారము తెచ్చితివి!

(సందేహముతో) సరికాని—ఏకకాలమున నిన్ని కార్యము లెవ్వరు చేయఁగలరు?

కర్ణు—అన్ని కార్యములు నొక్కరిచే నగుట యసంభవమే. సమర్థులు నలుగురు నాలుగుకార్యములం బంచుకొనవలెను.

దుర్యో—అది బాగుగనే యున్నది కాని—నాలుగిటిలో కార్యైక ఖండనము. *సింహ ఘంటా న్యాయమువంటిది!

కర్ణు—అది నిజమే కాని—దాని నెట్లో నేను నిర్వహించెదను: కడమవానిసంగతి చూడుము.

దుర్యో—అట్లయినఁ, గడమవానికి దగునేర్పాటు నేను జేయఁగలను.

కర్ణు—ఇంకొకటి చాలఁ బ్రాముఖ్యము! ఈలోపల ఘటోత్కచుఁడు మరల రాకుండఁ జూడవలెను.

దుర్యో—ఆసందియ మక్కఱ లేదు. వాని నంతరిక్షమున నిరోధించుటకై మన యలంబసుని సమస్తపరివారముతో నిదివఱకే నియోగించి యున్నాఁడను. ఇఁక నాలస్య మెందులకు. ప్రొద్దుగూడఁ గ్రుంకవచ్చుచున్నది-పోవుదము రండు. (అని ముందు నడచును.)

సైంధ—(తనలో) సుభద్రకుఁ బుత్త్రశోకము గలిగించినం గాని నీ ముఖము చూడ నని కదా నాప్రియురాలు పట్టు పట్టినది?—ఈ యత్నము కొనసాగినచో అభిమన్యుఁడు నావల్లఁ జచ్చినట్లే లెక్క. ఆమీఁద, నానందడిలో, నేనుగూడ నేమయిన రవంత చేయఁగలిగితి నా- యిఁకఁ జెప్పనక్కరయే లేదు! (అని నిష్క్రమించును.)

కర్ణు—మొదట దూరదృష్టి లేక యీరాజునకుఁ దను మన, ప్రాణములను ధారవోయుటం జేసి యిప్పు డింతటి దుష్కార్యమునకుఁ బూనికొనవలసి వచ్చినది! (పయికి జూచి) ఓ యభిమన్యుఁడా! లోకములో నీవొక్కఁడవే వీరుఁడవు! ఏమన?—కర్ణునిచేఁ గూడ వీరజనవిరుద్ధమగు మార్గమును ద్రొక్కించుచుంటివి కనుక! ఓ ధనంజయా! లోకములో నీ వొక్కఁడవే ధన్యుఁడవు! ఏమన?—

* సింహము మెడలోని గంటను విప్పుట వంటిది.

అభిమన్యునకుఁ దండ్రి వగుటచేత ! సందియ మేమి !—

చ. తనతనయుం గుఱించి యొడఁదం గరువంబును బొందుభాగ్య మె
వ్వనికి లభించు—నాత్మజుని ప్రాభవ రూప వివేక వీర్య వ
ర్తనములచేత నెవ్వఁడు పరాజయు మందు—సుఖింపఁ గాంచునం
దనుని యశంబునం దెవఁ డతండె కృతార్థుఁ! డతండె తండ్రియున్!
(అని నిష్క్రమించును.)

సంజ—మిత్రమ! దుర్యోధనుని యాగ్రహమునుబట్టి యేదో క్రొత్తపన్ను గడమీఁదఁ జనుచున్నట్లు తోఁచుచున్నది. అదిగో !—అచ్చటఁ గృప కృతవర్మ సోమదత్త బాహ్లిక భూరిశ్రవ శ్శల శల్య శకుని దుశ్శాసనాదులం బోవ్రుచేసి వారితో నేమో మంతన మాడుచున్నాఁడు! ఎందులకో కాని. యందఱుఁ దల లెగురవేయుచున్నారు. అదిగో, దుర్యోధనుఁ డందఱు వెంటఁగొని యభిమన్యుఁ డున్నదెస కరుగుచు, బలములవంకఁ జేయి వీచుచున్నాఁడు! పాపము!—చేతికట్టు మరల సడలినది కావలయును—అభిమన్యుఁడు విల్లు క్రింద నిడి దానిని సవరించుకొనుచు వీరరాశిఁ జూచి చరాలున మగుడ విల్లందుకొని యేమో యనుచున్నాఁడు !

తెరలో—ఓ కర్ణ దుర్యోధన కృప కృతవర్మ శల్యప్రభృతులారా !

ఉ. చిల్లరమూకలం బొదివి చీలిచి పీనుఁగుపెంట సేయఁగా
నొల్లకయున్న వీకరము లూడనిబాడర యుంకనైనఁ, జే
విల్లు ధరించినందులకు వీరులరై కడదాఁక నిల్చి, మీ
తల్లులు వీరమాతలుగ ధాత్రి విరాజిలఁ జేయఁ గల్గుఁడీ!

సంజ—చూడు, చూడు;—అతనిపలుకులు ములుకులవలె నాటినవి కావలయును—అంద ఱొక్కపెట్టున సింహనాదంబులతో నతనిం బొదివి, పరశు పట్టిస ముసల ముద్గర తోమర భిండివాలాద్యనేకాయుధంబులు బోరునఁ గురియుచుండ—వారిముందు చూచికొని యచ్చటిబల మంతయుఁ * పిపీలికా పన్నగ న్యాయముగా-నతనిం జుట్టుముట్టుచున్నది!

* చిరిచీమలు పామును జుట్టుకొనినట్లు

సంజ—కాని, యాతఁడు మందహాస సుందరవదనారవిందుఁడై, రివ్వు రివ్వున వజ్రసన్నిభములగు వాలుటమ్ములు రువ్వి— *ఖలేకపోత న్యాయముగా—నెల్లవారు నెగిరిపోవుచుండ నేమో యనుచున్నాఁడు వినుము.

తెరలో—ఓ పిఱికిపందలారా!

ఉ. ఆఁడుదివాని పౌరుషమె యాభరణంబుగ నెంచునట్టి స
ద్భారతజాతికెల్లఁ దలవంపు ఘటిల్లఁగ మీర లీక్రియం
బాఱఁగ వచ్చునే! పిఱికిపందలు చచ్చుచునుందు రెన్నియో
సారులు; శూరులకుఁ జావొకయప్పుడు మాత్రమే సుండీ!

వైశం—ఆమాటలకు రోషమువచ్చి దుర్యోధనుఁ డదిగో యెల్లవారి మీఁదను గటకట పడి, గజసైన్య మొకవైపునను, తురంగసైన్య మొకవైపునను ముట్టడింప నియోగించి, మహారథుల నందఱను వెంటఁ గొని తాను బురోభాగమునం దలపడుచున్నాఁడు.

సంజ—సరి కాని—కర్ణుఁడు నొచ్చిన ట్లభినయించుచు, వెఱచినట్లు నటించుచు, వెనుక కొదిగి, తప్పుకొనుచుఁ దారుచు, నాదంతావళము లచాటునుండి యెందులకో యభిమన్యుని వెనుకకుఁ బోవుచున్నాఁడు చూచితివా?

వైశం—అవు నవును; అతనివరుస చూడ సందేహాస్పదముగనే యున్నది!...అమ్మయ్యో! యేదో దురాలోచన జరిగినది! అటు చూచి, యిటు చూచి, చివర కా కరికళేబరముల పొంత నిలిచి, శరము సంధించి, యదిగో!—యీవలివారి కేమో సంజ్ఞ చేయుచున్నాఁడు!—

సంజ—హా! యెంతదారుణ మెంతదారుణము!

గీ. కార్ముకముఁ ద్రుంచెఁ గర్ణుఁడు!—కదిసి హయులఁ
జంపె శల్యుఁడు!—సూతునిఁ జంపెఁ గృపుఁడు!
కురుపతియుఁ దమ్ములుం దేరు విఱియ నేసి!
రొక్కుమ్మడిగ—రణధర్మ ముజ్జగించి!

* కళ్ళములో వ్రాలిన పావురము లన్నియు నొక్కసారిగ నెగిరిపోవునట్లు

వైశం — ఓరోరి దుష్టులారా! అందఱుం గూడి చేసిన యాలోచన మిదియా!— చీ! చీ!— నిరాయుధుఁడై యున్నవానిపై నట్లింకను నస్త్రశస్త్రములం గురియుటకు మీకు సిగ్గయినలేదా!— సెబాసు! సింగపుఁ గొదమ యేస్థితియందును సింగపుఁ గొదమయే! ఆవిధముగ నందఱొక్కపెట్టున శరవర్షము గురియుచున్నను డీలుపడక, చివాలునఁ గరవాలముం గొని, కుప్పించి, గుప్పున నప్పరంబున కెగసి, వైనతేయునివలె వర్తించుచున్నాఁడు! ఓహోహో!

సీ. పటుతర రోష సంభరితమై యరుణ రా
జీవంబుగతి మోము జేవురింప
తుల లేని నెమ్మేని తూఁటులనుండి చి
క్కని వేఁడినల్ల చిల్లున స్రవింప
అనివార్యమగు చంద్రహాస విక్షేపంబు
గగనసీమను దటిద్గణము నింప
క్షితిఁ గంపిలం జేయు సింహనాదంబులు
దిక్సమూహమునఁ బ్రతిధ్వనింప
విభ్రమస్థితి మింటఁ బరిభ్రమించు
పార్థసుతుఁ గని, యేరిపైఁ బడునో యనెడు
భయముచే నెల్లవారును బయిరిఁ గన్న
బకముల ట్లొదుగుచు నున్నవారు కంటె!

సంజ — కాని, పాపాత్ముఁడు కర్ణుఁడా కరవాలమును గూడ ఖండింప మరల నందఱు మగవారలై పుంఖానుపుంఖములుగా విశిఖములతనిపై గుప్పుచున్నారు!

వైశం — అయినను, నతఁడించుకయు సరకుచేయక కర్ణుని రథముపై నుఱికి, చేతియందలి యఱకైదువుతో సారథిని నఱికి,— సిగ్గువిడిచి ధ్వజపీఠము క్రింద నొదిగిన కర్ణుని బఱచిన వానింగాఁ దలంచి నేలకు లఘించి, తనయరదమునందలి చక్రముం గొని దట్టముగఁ దనపై శిలీముఖములం బరపు కృపునివంకకు నడచుచున్నాఁడు—

సంజ—ఔరా! ధర్మ మెంత దవ్వయినది! కర్ణ శల్య భూరిశ్రవ స్సోమదత్తులు నలువురును నలుదెసలం బొదివి; చక్రము తుత్తునియలు గావించి, శరవర్షముతో నతనిని ముంచియెత్తుచున్నారు! కటకటా! క్షణకాలముక్రిందటం జెక్కుచెదరక నిగనిగలాడుచుండిన కోమలశరీర మెంతలోం దూంట్లు పడి జల్లెడ యైనది!

సైశం—అట్టిస్థితిలోం గూడ నాతని శౌర్యధైర్యములు చూచితివా? కాలదండమునంబోలు తన గదాదండమును గొని, తనపైం గురియు శరవర్షము దానిచే నాచికొనుచుం, బెంగు గుట్టలమీందినుండి చెంగుచెంగున దాంటుచుం జని, దురాలోకముగు నా రాజలోకముపైం దలపడుచున్నాండు!

సంజ—సరి కాని—రక్తపాతముచే మైకము గ్రమ్ముచున్నదా యేమి యట్లు తూలిపోవుచున్నాండు? అన్నన్నా! యీకిరాతు లిప్పుడు గూడం బాప! మతని నమ్ములతోం గ్రుమ్ముచునే యున్నవారు గదా! కాని, ముఖాముఖి నెదిర్చుట కిప్పుడు సైత మొక్కరికిని ధైర్యము లేదు సుమా!

సైశం—నీమాటకు నిదర్శన మదిగో! అటం డావైపున నన్న రథములను నగ్గునూచము గావించి, యిటు తిరుగ, దుర్యోధన దుశ్శాసన శకుని సైంధవ ప్రభృతు లొకరి నొకరుం దోంచికొనుచు నీ వంకకుం బరువిడి వచ్చుచున్నారు! అతండును నంతటితో విడువక వెన్నంటి వచ్చుచునే యున్నాండుగాని—పాపము-బలహీనతచేం గావలయును బరుగిడలేకున్నాండు!

[దుర్యోధనప్రభృతులు తెరం జిమ్ముకొని ప్రవేశించి నిష్క్రమింతురు.]

అభి—(అంతట రక్తసిక్తాంగుండై, గదాదండముతో రొజుచుం దూలుచుం బ్రవేశించి) ఓరోరి!...ఓరోరి! పాఱుంబోతులారా!..విక్రమముతోడిపాటు...మీకు...మీకు...వివేకముకూడ లేదేమి!

గీ. కాయమా—మన్న!...ప్రాణమా—గాలి!...వాని
కొఱకు...మర్యాద...నిటు...మాపుకొనద రేల!

పౌరుష...జ్ఞాన...కీర్తులం...బరంగు వాని
బిడ్డ... మోఁలి ప్రసేఁ...పైనంజాలుం గాదె !

(పరికించి) ఛీఛీ ! సిగ్గు విడిచి...కౌరవేశ్వరుండుకూడ ...కాలికొలంది పరుగిడుచున్నాండే ! (చేయెత్తి) ఓకురుకులపాంసనా !

ఉ. రోసము వాసి...పౌరుషము రోసి.. తోల గెవ విల్లు మూఁతిపై
మీసము లేదె !...పాటిన నమిత్రులు మిత్రులు గూడ నవ్వరే!
వాసిగలట్టి...యీ భరతవర్షమునం దెవ్వడైన...నిట్టిన
న్యాస్యులు పుట్టిరే ! కటకటా ! కలికిం దొలిచూలి పట్టివే !

(పరికించి) ఏమి ?-నాపలుకులు... చెవుల కెక్కనే లేదా ! మంచిది, యెంతదూరము పోంగలరో పోండు చూచెదను ? (అని బిఱబిఱం జనంబోయి ముందునకుంబడి, మరలమెల్లంగ లేచి) ఛీఛీ! యీ పాడుశవములు మాటిమాటి కడ్డు వచ్చి మార్గావరోధము కలిగించుచున్నవి !...(పశ్చాత్తాపముతో) అన్నన్నా ! యేమంటిని?...పాడుశవము లనియా ?—యెంతయుపచారము !...యశముసెడం బ్రేమ, యవమానమునెడ లజ్జ, లేక యీ పాటెఱునవి పాడుశవములు గాని—ప్రాణమున్నంతవఱకుం బోరి రణముభూమి నలంకరించిన యివి పాడుశవము లెట్లగును !...(మరలం బరికించి) ఆపిఱికిపంద లింతలో నేమయియుందురు !...ఛీ ! ఛీ !—యట్టి పాఱుంబోతులతో నేమిపని ! (అని వెనుకకుం దిరిగి పరిక్రమించి) ఏమిచెప్పుమా భూమి యంతయు గిరగిర తిరుగుచున్నది !...అంతియే కాదు—నో రిగురుచున్నది—కాళ్ళు తడంబడుచున్నవి—కన్నులు—కన్నులు—ఇవు డన్నమాట యేమిటి ?—కవచమా? ఎవరుచెప్పుమా నన్నుం బిలుచుచున్నారు ! (అట్టిటుచూచి) ఓరీ—యెవ్వరును లేరే !...ఇప్పుడు నే నెచ్చట నున్నాను ? ...అవు నవును—పద్మవ్యూహము. అట్లయిన, నారథ మేది?—నావిల్లేది? ...అన్న ల్లాపిఱికిపంద లధర్మముగా నన్ను విరథుం జేసి, యిహపరముల రెంటిని జెఱచుకొనిరి కదా! పోనిమ్ము, నాకే గదా

దండమే చాలును. కాని—యెడమచేయి వలనదప్పియుండుటచేత దీని నీదక్షిణబాహు వొక్కటియే భరింపవలసి వచ్చినందులకు నాకుఁ జాల విచారముగా నున్నది! పైగా—నెత్తుటిచేఁ దడిసి యిది మాటిమాటికి జారిపోవుటకూడ సంభవించుచున్నది! సరి కాని—యీరక్త మంతయు నాదా,- లేక శత్రువులదా?—నాది యె యైనచో నాయదృష్ట మెంతనవచ్చును! ఏల యన,—

గీ. ఎవ్వఁడు స్వరాజ్యమునిమిత్త మెన్నిరక్త
బిందువులు ప్రీతి వసుధ కర్పింపఁగలుగు-
వాఁడు భూలోకమున నన్ని వర్షశతము
లమరుఁడై యుండు కీర్తికాయంబుతోడ!

(వినుట నభినయించుచు) ఏమి చెప్పుమా యీ కలకలము? (పరికించి రౌద్రముగా) ఓరీ కురుకులకలంకా! మరల నెట్లో యీ వైపునకుఁ జేరికొని, మొట్టమొదటవచ్చితిమనువారికిఁ బౌరుషమెక్కించి నామీఁదికిఁ బురికొల్పుచుంటివా! పాపము!—వారి నేల బాధించెదవు! నేనే యటు వచ్చెదలెమ్ము. (అని తూలుచు నిష్క్రమిం.)

వైశం—అన్నన్నా! పాపము!—పోవుచుఁ బోవుచు నానెత్తుటిరొంపిలోఁ గాలు జారి మరలఁ జాపచుట్టుగ నేలఁ గూలినాఁడు!—కట కటా! యీసారి లేచుటకుఁగూడ శక్తి లేక ప్రాణములాడుచున్నాడు! అరెరే! * మంఖుణములుకూడ జారిపోయినవి! ఓరోరిపాపాత్ము లారా! యెందుల కట్లుపరువిడి వచ్చుచున్నారు!—అందరొక్కమాటుగ మీఁదఁబడి మోదవలె ననియా యేమి? ఆఁ! లేచెను!

సంజ—లేచుటయే కాదు,—గదాదండము గిరగిరఁ ద్రిప్పి—

గీ. కర్ణుఁ బడమోదె! శల్యుని గాడనేసె!
రాజును దెరల్చెఁ గృపుని సారథినిఁ గూల్చె!
అడరు దుశ్శాసను నదల్చె! నతనిసుతుఁడు
విఱుగఁ బడఁగొట్టె దలపడ విరథుఁ జేసె!

---

* పిక్కలకుఁ దొడిగికొను కవచము.

వైశం—కాని, యాదాశ్వాసని యంతటం బోక, తానును గదాధారి యై యతనిం దలపడుచున్నాఁడు. ఓహో! నెత్తుటిరొంపిలోఁ గాళ్ళు గుచ్చుకొని పోవుచున్నను, బిగిలబిట్టవలె నిరువురు నెంత చాకచక్యముగఁ బోరుచున్నారు!...అబ్బబ్బా! యిద్దఱిశరీరములును బొట్టపండ్లవలె వ్రీలి రక్తప్రవాహముతో మాంసపుముద్దలు గూడఁ గొట్టుకొని వచ్చుచున్నవి!...ఓహో! కన్నులు కానరాకున్నను, జేతులయందుఁ జేవ లేకున్నను పౌరుషము వారిని మరలమరల డీకొలుపుచున్నది!...హా! యెంతబీభత్స మెంతబీభత్సము!...ఆ!—చచ్చె—దుశ్శాసనకుమారుఁడు చచ్చె!

సంజ—అయ్యో! అయ్యో! ఆదారుణము చూడవేమి;—

గీ. నెత్తుటం జొత్తిలుట జారి నేలఁ బడిన
తన గదాదండమునకు నై తడవులాడు
సమయమున- సైంధవుఁడు, శల్యు చాటునుండి
కుంతమున గ్రుచ్చి యభిమన్యుఁ గూలఁ ద్రోసె!

వైశం—ఓరోరి వీరంమన్యులారా! యెందుల కా కోలాహలము!—ఇందఱుకూడి చేసిన యీఘనకార్యమున కేనా-యీసంతోషము! ఛీ! ఛీ!—సంజయా! లెమ్మా! మన మింక నిచ్చట నుండరాదు! (అని సంజయునితోఁ జెట్టు దిగి) ఓమహావీరుఁడా! నీవు నిర్వహించిన వీరవ్రత మనన్యసామాన్య మైనది! నేఁ డీసేనలో నీచే దెబ్బతినని వాఁడును—నీ కోడని వాఁడును లేఁడు! (భూమివంకఁ జూచి)

మ॥ అభయస్ఫూర్తి వహించి, యెన్నఁడును నన్యాక్రాంతిదుఃఖంబు లే
క, భృశమ్మైన యశమ్ముతో సకలసౌఖ్య ప్రాభవ శ్రీలతో
నభివృద్ధిక్ వహియింపఁ గోరునెడ నార్యావర్తమా! తప్పక నీ
వభిమన్యుప్రతిమాను లౌసుతులనే యశ్రాంతముం గాంచుమా!

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది చతుర్థాంకము.

చూళిక

(తెర లోపల)

ద్విపద.

కటకటా! పుత్త్రశోకము! నీదుశక్తి
పటుతరం బని తేటపడియెను నేఁడు!
కార్చిచ్చు వనములఁ గాలుచు రీతిఁ
బేర్చి మానసముల నేర్చ నేచుతువు!
సడిలేని యుప్పెన చందంబుగాను
కడుపు సముద్రంబుఁ గావింపఁ గలవు!
సుడిగాలి మోకను సుడివెట్టు భంగి
నుడుగక ధృతిఁ బట్టి యూఁపఁ జాలుదువు!
కాకున్న నడవులఁ గష్టంబు లెల్ల
నేకమై యరికట్టి యెదురునాఁ డేని;
విరటునికడ మాఱు వేషముల్ తాల్చి
కరము హీనస్థితిఁ గడపునాఁ డేని;
తలఁకని పాండురాట్తనయుల నేఁడు
కెంచి దుఃఖార్తులఁ గావింపఁ గలవె!
బేల యైనసుభద్ర పెనుమూర్ఛ కేమి.
గోఁయా నుత్తర గోలకు నేమి,
కడుధీరుఁ డని పేరుఁ గన్న యర్జునునిఁ
బిడుగు పడ్డట్లు గావింపఁ జాలితివి!
దరినుండి కృష్ణుఁడు దైవంబువోలె
పరగఁ బ్రబోధంబు పలుకక యున్న-
వడముడి తనయుని వలన నాతనికిఁ
గొడుకు విక్రమము నూఁకొనఁగ నబ్బడునె!

ఇది చూళిక.

పద్యవ్యూహము

పంచమాంకము,

రంగము — పాండవుల సభా శిబిరము.

[కృష్ణ యుధిష్ఠిర భీమార్జున ఘటోత్కచ ప్రభృతులును,
ఉత్తర సుభద్రా ద్రౌపదులును, దుఃఖచిహ్నములతోఁ బ్రవేశింతురు.]

కృష్ణ — తరువాతఁ, దరువాత ?

ఘటో — తరువాత నింకే మున్నది ! —

సీ. దుర్నిరీక్ష్యస్థితిఁ దులకించి తులకించి
చరమాద్రిఁ గ్రుంకు భాస్కరునిభంగిఁ
గాననంబులు బూదిగాఁ గాల్చి కాలిచి
చల్లారు దావ కృశానుమాడ్కి
వడివడి పడగండ్లు వర్షించి వర్షించి
ధవళిమఁ గను జలదంబు పోల్కి
గగనంబు నొరసెడు గతిఁ బొంగి పొంగి చ
ప్పనఁ జప్పఁ బడిన యంబోధి కరణిఁ
దన్నుఁ బొదివి శస్త్రతతులను మే నెల్లఁ
దూఁటు పఱుచు నట్టి దుష్ట రిపుల
కలఁచి కలఁచి, తుముకు కావించి కావించి
తమ్ముఁ డకట ! తుదకు ధరణి కొఱఁగె !

అందఱు — (ఒక్కపెట్టున) హా ! యసహాయశూర ! — హా ! జగదేక
వీరా ! (అని యాక్రందనము చేయుదురు.)

యుధి — హా ! తండ్రీ ! — యెంత దైవదుర్విపాకము సంభవించినది !

సీ. పూప ప్రాయము నాఁడె పోలసుదిండులఁ జంపు
మొనవడి గలవాఁడు మేనమామ

బలిమి జరాసంధుఁ బట్టి రెండుగఁ జీల్చి
పేరు గాంచినవాఁడు పెద్దతండ్రి
ఫాలాక్షు నోడించి పాశుపతం బంది
గనుతి కెక్కినవాఁడు కన్నతండ్రి
నిజభుజశక్తి దిగ్విజయంబుఁ గావించి
వన్నె మీఁటినవారు పిన్నతండ్రు
లిందఱం గల్గియుండి, యొక్కింతపాటి
దైవకృప లేకయుంట నోతండ్రి! యిట్లు
దిక్కుమాలిన వాఁడనై చిక్కుపడితె
పగఱ చేతుల నన్నుఁ గాపాడ వచ్చి!

కృష్ణు— బావగారు! సర్వజ్ఞుల రగు మీరే యిట్లు మాటిమాటికి దుః
ఖమున కెడ మొసఁగిన-నిఁకఁ దక్కినవారి గతి యేమి?

భీము—అబ్బాయి! సరి కాని—నీవు పోయి యేమి చేసితివి?

ఘటో—ఏమి చేయుటకును నెవ రున్నారు!—అప్పటి కప్పుడే సమర
ము చాలించి యెల్లవారును శిబిరములం జేరికొనిరి.

భీము—(కోపముతో) శిబిరములలోఁ బ్రవేశించి సిగలు పట్టియీడ్వలె
కీడ్చుకొని వచ్చుటకు భయపడితివా?

ఘటో—తండ్రీ! మన్నింపుము!—నేను భయపడినమాట నిజమే
కాని, శత్రువులకుఁ గాదు-ధర్మలోభులగు పెదనాయనగారికి—

యుధి—నిజమే నాయనా—నిజమే! నాధర్మలోభమే యింత చేసినది!

చ. ఖలుల నధర్మవర్తనులఁ గర్ణసుయోధన దుస్ససేనులం
బలిగొను భీష్మకున్ శకునపక్షి విధంబున నడ్డు వోయి నేఁ
దెలుపకయున్నఁ దండ్రుల ప్రతిజ్ఞల సంగతి, యిట్టిచెట్ట రాఁ
గలుగుట కించు కేనియును గారణ మున్నదె నిశ్చయంబుగాన్!

భీము—(విషాదముతో) హా! తండ్రీ! యిదికూడనా!—

గీ. తండ్రుల ప్రతిజ్ఞలకు హాని తారసిల్లు
ననుతలంపునఁ జిక్కనఁయదుల విడిచి

నిన్నుఁ గట్టంగఁ దాళ్ళను నీవ తెచ్చి
యొన్న వాఁడ వటోయి! మాకొఱకుఁ దండ్రి!

(ఆకసమువంకఁ దృష్టి నిగిడ్చి) ఓరోరి కౌరవకులాపశదులారా!

ఉ. బాలకు, నొంటిగాని, జెయి వాటముఁ దప్పినవాని, పాడిపై
మాలిమి మిమ్ములం దునుము మానినవాని, నిటం దఱేకమై
కూలిచి కేకచుంటి రిది గుండెలలో నిడికొండు! మీతలల్
కాలను దన్నుచుం దివికిఁ గందుక కేళి యొనర్చి తీఱెదన్!

కృష్ణు — ఈశపథము తథాస్తు దేవత లాలకింతురు గాక!

అర్జు — (నిట్టూర్పుతో) బావా! వారి ననవలసిన పని యేమున్నది!

ఉ. తాత యవక్రవిక్రమముఁ, దండ్రుల ధర్మపరాయణత్వమున్
మాతల రూపవైభవము, మామల యద్భుత బుద్ధిపాటవం
బాతతభంగి నిచ్చి- యిటు లాయువు తక్కువ చేసినట్టి యా
ధాత యొకండె నింద్యుఁ! డిఁకఁ దక్కినవారు నిమిత్తమాత్రకుల్.

ఇంతకును—

ఉ. చక్కని రూపసంపద, ప్రశస్తతరంబగు వర్తనంబు, పెం
పెక్కిన బుద్ధి, నిచ్చలు రహించెడు తెల్వి, వరించి తాముగా
నెక్కొనినట్టి విద్యలు, త్రినేత్రుని సైత మెదిర్చు సాహసం-
బక్కట! మందభాగ్యులకు నట్టితనూభవుఁ డెట్లు దక్కెడున్!

కృష్ణు — ఫల్గునా! నీ వన్నమాట నిక్కువము.

గీ: మానవుఁడు చెట్టునందలి మంచిఫలము
వెదకి మఱి కోసికొనియెడి విధముగాను!
మంచివారినిఁ, గుల ముద్ధరించువారి,
నెంచి మఱి మృత్యు తాఁ గబళించుచుండు!

ఉత్త — (శోకముతో) హా! ప్రాణేశ్వరా! హా! హృదయేశ్వరా!

సీ. మనపెండ్లి కొఱకు వేసిన పచ్చి పచ్చాకు
పందిళు లింక విప్పంగ లేదు

మనపెండ్లి చూడ వచ్చిన బంధుతతి తమ
సీమల నింకను జేర లేదు
మనము ధరించిన మధుపర్కములపారి
ద్రాశ్వర్ణ మింకను దరుగ లేదు
మన మొండొరుల సిగ్గు మాని పూర్తిగఁ గనుల్
తనియ నింకను జూచుకొనఁగ లేదు
ఇంతలోవలనే మది నింత జాలి
మాలి, లేజవరాలిఁ, జూలాలి, నాలి
నిట్లు విడనాడి యెటుగ నేఁగఁ దగునె!
చిత్తసంభవ సంకాశ! జీవితేశ!

చ. కవచము మేని, కంజనము కన్నులకున్, శ్రుతిలీనగాన మీ
చెవుల, కభీప్సితార్థ ఫలసిద్ధి మనంబునకున్, మనోజ్ఞమా
చవి రసకుం, బ్రయోజనము సంజననంబున, కారయం ద్వదీ
య విమల సన్నిధాన; మనఘా! యది లేని ప్రపంచ మేటికిన్!

ద్రౌప—బిడ్డా! యోర్చికొ మ్మోర్చికొమ్మా! నీదుఃఖమును మాదుఃఖమును నీకడుపులోని బిడ్డ తీర్చవలెను. ఆబిడ్డ సేమముకొఱకు నీవు దుఃఖమును దిగమ్రింగక తప్పదు.

కృష్ణు—అమ్మాయి! నీవు చిన్నదాన వైనను బుద్ధిమంతురాలవు కనుకఁ జెప్పుచున్నాఁడను. పోయినవారికొఱకు దుఃఖించుటకంటె వెట్రితనము మఱి లేదు. ఏమందువా?—

గీ. వసుధఁ జావుపుట్టు బోలెఁ దప్పనియదియును;
బ్రకృతిసిద్ధమైనదియును; బ్రాణికోటి
కెల్ల సామాన్యమై తారసిల్లు నదియు
నింకొకటి లేదు- దానికై యేల వగవ?

ద్రౌప—అయ్యో! అయ్యో!—సుభద్రకు మరల మూర్ఛ గమ్ముచున్నది!—(అని తొట్రుపాటుతో లేచి సుభద్రను బట్టుకొనును)

కృష్ణు—అమ్మాయి! అంతటితో నూరక్రొంటి వేమి?—మరల నా పరిబోధినీరసము క్రొంచెము మొగముపైఁ జల్లుము!—

ద్రౌప—(అట్లు చేయును.)

సుభ—(క్రమముగఁ దెలివిఁ గొని) హా! కుమారా, హా! జగన్మోహనాకార!

సీ. అవయవంబులుగల యాబ్జారి వడపునఁ
గనువిందు సల్పు చిన్నన్న నాఁడు
చూచినవా రెల్ల సురనాథు నంతవాఁ
డగునమ్మ నీకొడు కన్న నాఁడు
విలువిద్యలో యదువీరుల మించి నా
యన్నలచే మెప్పుఁ గన్న నాఁడు
ఉత్తర కేల్గొని యొగి బ్రహ్మ ముడితోడ
భక్తిమా నను మ్రొక్క వచ్చు నాఁడు
కటకటా! నేను బొందిన గర్వ మెల్ల
నేఁడు నిముసంబు లోపల నేలఁ గలిసె!
ఎట్లు నలువురిలోఁ దల యెత్తికొందు!
నీవు లేకుండ ద్వారక నెట్లు కందు!

కృష్ణు—చెల్లెలా! యేమి యజ్ఞాన మిది!—నీ కుమారునింగూర్చి నీ విపుడు మఱింత గర్వపడవలసి యున్నది. ఏ మందువా?—

చ. గురు నవలీల నొంచి, మదుగుం జొరఁబాఱు మదేభ మట్లు మొగ్గరమునఁ జొచ్చి, శల్య శల కర్ణ కృపాదుల తాట యొల్చి, పెక్కురథికులన్ వధించి, తనకుం బ్రతివీరుఁడు లేఁ డనం దలో దరి! విలసిల్లి నీసుతుఁడు ధన్యులఁ జేసెను మిమ్ము మమ్ములన్.

అదిగాక:—

చ. వరున, స్వరాజ్య హర్తలగు వైరుల నెత్తుట నోల లాడి, సంగరభువికిన్ శరీరమును గానుక వెట్టిన నీకుమారు స

చ్చరిత, వియచ్చరాంగనలు చాకవిపంచిక లూని జాహ్నవీ
పరిసర పుష్పవాటికలఁ బాడుచు నుందురు చూచి నిచ్చలున్.

అర్జు—(యుధిష్ఠిరునితో) అన్నగారు! నకుల సహదేవ విరాటాదుల కింకను స్తంభనాస్త్రమువలని మైకము వీడలే దనికదా యంటిరి?

యుధి—చంద్రోదయ మగునటికిఁ గాని వీడ దని వైద్యులు చెప్పిరి.

అర్జు—అట్లయిన మన కిచ్చట నీయాలస్య మెందులకు?- (ద్వారము వంకఁ జూచి) భద్రా! మేము బయలు దేరవచ్చునా?

తెరలో—స్వామీ! దేవర యాజ్ఞమై తడవుగాఁ గరదీపికలు సిద్ధము సేయఁబడినవి; గజతురగాదుల కళేబరములను దొలంగించి మార్గము సరిచేయఁబడినది! ద్వైపాయన హ్రదముకడకు బండ్లతో ఘృత చందనాదులు పంపఁబడినవి.

అర్జు—(చివాలున లేచి) అబ్బాయి! తమ్మునికడకు దారి చూపుము.

ఘటో—దయచేయుఁడు—(అని ముందు నడచును.)

(అందఱు బయటికి వచ్చి దీపికా పురస్సరముగఁ బరిక్రమింతురు.)

* * * *

భీము—అబ్బాయి! అఱవఱలైన యీ యరదంబుల గుట్టలును—ఖండఖండంబులైన యీ నరకళేబరంబుల మిట్టలును—అట్టలయిన యీ యశ్వంబుల తిట్టలును—ఇంత యేల?—యీవిలయచిహ్నము లన్నియు నేఁటి వేనా?

ఘటో—అయ్యో! యిచ్చట నేమున్నది!—తమ్ముఁడు నేఁ డొనర్చిన మారణకర్మ చూడవలె నన్న నవ్వలిదెసకుఁ బోవలెను!

అందఱు—(నిట్టూర్పులు పుచ్చుచు నడతురు.)

* * * *

ఘటో—మీ రిచ్చటఁ గొంచెము తొందరగా నడువవలెను. ఏమా?

సీ. నెత్తుటఁ జొత్తిల్లి యొత్తుగ మత్తిల్లి
యట్టిటు నేలఁ బొర్లాడు వారు

కాలు సేతులు తెగి యాలు బిడ్డలమీఁది
బుద్ధి నిట్టూర్పులు పుచ్చువారు
రక్తపంకిలమైన రణభూమిఁ జల్లఁగి
ల్లిన బాహువులఁ గౌఁగలించువారు
కరికళేబరముల యిఱుకునఁ గూలి రొ
మ్ములు పటపట లాడ మూల్గువారు
దప్పిచే నెండి నాలుక దొప్ప గాఁగ
దమిని దమరక్తమే పట్టి త్రావువారు;
మిపుల బీభత్సమై యిట్లు మిత్తి వంట
యింటవలె నున్న దీప్రాంత మేమి చెప్ప

(అందఱుఁ గొంచెము వడిగా నడతురు.)

* * * *

ఘటో—తండ్రులారా! యిచ్చటి రథ గజ తురగ పదాతులయందు గ్రుచ్చుకొనిన బాణములు గ్రుచ్చుకొనినట్లే యుండి. యీప్రదేశమంతయు నమ్ములచేనుగాఁ దోఁపించుచున్నది చూచితివా!

కృష్ణ—అంతేకాదు—ప్రతిబాణమునందును బాబు నామాక్షరములతని కీర్తిచంద్రికలవలె జిలజిల మెఱయుచున్నవి!

అర్జు—(శోకముతో) హా! తండ్రీ! హా! లోకైకవీరా!

చ. కరమున దండపాశములు గ్రాలుట లేదు! త్రిశూల మేనియుం
బరఁగుట లేదు! చక్రమును బట్టినవాఁడవు గావు! వజ్రముం
బరశువు నైన లేవు! కడుబల్లిదులౌ పలుకాండ్రనెట్టులిం
దఱఁ బడఁగూల్పఁ జాలితివొ దైవ మెఱుఁగవలెం గుమారకా!

ఆ. వె. సవ్యసాచి యనెడు సంజ్ఞ మాత్రమె కాని
బుట్టి నేర్పెఱుంగ నిప్పటికిని!
కాంచి తెట్టు లింత కరలాఘవము నీవు
చిన్న వయసు నాఁడె! కన్నతండ్రి!

యుధి—తమ్ముఁడా ! యీమాట నీ వన నక్కఱ లేదు—నీవిరోధి యగు కర్ణుఁడే యన్నవాఁడు—

" చ. కనుఁగొనినాఁడ భార్గవు నఖండతరంబగు లక్ష్యశుద్ధి ; నా
కనుభవవేద్యమే నగుని యద్భుత సాయక కర్కశత్వ ; మ
తనికడ వారికిఁ యశము దక్కదు ! చేతికిఁ గన్నులున్నవా
యనఁ భ్రమఁ గొల్పు లక్ష్యమున ; నాయములంటు శరంబు రువ్వినన్

అని యతఁడును ద్రోణునితో ననుచుండఁగా నేను స్వయముగా విన్నాఁడను.

భీము—హా కుమారా ! మేము నీవియోగమునకు దుఃఖమె పడమా !—నీపరాక్రమమునకు గర్వమె పడమా !

గీ. మాగదలు, మాశరాసన మార్గణములు
కాల్పవే నీదుముందటఁ ! గదనభూమి
మదపుటేనుఁగు జొచ్చిన మడుగుఁ బోలెఁ
జలుపఁ గంటిమె యిటు లొకసారి యేని !

ఘటో—తాళుఁడు, తాళుఁడు !—తమ్మునిచుట్టు నున్న శవములం దొలఁగింపఁ బోయినపరిచారకులు కాఁబోలు నేమో యనుచున్నారు!

అందఱు—(ఆపాటున నిలిచి యాలకింతురు.)

తెరలో—అయ్యా ! శీఘ్రముగా రండు !—శీఘ్రముగా రండు !—బాబుగారి కింకను నూపిరి యున్నట్లున్నది !

అర్జు—ఏమీ ! అంతపుణ్యమా !—బావా ! బావా ! రమ్ము రమ్ము !
(అని కృష్ణసహితముగా నిష్క్రమించును.)

యుధి—భగవంతుఁడా ! యెంత చల్లనిమాట వినిపించితివి !—రండు వడిగా రండు (అని భీముఁడుతక్క దక్కినవారితో నిష్క్రమిం.)

భీము—(నిట్టూర్పుతో) ఆపరిచారకుల వెఱ్ఱికిని పిచ్చికిని నరిపోయినది ! యెక్కడి యూపిరి !—యెక్కడి శోకము ! ఈ యాశాభంగము వీరని మఱింత కుంగఁదీయును ! మిన్న విఱిగి మీఁద బడినను జలింపని నాహృదయ మిప్పటికే చాల వికల మయినది ;

అక్కడి కేఁగినచో వారితోపాటు నేనును శోకరసము క్రింద మూఁటి వలసినవాఁడ నగుదును! వారు శవమును దీసికొని యిటే కదా వత్తురు—అంతపర్యంతము నే నిచ్చటనే యుండెదను. (వినుట నభినయించి) తమ్ముఁ డేమో యనుచున్నట్లున్నదే ?

తెరలో—తాళుఁడు!—తాళుఁడు!—బాబు పెదవుల సందునుండి యస్ఫుటముగ నేమో వినవచ్చుచున్నది—సందడి సేయకుఁడు!

భీము—ఏమీ! అట్లయిన శాంబింకను జీవించి యున్నవాఁ డన్నమాటయే! అరరే!—వారితో వెళ్ళక యెంత వెఱ్ఱిపని చేసితిని! (అని సత్వరముగఁ గొంచెము నడచి, యంతలో నాఁగి) అదేమి! అంతలోనె మరల నంద ఱొక్కపెట్టున నాక్రందన మువక్రమించినారు! (ఆలోచించి) సరి, తెలిసినది—యేదోసంగతి తండ్రిచెవిని వేయునిమిత్త మింతవఱకు నూపిరి నాలుకకొన నంటపెట్టుకొని యుండెను. యది తీఱఁగనే వెడలిపోయి యుండును!... అక్కట కటా! సుభద్రతోపాటు దిక్కులుకూడ వాపోవుచున్నవా యేమి చెపుమా—అంత గోలగా నున్నది!...(పరికించి) అయ్యయ్యో! ఉత్తర భర్తృశవముపైఁ బడి చేయునాక్రందనమునకు మేరుధీరుడగు కృష్ణుఁడు కూడ బెంబేలుపడి ప్రతిమవలె నట్టె నిలుచున్నాఁడే!... సెబాసు పాంచాలి! సెబాసు!—ధైర్యమునకు నీకడ మేను గడ్డిపోచకును మాఱము! అత్తకోడండ్ర నిరువురను జెఱియొక చంకను నిఱికించుకొని దూరమునకుఁ గొంపోయి శవమును గర్భరథమునఁ జేర్చుట కవకాశము కలిగించితివి!... ఓహో! ఘటోత్కచునకుఁ దమ్మునిపై నెంత ప్రేమ!—పరిజనమును నివారించి రథమును దానె నిడ్చుకొని వచ్చుచున్నాఁడు!

[అంతట ఘటోత్కచుఁడు కర్ణరథము నీడ్చుకొని రాఁగాఁ గడమవారు రోదనము చేయుచుఁ బ్రవేశింతురు.]

ఉత్త—(శోకముతో) హా! ప్రాణేశ్వరా! హా జీవితేశ్వరా!

సీ. పుట్టింటి మీఁదను బుద్ధి పాఱకయుండు
 నంతగాఁ జను విచ్చి యాదరించి
పాలమల్క మోము నవ్వులకుఁ ద్రిప్పఁగ నట్టె
 గిలిగింత పెట్టి కౌఁగిటఁ గదించి
క్షణము కన్పడకున్న జగతీతలం బెల్లఁ
 దలకిందు లైనట్లు తల్లడించి
యెడఁద నాదగు నడవడియెడఁ గలమెప్పు
 దలనిద్రలోఁ గూడఁ బలువరించి
ఆఱునెలలలోన నడువ చేఁదుల ప్రేమ
గుత్త కిచ్చినట్లు గుమ్మరించి,
యేఁగి తయ్యో వాని నెదలోన స్మరియించు
కొనుచుఁ గుళ్ళి చావు మని విధించి !

కృష్ణు—బిడ్డా! నామాట వినవా? నీవివేకమునకుఁ బ్రయోజన మింక నెప్పుడు? (సుభద్ర నుద్దేశించి) అమ్మాయి! నీవె యిట్లు పొక్కి పొక్కి పొగులుచున్న నీకోడలి నెవ్వ రోదార్పఁ గలరు? మే మింక శీఘ్రముగాఁ బోవలెను;—మీ రిచ్చటనుండి మరలుఁడు.

సుభ—అయ్యో! చిన్నన్నా! నాతండ్రిని విడిచి నేను బోఁగలనా!

సీ. నవమాసములపాటు నాదుగర్భమున
 నిశ్చింతతోఁ బెఱిగిన చిన్నిమేను
రుక్మిణీ సత్యల రుచిరంపుఁ గరముల
 బంతిగా నాడిన పసిమిమేను
అతియోగ్యమైన నీ యంకతలంబును
 గద్దియగాఁ గొన్న ముద్దు మేను
పూజ్యులౌ పాండురా ట్పుత్త్రుల కనులలో
 నమృతంబుఁ గురిసిన యనుఁగు మేను
ఉత్తర కటాక్ష మాలిక లుత్తగొనెడు
భాగ్య మబ్బిన లేఁబడువంపు మేను

శివ శివా! యిట్టు లగ్గిపా ల్సేయఁ బంపి
యెట్లు జీవింతు! నీశోక మెటు భరింతు!

తెరలో—అయ్యో! అయ్యో! పెద్దదాన నగుటం జేసి వడిగా నడిచి మిమ్ములను గలిసికొనలేకపోవుచున్నాను! నావయసుమీఁది కనికరముచే నైన నొకక్షణము నిలువుఁడు!

అందఱు—(అదరిపాటుతో వెనుకకుఁ దిరిగి చూతురు.)

కృష్ణు—ఎవతెచెప్పుమా యీ వృద్ధాంగన?... అవ్వా! తొందర లేదు, తొందర లేదు,—మెల్లఁగా రమ్ము, నీకొఱకు నిలిచినారము.

వృద్ధ—(గమనాయాసముచే రోజుచు సూఁతకోలతోఁ బ్రవేశించి) మాతండ్రీ! మాతండ్రీ! యీముసలిదానిపై నెంత కనికరము చూపితివి!— (పరికించి) బాబు! నీవు శ్రీకృష్ణుఁడవు కావుగద?

కృష్ణు—అట్లు. నీ వెవ్వరిదానవు?

వృద్ధ—నేనా?—నేనా?— అయ్యో! యెవ్వరిదాన నని చెప్పుదును!—శరీరము కౌరవులది—హృదయము పాండవులది.

కృష్ణు—అట్లయినఁ గౌరవుల పోషణలో నున్నదాన వన్నమాట—

వృద్ధ—అవును మా పే—నాకొమరులు వారిపోషణలో నుండిరి.

కృష్ణు—మాతో నేమిపని గలిగి వచ్చితివి?

వృద్ధ—బాబు! మీతో నా కేమియుఁ బని లేదు. అభిమన్యుకుమారుఁడు నేఁడు చూపిన పరాక్రమము మా పిల్లవానివల్ల విని, యట్టి వీరశిరోమణిం గన్నతల్లి యెట్లుండునో యొకసారి చూచి పోవలె నని వచ్చితిని. కాని, నాయాశ వ్యర్థమైనది!—

కృష్ణు—కాలేదు—అదిగో!—ఆమెయే సుభద్ర (అని చూపును.)

వృద్ధ—(చూచి యనాదరముతో) ఏమి!—యీమె సుభద్రాదేవి యా!—బాబు! నాతో నెందులకుఁ గోడిగ మాడెదవు!— సుభద్రాదేవి కంటఁ దడిపెట్టునా!

కృష్ణు—అట్లయిన, సంగతి నీవు చివరంట వినలే దన్నమాట—

వృద్ధ—వినలేదు !— అంతయు విన్నాను. అటుగాక !— అంతమాత్రమున నాయమ్మ కన్ను చెమ్మగిల్లునా ? నిరంతరము దమకొఱకెందఱు వీరశయనముం బొందుట లేదు ? వారు మాత్రము తమకు బిడ్డలు కారా ? వారిలో నొక్కరికొఱకును నిట్టూర్పైన విడువక—యీబిడ్డకొఱకు మాత్రము వాపోవునంతటి యవివేకమునకంతటి యిల్లాలు తావొసంగునా ? ఇంతకును, స్వధర్మము నిర్వహించి కృతకృత్యుండైన కుమారునిం గూర్చి గర్వపడుటకు మాఱుగ దుఃఖపడు రాచకూంతు రెందేనిం గలదా బాబు !

కృష్ణ—దీనింబట్టి నీవు గర్భశోకముయొక్క వాడిమి యెఱుంగనిదానవని స్పష్టపడుచున్నది !—

వృద్ధ—బాబూ ! ఆలాగునా !—అట్లయిన, దయచేసి, నాసంగతి రవంత వినుము. నాకు నలుగురు కుమారులు, స్వామిఋణ విముక్తికొఱకు ముగ్గురను యుద్ధమున కనిపి, నాలవవానిని నాసంరక్షణనిమిత్తము దగ్గఱనుంచుకొంటిని. యుద్ధమునకరిగిన ముగ్గురును వీరశయనము నొందిరి. వారి మరణవార్త నేను సంతోషపూర్వకముగ నాలకించుట చూచి, యొక్కనున్న నాలవపిల్లవాఁడు—"అమ్మా! నాయన్నలు పోయినందులకు దుఃఖించుటకు మాఱుగ సంతసించుచుంటివే" యని నన్నడిగెను. "నాయనా ! నాకుమారులు వీరవృత్తిచేత స్వామిఋణము తీర్చి నన్ను వీరమాతను జేసినప్పుడు నాకు సంతోషము కాక మఱేమి" అని యుత్తరమొసఁగితిని. అంతట వాఁడు దిగ్గన లేచి, తన విల్లమ్ము లందికొని "అమ్మా ! అట్లయిన నాకుంగూడ సెలవిమ్ము—నేనును వీరధర్మమును నెఱవేర్చి నిన్ను సంతోషపెట్టెదను." అని పలికెను. అంతట నేను మంచిది పోయి రమ్మని దీవించి పంపివేసితిని—

కృష్ణ—సెబాసు ! అదిగో !—అప్పుడు నీ గొప్పతనము !—

వృద్ధ—నాకోడం డ్రిరువురుంగూడ సహగమనము చేసిరి. కాని, నాకుమాత్రమం దేమియు విశేష మగపడ లేదు.

కృష్ణ—నీకుమారులలో నిరువురకు వివాహములు కూడ నైనవేమి? కోడండ్రు మనోబలమునందు నీ కద్ది యైన వారేనా?

వృద్ధ—కాకున్న, వారిని కోడండ్రని చెప్పియే యుండను.

కృష్ణ—మేలు! ఆ కడసారపుఁ బిల్లవాఁ డేమయినాఁడు?

వృద్ధ—ఈపూఁట వచ్చి తలుపు తట్టినాఁడు యుద్ధభూమినుండి పాఱి వచ్చినాఁ డను తలంపుచేతఁ దలుపు తెఱవక "పిఱికివాని కిచ్చటఁ దావు లేదు పో" మ్మని నేను లోపలినుండియే కేక వేయఁగా "అమ్మా! నేను బెదరి రాలేదు, నీ కొక యద్భుతవృత్తాంతము వినుచుటకై వచ్చినాఁడను." అని వాఁడు ప్రత్యుత్తర మొసఁగెను. అంతటఁ దలుపు తెఱచి చూచితిని గదా—వాని కాయ మంతయు గాయములతో నిండియుండెను. కాని వెనుకభాగమున నొక్క పోటయిన లేదు సుమా! అంతట లోపలికిం దోడుకొని పోయి నేను గాయములు కడిగి కట్లు కట్టుచుండఁగా—వాఁడభిమన్యుకుమారుని వృత్తాంత మంతయుఁ బూసగ్రుచ్చినట్లు చెప్పెను. అప్పుడు నాకు సుభద్రాదేవిం జూడవలె నను కోరిక పుట్టినది. పిల్లవాఁడు నన్నింతవఱకుఁ దోడుకొని వచ్చి, ఋష్యాశ్రమం జూపి, తాను కౌరవస్కంధావారమునకుఁ జక్కఁ బోయినాఁడు—

సుభ—(తటాలునఁ గౌఁగిలించుకొని) తల్లీ! నీవు వైశ్యలక్ష్మివి కాని—సామాన్యస్త్రీవి కావు! భగవంతుఁడు నా దుఃఖోపశమనము నిమిత్తము నిన్నుఁ బంపి యుండవలెను!—

వృద్ధ—అట్లయిన, సుభద్రాదేవి నీవె యన్నమాట!—అమ్మా! సౌభాగ్య మే మనవచ్చును! వీరపత్నీత్వ వీరమాతృత్వములు రెండును నీకు సిద్ధించినవి! కాని, తల్లీ! శోకమునకుఁ జోటొసఁగి నీకీర్తిని గొంచెపఱచుకొనకుము! (ప్రక్కకుఁ జూచి) ఈమె ద్రౌపదీమహాదేవి కాదు గదా?—కాకేమి?— అదిగో ఆశిరోజములే చెప్పుచున్నవి! (చేతులు మోడ్చి) తల్లీ! యీ భరతవర్ష సామ్రాజ్య పట్టమహిషీత్వమునకు నీవె తగిన దానవు

ఏఁనను నాతల ముక్కైనో వానితల తెగునటుఁ దలఁచుదువ నని. యొకటి కాదు, రెండు కావు—పదమూఁడువర్షములనుండి వీడిన కురులతోడనే యున్న నీదీక్ష నెవ్వరు కొనియాడ కుండఁగలరు ! భరతమాత యెల్లప్పుడు నీవంటి మానవతులనే పడయుఁ గాత ! బిడ్డా ! నీవు మత్స్యరాజ తనూజాతవు కావలెను—తప్పాతప్పు !. నీవల్లు కింటఁ దడిపెట్టరాదు ! నీయదృష్టము చాలగొప్పది. నీకు మహావీరపత్నీత్వము సిద్ధించినది ! నీ కడుపులోని శిశువు మగబిడ్డయై నీకు మహావీరమాతృత్వముకూడ సిద్ధించుగాక నాకు సెలవు—

ద్రౌప—అవ్వా ! నీ వాక్యములు మాకుఁ గ్రొత్త జీవితమును ప్రసాదించినవి !—నిన్ను మేము విడువఁ జాలము—మాతో వచ్చి నీ జీవిత శేషము మాకడఁ గడపుము.

వృద్ధ—వల దమ్మా ! వలదు—మీరు మహారాజపత్నులరు. మీవంటివారి సన్నిధి నుండుటకుం దగిన యర్హత నాకు లేదు. ఇంతకును నాకుటీరమే నాకు స్వర్గము. నాజీవితశేష మందే గడపఁ దగినది.

యుధి—అవ్వా ! నీపలుకులు వీరి దుఃఖమును జాలవఱకు నివారించినవి నీ సాన్నిధ్యమువలన శేషము కూడ నివారణ కాఁగలదు. కావున, దయచేసి, వీరితో శిబిరమునకైనఁ బొమ్మా.

వృద్ధ—అయ్యా ! నీవు యుధిష్ఠిర మహారాజవు కావలయును. అట్టి యైన నీయాజ్ఞ నా కవిలంఘనీయము. ఏమన ? నీవు మాభవిష్యత్సార్వభౌముఁడవు. నడువుఁ డమ్మా నడువుఁడు—మిమ్ములను మీశిబిరములందుఁ బ్రవేశపెట్టి, నాదారిని నేను బోయెదను. (అని స్త్రీజనమును వెంటఁ గొని నిష్క్రమించును)

(అందఱుఁ బరిక్రమింతురు)

అర్జు—బావా ! యీమెమాటలు మంత్రమువలెనే మనస్సులను మార్చివేసినది—యేమి యీవింత !

కృష్ణ—అర్జునా ! స్త్రీలనగా నేమో తెలియునా ?—

గీ. సకల విషయంబులును బోధ సలుపు గ్రంథ
ములు ; మనోవ్యాధి మాన్పెడు మూలికలు ; వి
చార వారాసి దాటింపఁ జాలు నౌక,
లంగనలు:—దైవ మిడు వారి కట్టి శక్తి.

అందును మన భరతవర్షమునందు—

చ. ఎదురున మాక్తికంబు. లటవీ తరుశాఖలయం దమూల్యమా
బదనిక, లెట్టులో యటులె. పాత్రివ్రతు లందును మేరుధీరలుఁ
సదమల చిత్తలుఁ, సకల శక్తి సమేతలు నా నెలంత లో
ప్పిదముగఁ బుట్టుచుందుర్, మహి పెంపు వహించును వారిచేతనే.

తెరలో—దేవా ! ఇటు, ఇటు!—సంస్కారసామగ్రి నిదిగో యీ సమప్రదేశమున సమకూర్చినారము.

కృష్ణు—ఘటోత్కచా! నీవు రథ మాపరిజన మున్నయెడకుఁదీసికొని పొమ్ము. (యుధిష్ఠిరునితో) బావగారు! మీ రిచ్చట నిలువుఁడు. అర్జునా ! నీవు ముందు స్నానము సేయవలెను గదా !—అదిగో రేవు—రమ్ము పోవుదము. (అని యర్జునుని వెంటఁగొని నిష్క్ర-)

(యుధిష్ఠిర భీములు కూరుచుందురు.)

తెరలో—హా ! పరమేశ్వరా !

చ. పొడమి తమంతవార లగు పుత్త్రిల చేతులలోనఁ బ్రాణముల్
విడుచు నదృష్ట మేరికి లభించునొ వారె యదృష్టవంతు , లి
వ్వడువున జేతులారఁ దనపాపనిఁ గాటికిఁ దార్చి చిచ్చు వె
ట్టెడు దురవస్థ యేనికి ఘటిల్లునొ వాఁ డతిపాపి ధాత్రిలోఁ !

యుధి—(పరికించి) కటాకటా ! యెంత కష్ట ! మెంత కష్టము !

గీ. ఎవనిచేతను వంగడ మెల్లఁ బెంపు
వడయు నని యాసపడితివో వాని నట్టు
లగ్ని గొనుచుండ, నోహృదయంబ ! నీవు
కంటఁ జూచియు బ్రద్దలు కా వదేమి !

అర్జు—("పాడమి" యను పద్యమునే పఠించుచుఁ గృష్ణ ఘటోత్క-చులతోఁ బ్రవేశించి, కురు లాడ్చుకొనుచు నడయాడును.)

అందఱు—(రవంత సేపు నిశ్శబ్దముగా నుందురు.)

అర్జు—(ఆకస్మికముగ నిలిచి) అన్నట్లు, మఱచితిని!—బావా యిందాఁక, బాబు నోటినుండి వినవచ్చిన దేమో తెలిసినదా?—

కృష్ణు—అవు నవును!—అన్నట్లాసంగతి మనము చెప్పుకొననేలేదు!-ఏమి వినవచ్చినది ?

అర్జు—అంత స్పష్టముగఁ గాదు! గాని—"సైంధ-వుఁడు; సైం-ధ వుఁ-డు" అన్నట్లు మూఁడుసారులు వినవచ్చినది!

ఘటో—(చివాలున లేచి) సందేహ మక్కఱ లేదు!—తమ్మున కా దుష్టుని మీఁదనే దృష్టి యుండియుండును. నే నొకసంగతి చెప్ప మఱచితిని. దుశ్శాసనకుమారుం జంపి, రక్తపాతమువలనం గ్రమ్మ మైకముచేఁ దూలిపోవుచుఁ, జేతినుండి జారిపోయిన గదాదండము కొఱకు నెమకులాడు తమ్ముని-సైంధవహతకుఁడు చాటు నుండి కుంతమునఁ బొడిచి కూలఁ ద్రోసెనఁట!

భీము—(క్రోధముతో) ఆఁ! అట్టిస్థితిలో సైంధవుఁ డంతపని చేసెనా?

గీ. తల్లి సాన్నిధ్యముం బాసి, దారి తప్పి,
హరికిశోరము బోయల యంపపెట్ల
నసురులం బాయు తఱి, వెన్కనుండి కాలు
కఱచెనఁట కుక్క! యేమందుఁ గాల మహిమ!

అందఱు—(మరలఁ గొంచెము సేపు నిశ్శబ్దముగా నుందురు.)

అర్జు—(ఆకస్మికముగ గొంతెత్తి) ఘటోత్కచా! గాండీవము!—గాండీవము!—(అని చరచరఁ బరిక్రమించుచు.)

యుధి—బావా! బావా!—చూచుచు నూరకుంటి వేమి?—తమ్మునకు దుఃఖోన్మాదము తటస్థమయినది!

కృష్ణు—(చివాలున లేచి పోయి యడ్డుకొని) బావా! యెక్కడి కీ ప్రయాణము?—

అర్జు—(వెఱ్ఱివానివలెఁ జూచి, తప్పించుకొని. పరిక్రమించును.)

కృష్ణ—(వెనుకొని) బావా, మతి పోయినదా యేమి!—యొంటరిగా నెక్కడి కీప్రయాణము !

అర్జు—(రౌద్రముగా) ఎక్కడికా ?—కౌరవ స్కంధావారమునకు !

కృష్ణ—ఎందులకు ?—

అర్జు—రౌద్రముతో) ఎందులకా !—ఏమీ ?—ఎందులకా !—

ఉ. ఎవ్వఁడు మత్తనూభవుని, వెంతయు డస్సిన వాని, నొంటరిన్,
మవ్వపు మేను తూఁట్లువడ మత్తిలి నెత్తుట దోఁగ నత్తఱిం
గ్రొవ్వున మాటున న్నిలిచి కుంతమునం బొడువంగఁ జాలెనో
యవ్వెడఁగుం జడుం ఖలు దురాత్ము జయద్రథు హూపుమాపఁగన్!

(అని పట్టు విడిపించుకొని పరిక్రమించును.)

కృష్ణ—(మరలఁ బట్టుకొని) బావా ! బావా !—ఒక్కమాట—

అర్జు—(వారించుచు) వినను ! నీమాటమాత్ర మింక వినను!- విని యిదివఱకుఁ బొందిన మోసము చాలును !

కృష్ణ—బావా ! నీవు నావలన నేమి మోసము పొందితివి? —

అర్జు—చెప్పు మనెదవా ? —

గీ. ప్రబల కోలాహలము వినఁబడిన యపుడుఁ,
బరిసరములఁ బుచ్చెలు వచ్చి పడిన యపుడు,
నుల్కిపడుచు నిదే మన—నుఱక యేలఁ
గలఁగఁబాఱెద వని నన్నుఁ గసరికొనవె ?

కృష్ణ—శివశివా ? నే నపుడు వారించినది నిన్ను మోసపుచ్చుట కేనా! బావా ! అభిమన్యుఁడు నీకుఁ గొడుకె కాని—నాకు మేనల్లుఁడు కాఁడా?

అర్జు—సరి పోనిమ్ము—ఇప్పు డావిచార మవసరము లేదు—నన్ను మాత్రము పోనిమ్ము! (అని విడిపించుకొని పరిక్రమించును)

కృష్ణ—(వెంబడించుచు యుధిష్ఠిరు నుద్దేశించి) బావగారు!—మీరు రాక తప్పదు !—మీతమ్ముఁడు నాకు నిలుచునట్లు లేదు !

యుధి—(తొట్రుపాటుతో లేచి పోయి, అర్జును నడ్డుకొని) తమ్ముఁడా

గీ. ఎన్నఁడును నీవు నామాట కెదురు చెప్పి
యెఱుఁగ వాపెత్తనమె నిల్పు మిపుడుఁ గూడ ;
శాత్రవులు నిద్రఁ గొనుతఱి పాపడుతఱి
సమరమున కెత్తిచనుట యక్రమము కాదె!

అర్జు—(విసుగుతో) ఇస్—అబ్బా !...అన్నయ్యగారు! మొదటనుండియు మీరిట్లే వారి కాయువు పోయుచున్నారు! సరి కానిండు—(ఆకసమువంకఁ జూచుచు) ఓ కౌరవ గూఢచారులారా ! మీరు శీఘ్రముగాఁబోయి నా యీ ప్రతిజ్ఞ మీరాజునకు వినిపింపుఁడు!-

చ. సకల సురాసురప్రతతి సాయము వచ్చినఁ, బంకజోదరాం
ధకరిపు లడ్డు చొచ్చినఁ, బితామహుఁ డెచ్చిన, నెల్లిపొద్దు గ్రుం
కకమును సైంధవాపశదు కంఠముఁ ద్రుంచెదఁ- దప్పెనేని, త
ప్పక నృపులెల్లఁ జూడఁ జొరఁబాఱెదఁ జిచ్చున గాండివంబుతోఁ!

కృష్ణ—ఈదుస్సలాధవుని వధించుటకు నీవిదివఱకే శపథము సలిపితివి కాని-యిప్పు డందులకు మితిపెట్టి మాకు భయమును గల్పించిన వాఁడ వైతివి. మనమిఁక నిచ్చటఁ దడియరాదు. పోయి తత్సంగతి యాలోచింతము రమ్ము.

అర్జు—బావా ! యేల భయపడెదవు ?-

గీ. పట్టునది గాండీవము ; పాశుపతము మొదలు
గాఁగలవి యస్త్రములు ; తేరు గడపువాఁడు
చక్రి ; సంగ్రామకర్తయీ సవ్యసాచి;
యెవ్వరీ రేడు జగముల నెదురు వారు!

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

విష్కంభము:

[సంజయ వైశంపాయనులు ప్రవేశింతురు]

వైశం—తదనంతరము వాహినీపతు లెల్లరు ధర్మజుచే ననుజ్ఞాతులై పోయి తమతమ బలంబులు రావించిరి. కృష్ణుఁడు రథ మాయితంబు చేయించి తెచ్చి మొగసాల నిలిపె. అర్జునుఁడు సాత్యకి భీమసేన ద్రుపదసూనుల నొక్కరొక్కరిని యవ్వలకుం దోడుకొని పోయి యుధిష్ఠిర రక్షణమునుగూర్చి నొక్కినొక్కి చెప్పెను.

సంజ—అదిగో, అదియే ధర్మరాజునకుం గల యఖండభాగ్యము!

క. తనయెడల ననయముం గడు
వినయము, గౌరవము, కూర్మి, వేర్మియు వెలయం
దనసేమమె పలవించెడు
ననుజులుగల యన్నభాగ్య మలవియె పొగడన్!

పిమ్మట ?

వైశం—పిమ్మట, సమస్తబలంబులు సంగరభూమి నఱుకఁ దహతహపడుచుండ, రణతూర్యంబులు దిక్కులం బ్రతిధ్వనించుచుండ, విప్రనికరంబు లాశీర్వాదంబులతో నక్షతలు గురియుచుండ, వందిమాగధులు కులగౌరవముం గొనియాడుచుండఁ, గృష్ణుండు తేరినొగ యలంకరించి "ప్రొద్దెక్కెడు"నమ్మని త్వరపెట్టుచుండ- దివ్యమణులచే దీపించు కిరీటంబుతోఁ; గనులకు మిఱుమిట్లు గొలుపు కత్తళంబుతో; నాలుకలు గ్రోయు నంపమొత్తంబుల యక్షయ తూణీరంబులతో; నప్పుడ యర్చించిన గంధపుఁ జుక్కలు గల గాండీవంబుతో; నిజప్రతిజ్ఞా నిర్వాహణదీక్షా సముచిత సమరోత్సాహ సంభరితంబగు వదనారవిందంబుతో సవ్యసాచి యుధిష్ఠిరునకుఁ బ్రదక్షిణపూర్వకంబుగ నమస్కరించి, యనుజ్ఞవడసి, రథారోహణం బొనర్చె. కాంచన ఘంటికా రవంబులతోఁ, గపిధ్వజప్రభలతోఁ దేరు కదలుచుండ నేను జక్కవచ్చితిని. ఇఁక నిక్కడి వృత్తాంతము నీవు చెప్పవలెను.

సం॥— ఇక్కడివృత్తాంత మెంతని చెప్పుదును! పార్థుని ప్రతిజ్ఞ విని భయవిహ్వలుఁడైన సైంధవుని కూరటగా— ఆచార్యులవారు రాత్రి చెప్పినదానికంటె నేఁడు చేసిన సన్నాహము వేయిమడుంగు లధికముగానున్నది! ఇరువదినాలుగుక్రోశముల పొడవును బదిక్రోశముల వెడల్పును గలప్రదేశమున శకటవ్యూహమును నిర్మించి, దానిపశ్చిమార్ధభాగంబున గర్భవ్యూహముగాఁ బద్మవ్యూహమును రచించెను. తన్మధ్యంబునుండి శకటవ్యూహద్వారంబు దెసకు సూచీవ్యూహంబు పన్ని, తన్ముఖంబున భోజసేనా సమన్వితుండగు కృతవర్మను; దన్మధ్యంబున నిజసేనాపరివృతుఁడగు కాంభోజరాజును; దన్మూలంబున నాప్తులగు శతసహస్ర యోధులతోడి కురురాజును నిలిపెను. దానివెనుకఁ, బదునాలుగువేల దంతావళంబులతోడను, నిరువదివేల రథంబులతోడను, జక్రవ్యూహమును నిర్మించి. దాని వెలుపలిభాగంబున నెన్నికగన్న లక్ష యాశ్వికులను, లోపలిభాగమున మెచ్చువచ్చిన పదిలక్షల పదాతులను, నిలిపి-తన్మధ్యమునఁ గర్ణశకుని శల శల్య భూరిశ్రవ సోమదత్త కృపాచార్య దుశ్శాసను లంగరక్షకులుగా సైంధవుం బ్రతిష్ఠించెను.

వైశం— అట్లయినఁ బాండవుల కిది చాల గడ్డుదినమని చెప్పకతప్పదు! సరికాని-మనము వ్యూహ మంతయు నెక్కడనుండి చూడనేర్తుము?

సం— ఇవిగో దూరదర్శికలు. నిన్నటి తమాలవృక్షము మీఁదనే కూరుచుండి, వీనిసాయమున సర్వమును జూడఁగలము. దీనిని నీవు గైకొనుము. (అని యొకయంత్రి మొసఁగును.)

వైశం— (యంత్రముగుండ ముందునకుఁ జూచుచు) ఓహో ప్రతి పదార్థ మెంత విస్పష్టముగా నగపడుచున్నది! అడుగో! దుర్యోధనుఁ డెందులకో గాని-యతివేగముగ నాచార్యుఁ డున్న దెసకు వచ్చుచున్నాఁడు. రమ్ము, రమ్ము, మన మేగి వృక్షారోహణ మొనర్తము. (ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది శుద్ధవిష్కంభము.

పద్మవ్యూహము.

షష్ఠాంకము.

రంగము :— వ్యూహమండలము.

వ్యూహముఖమునఁ బాదచారులై ద్రోణ దుర్యోధనులును; దూరమునఁ జెట్టుపైఁ గూరుచుండి సంజయ వైశంపాయనులును బ్రవేశింతురు.

ద్రోణు:— మహారాజా! వ్యూహ మంతయు విలోకించితివి కదా- యెట్లున్నది?

దుర్యో:— జగజ్జేగీయమానముగా నున్నది, నేఁడు మీధనుర్వేదవైదుష్యమును గొనియాడనివారు లేరు. ఇంతటితో నిశ్చయముగ నాకు జయము సిద్ధించునని యున్నది కాని—యొకసందియము మాత్రము కొంచెము బాధించుచున్నది.

ద్రోణు:— ఏ మాసందియము?

దుర్యో:— మఱేమియు లేదు. అర్జునునిపై మీకు వాత్సల్యము మెండని వాడుక. అతని మొగము చూడఁగనే మనసు కరఁగి దారియొసఁగుదు రేమో యని నాసందియము.

ద్రోణు:— (తనలో) ఇతఁడు వట్టి కృతఘ్నుఁడు!

చ. పనిఁగొని తాఁటిచెట్టున కవారిగ నీరము వోయుటల్; శవం
బున కకలంక రత్నమయ భూషలచేఁ గయిసేయుటల్; పొలం
బున దయివాఱునట్టి వెఱబొమ్మకు ఛత్రము వట్టుటల్; కృత
ఘ్నునకు హితంబొనర్చుటలునుం గడువ్యర్థపుఁ గృత్యముల్ గదా!

(పైకి) మహారాజా! యీ సందియము నీకె కలిగినదా—లేక నీ యాంతరంగికమంత్రి యగు శకుని కలిగించినదా?

దుర్యో:— ఎట్లయిన నేమి?—మీ రిప్పుడు చేయవలసినది తన్నివారణము గాని-తద్విచారము కాదు.

ద్రోణు—అట్లయిన నందులకు సాధనముకూడ నీవే చెప్పవలయును.

దుర్యో—చెప్పుటకే వచ్చితిని. కాని, మీ రన్యథా భావింప నని మాట యిచ్చినఁ గాని చెప్పుటకు సందేహముగా నున్నది.

ద్రోణు—మహారాజా! అట్టి సందియ మెన్నఁడును వలదు. నీ కొక యనుమానము కలిగినప్పుడు దానిని నిర్వర్తించుకొనుట నీపని-నిర్వర్తించుట మాపని. కాకున్న నుభయులకును సుఖము లేదు.

దుర్యో—అట్లయిన నిదిగో విన్నవించెదను: మీ స్థాన మంగరాజున కొసఁగి మీరు సైంధవునికడకు వచ్చిన నాకుఁ దృప్తిగా నుండును.

ద్రోణు—ఇంతియేకద!—అట్లే చేయవచ్చును. అంగరాజు వ్యూహముఖమున నుండి కార్యము నిర్వహింపఁగలఁ డను నమ్మకము నీకుఁ బూర్తిగఁ గలదు కద?

దుర్యో—అతనిసామర్థ్యము నెడ నాకుఁ బూర్ణమైన విశ్వాసము కలదు. నాకే కాదు—పరీక్షకొఱకైన నిపుడీయువకాళి నొసఁగి చూచితి రేని మీకును గలుగఁ గలదు.

ద్రోణు—నీ కట్టినమ్మక మున్నప్పుడు నీయిష్టానుసారముగా జరిగించుటయే నా పని. నే నచటికిం జని యతనిం బంపెదను: అంతపర్యంత మిచ్చట నీ వుండుము. (అని కొంచెము నడచి తనలో) ఈతనికి వినాశకాలము సమీపించినది! కాకున్న నీతరుణమున నిట్టి విపరీతబుద్ధి పుట్టదు!

ఆ. వె. తిన్నఁగా నదృష్ట మున్నప్పు డన్నిట
బుద్ధి తిన్నఁగానె పోవుచుండు;
నయ్యదృష్ట మించు కంత వక్రించిన
బుద్ధి వక్రితతముఁ బొంది నడచు! (నిష్క్రమించును)

దుర్యో—(వినుట నభినయించి) ఏమి ఘోరారావము! (నిదానించి)

గీ. మొదటఁ దుమ్మెట రొద వోలెఁ, బిదప వాయు
సంక్షుభిత వారినిధి ఘోష సరణి, నవలఁ

బ్రలయమేఘ గర్జన మట్లు ప్రబలు నద్ది
గాండివ జ్యానినాదముగాఁ దలంతు.

(పరికించి) సరి, యిఁక నేమి-అదిగో ! కపిధ్వజము. (వెనుకకుఁ దిరిగి చూచి) ఇదుగో! కాలపృష్ఠము మ్రోయించుచుఁ గర్ణుఁడును వృషసేనునితో సేనాముఖమునకు వచ్చుచున్నాఁడు. అతనిం గలిసికొని హెచ్చరించి స్వస్థానమునకు నేఁ జనియెద. (అని నిష్క్ర-)

(అంతట రథస్థులై కృష్ణార్జునులు ప్రవేశింతురు.)

అర్జు—(ముందునకుఁ జూచి) బావా ! యేమిది ?-సేనాముఖమునం దాచార్యులవారికి బదులుగా నంగరా జగపడుచున్నాఁడు !

కృష్ణ—నేను నదే చూచుచున్నాఁడను. ఇందుల కేదియో విశేష కారణ ముండవలెను.

అర్జు—కారణ మేమయినను సరియె కాని—యిందువలన నాచార్యులవారును నేనును గూడ ధన్యుల మగుదుము. ఏ మందువా?—

గీ. శిష్యవాత్సల్యమునఁ జేసి చేసె ద్రోహ
మవనిపతి కనునింద నాయనకుఁ దప్పు ;
దయను నాచార్యుఁ డొక్కింత దారి యొసఁగ
దాఁటె ననుమాట నాకును దప్పిపోవు.

కృష్ణ—(తనలో) ఇతనికిఁ బురియెక్కించుట కిదే మంచిసమయము:
(పయికి) ఏమీ !—ఆ చిచ్చఱపిడుగుం గడచి యిప్పుడే మొగ్గరమునఁ బ్రవేశించినట్లు మాటాడుచుంటివే !

చ. పరబల వార్థి శోషణుఁడు, పవిత్రపరాక్రమ సంగతుండు, సంగరనిగమార్థ కోవిదుఁడు, కర్కశుఁడు, దరుణసమాన తేజుఁ, డక్కురుపతి నమ్మికొన్న రథికుం, డలకర్ణుఁ డతండు గాన మొగ్గరమునఁ గాలు పెట్ట శితికంఠున కేని వశంబె యర్జునా !

అర్జు—బావా ! యీమాటలు నీవు * స్థూణానిఖనన్యాయముగా—ననుచుంటివో— లేక, మనఃపూర్వకముగానే యనుచుంటివో యెఱుఁగను గాని—మనలో మనము గనుక చెప్పుచుంటిని—

* స్తంభము పాఁత బిగిసినదో లేదో యని యూఁపి చూచినట్లు,

చ. కరమున గాండివంబు గలుగన్, నొగపైన సమస్తమంగళా
కరుఁడవు నీవు గల్గ నొకకర్ణుని గాదిటువంటికర్ణులన్
వరుసగఁ గౌరవేశ్వరుఁడు వందలు వేలును దెచ్చెఁగాక - నేఁ
దరసెద లెమ్ము—నీ మఱఁది యాహవపాలవమెల్లఁ గేశవా !

కృష్ణు—మంచిది. కుడువఁ బోవుచుఁ గూరాకు రుచి యడుగనేల ?-
రవంత సేపటి కన్నియుఁ దేలఁ గలవు. (ముందునకుఁ జూచి)
అదిగో ! అతని యాత్రము చూచితివా ?—వ్యూహ ముఖము
విడిచి నీకొఱ కెదురు వచ్చుచున్నాఁడు !

కర్ణు—(రథస్థుఁడై ప్రవేశించి) అవురా ! యీశ్వరవిలాసము !

చ. ఒకజనయిత్రిగర్భమున నుద్భవ మందినవార మయ్యు ని
ట్లొకరిని బోరుచుం దొకర ముక్కడఁగింపఁ దలంతు మన్యుల
ల్లకట ! నరుండు నేను ననయంబు, మదిన్ లవమేని ప్రేమ తా
ల్పక, యిదియెల్ల నీశ్వరవిలాసము కాక మఱేమి యారయన్ !

సీ. కాల కేయాది రాక్షస యోధనాథులఁ
బట్టి మట్టాడిన బాహుశాలి
యొక్కటిపోరున ముక్కంటి నుక్కునఁ
దలపడి యోర్చిన ధైర్యశాలి
కడుబలాన్వితుఁడైన గంధర్వభర్తను
గెలిచి మెప్పందిన కీర్తిశాలి
దివమును దర్శించి దివిజేశుచేత నా
తిథ్యముం గొన్న యదృష్టశాలి
అట్టి యితనిచేత ననిశంబుఁ బరిచర్య
లందుకొఱకు ధర్మనందనుండు
సలిపినట్టి పుణ్యసంచయ మేమొ ! నేఁ
జలుపనట్టి దేమొ తెలియ దార !

కృష్ణు—(రథమును సమీపింపఁ జేసి చిఱునగవుతో) అంగరా జీపూఁ
టఁ బెద్దపనికి సిద్ధపడిన ట్లున్నాఁడు !

కర్ణు——(రోషముతో) సర్వజ్ఞుఁడవు ! నీయూహ పొరపా టెట్లగును ?

క. పాండవ సైన్యంబున మీ
గాండివి మొనగాఁడు గానఁ, గౌరవసేనన్
దండిమొనగాఁడ నని యధి
పుం డతనిం బాఁక నన్నుఁ బుచ్చె నిచటికిన్.

అర్జు——తప్పు తప్పు !——పాండవసైన్యమునందు నన్ను మించిన మొనగాండ్రు వేనవే లున్నారు. కౌరవసేనయందు నిన్ను మించినవారును నసంఖ్యాకు లున్నారు.

కర్ణు——ఉండవచ్చును. నే నిది వారిని గొంచెపఱుచుట కన్న మాట కాదు. పోనిమ్ము——నీతోఁ బోరాడవలె నను నభిలాష విశేషముగాఁ గలవాఁడను నే నగుటంజేసి, యందుల కీపూఁటఁ బ్రధమావకాశము నా కొసఁగఁబడినది——సరియేనా ?

అర్జు——నాతోడిపోరాటము నీకు గౌరవదాయకమె కాని-నాకు మూరున కోడి పఱచిన నీతోడి పోరాటము నాకు మాత్రము లజ్జాకరము !

తెరలో——ఔరా ప్రల్లదములు! అట్లయిన నో కుంతీమాధ్యముఁడా !

ఉ. నీ రణకౌశలోన్నతియు, నీ భుజశక్తియు, నీదు తెల్వియున్
నీ రుచిరాస్త్రసంపదయు, నీదగు ధైర్యసమృద్ధియుం, గనం
గోరుచు నీనిమిత్త మిదిగో చనుదెంచినవాఁడ- నిక్కమా
శూరుఁడ వేని నన్గదిసి చూపుము నీదుప్రతాప మెట్టిదో.

అర్జు——(ముందునకుఁ జూచుచు) ఏమి ? వృషసేనుఁడు వాక్పారుష్యమునందుఁ దండ్రిని మించినవాఁ డయినాఁడే ! ఓవీరపోతమా ! ముందు నీతండ్రిం గడతేర్చితి నేని-పాపము!- నిన్ను దిక్కులేనివానిం జేసి చంపువాఁడ నగుదును. కావున-

ఉ. దాపున నేను లేనితఱిఁ దర్దయు డస్సినవాని మత్సుతుం
జాపమునాక వంచనము ప్రోపుగ నిజనకాదు లేకమై
రూపడఁగించి ; రే నిపుడు రూఢిగ నీతలఁ ద్రుంతుఁ దండ్రి నీ
దాపున నుండఁగానె, రణధర్మ మొకింతయుఁ దప్పకుండఁగాన్.

బావా! రథము ముందఱ నిమీఁదికిఁ బోనిమ్ము (నిష్క్రమింప)
కర్ణ——(క్రోధముతో) సూతుఁడా ! చూచుచు నూరకుంటి వేమి ?

గీ. ఏను దాపున నుండ మత్పుత్త్రుఁ దాఁకి
వాని సిగపూవు నేనియు వాడఁ జేయ
నగునె నరునకు గా దల హరుఁన కేని !
వడిగ మన తేరు నచటికే నడువనిమ్ము. (నిష్క్రమించును)

సంజ——ఔరా ! పార్థుని పరాక్రమము !

చ. కొడుకును దండ్రియుం గలిసి గుప్పశరావళియెల్ల నిట్లు ప
ప్పొడిగ నొనర్చుచు, న్విషము ప్రాసినయట్లులఁ గప్పువారలన్ !

వైశం——ఇప్పుడు చూ డిప్పుడు చూడు !

సిడిముడి పెంపు నొంద వృషసేనుఁడు కెర్పువ నార్చి, పేర్చి. క
వ్వడిపయిఁ, దేరిపై, హయములపై, హరిపై, శరవృష్టి నించెనన్ !

సంజ——ఇంతలోనె యీయంధకార మేమిటి !

వైశం——ఇది సవ్యసాచి ప్రయోగించిన తమిస్రాస్త్ర ప్రభావము. అదిగో ! కర్ణుని వైపునుండి జ్యోతిర్బాణ మొకటి బయలువెడలి చీఁకటిని గబళించుచున్నది...అరెరే ! అదేమి !

గీ. శిరము లేనిది యై వృషసేను మేను
తనరుచున్నది యతని రథంబుమీఁదఁ !
గరము లెప్పటియట్లనె కవ్వడిపయి
గురుతు తప్పక శరవృష్టి గురియుచుండ !

సంజ——పాపము ! కర్ణునివంకఁ జూచితివా ?——తన మ్రోల వచ్చిపడిన తనయుని మూర్ధ మవలోకించి—కన్నులం గ్రమ్ము నశ్రుకణమ్ముల నద్దుకొని,——దెబ్బవడిన బెబ్బులిచందమునఁ గ్రోధావేశ పరవశుఁడై పార్థునితోఁ దలపడుచున్నాఁడు !

వైశం——తలపడుటయె కాదు——

గీ. భవుని ముష్టిఘాతంబు సంవాహనముగఁ,
గాలకేయాస్త్ర వితతులు పూఁసరులు

గా, గ్రహించిన పార్థు సత్తుఁబు నేఁడు
కర్ణుఁ డడె రక్తసిక్తముగా నొసర్చె !

సంజ—అందువలనఁ గ్రుద్ధుఁడై యర్జునుఁడు చేసినపని చూచితివా ?

గీ. వింటినారిని దెగ నేసి, వసనతుండు
గుణము వెండియు సవరించుకొనెడులోన
నాసపట్టిన యొక శాతసాయకమున
సారథి శిరంబు ద్రుంచె దోస్సార మొప్ప.

వైశం—అంతమాత్రమున నైన దేమియు లేదు లెమ్ము.

గీ. బాహువులు కార్ముకము వంచి భయదలీల
గుణము మ్రోయించి శరములు గురియుచుండఁ ;
గాళ్ళ కళ్ళియమును వ్రేళ్ళఁ గదియఁ బట్టి
కడుఁ జమత్కృతి హరులను గడపుచుండె.

సంజ—అవును గాని-అంగరాజునకు మానభంగమును. గురురాజున కాశాభంగమును నొక్కసారిగ వాటిల్లినవి !

గీ. నరుఁడు కళ్ళియ మొకకోల నఱికివైచి
ఘోలముల వాలుటమ్ములు గీలుకొలుప
వాఁడువమ్ములు వడి నంగపతి శతాంగ
మీడ్చికొని పోవుచున్నవి యెటకొ కనుము !

వైశం—అయ్యో ! యింకే మున్నది !—

గీ. తురగములు త్రుళ్ళిపడి హద్దు తొలఁగి పాఱఁ
గరులు శివ మెత్తినట్టులు కలఁగఁబాఱ
దేవదత్తము పూరించి తెగువ రిపులఁ
గసిమసంగుచు నరుఁడు మొగ్గరము సొచ్చె !

సంజ—అంతియే కాదు—పాండవయోధులు సింహనాదంబులు సేయుచుఁ దమతమబలంబులతో వ్యూహముఖమును సమీపించినారు. (పరికించి) కాని, యకాలవర్షమువలె నింతలోనె వారిపైఁ గురియు నాశరవృష్టి యెక్కడినుండి చెప్పుమా ! (మరలఁ బరికించి) సరి,

యింక నేమి!—యెట్లు తెలిసినదో కాని- యదుగో! భారద్వాజుల వారు వచ్చి వ్యూహముఖమున నిలిచి భల్లపరంపరలచే భూనభంబులం గప్పుచున్నారు! అర్జునుండు కానరాం డేమి చెప్పుమా!

వైశం—కానరా కేమి?—కృతవర్మను హతవర్మను గావించి, శ్రుతాయువును గతాయువుం జేసి, కేకయవంశమును గూటికటి వేళ్లతోం బెల్లగించి, వసాతిని రసాతలంబున కనిపి, దీర్ఘాయువును దీర్ఘనిద్రం బుచ్చి, కార్పాసరాశిం బడ్డ యగ్నికణంబు చందంబున సకలసైన్యములం గాల్చుచుం బోయి పోయి యదుగో! యిప్పుడు కాంభోజ సైన్యాటవీ మధ్యమునం గార్చిచ్చుమచ్చున విరాజిల్లుచున్నాండు.

సంజ—(చూచి) అవు నవును. అచ్చటనున్న యాఱువేల రథంబులు వితథంబులు గావించి, దుర్యోధనుని మనోరథంబుతోం గూడం గాంభోజరాజు కాంచనరథంబు భగ్నం బొనర్చి, పోయి యిపుడు యవనసైన్యార్ణవరాశిం బ్రవేశించుచున్నాండు.

వైశం—సవ్యసాచి రెండు చేతుల కిపుడు సంపూర్ణముగాం బని కలుగును.

ఆ. వె. నిడుదగడ్డములును నిట్టనొసళ్లును
రాగివెంట్రుకలును రగులు కనులుం
గలిగి వానరములగతి నొప్పు యవన పా
రద శకాదు లదిగొ! పొదివి రతని.

సంజ—అమితులదం డతనిం జాలసేపు నిలువరింపం గలిగినది కాని—శల్య మాంస మస్తిష్క రాసులతో నిండి యారణరంగ మెంతలో నెంత బీభత్సముగా మాఱినదో చూచితివా?

వైశం—వెఱ్ఱివాండా! వాసుదేవానిల ప్రేరితుండగు విజయహుతాశనుండు ప్రవేశించినంతవఱ కెచ్చట బీభత్సముగా లేదు! ఎదుర్కొనిన వారి ప్రాణంబులు బాణనాళంబులం బీల్చివేయుచుం బోయి, యిప్పుడు కౌరవేశ్వరుని కక్ష్యలోం బ్రవేశించుచున్నాండు చూడుము

సంజ—పాపము! దుర్మర్షణుండు ప్రథమకబళ మైనాండు! ఛీ! దుశ్శాసనుండు సింహమువలెం దాంక గ్రామసింహమువలెం బలాయితుం

డగుచున్నాఁడు! కాని, కురుపతి తమ్ముంగల సోదరులతోఁ దలపడి యర్జును నరికట్ట, నచ్చటిశతసహస్రయోధులు నొక్కసారిగ ముసల ముద్గర పరశు పట్టిసాద్యాయుధంబులం గురిసి కిరీటియరదమును నీరదచ్ఛన్నమగు మార్తాండ మండలముం గావించిరి.

వైశం—కాని, యేమిలాభము!—రథ గజ తురగములు తెగి గుట్టలు పడుచున్నవి; యోధుల మస్తకములు మింట బంతులవలె నాడుచున్నవి. సరి, యింకనే మున్నది! వికలీకృత కోదండుఁడై, విచ్ఛిన్న తనుత్రాణుఁడై దుర్యోధనుఁడు తేరు డిగ్గి పఱచుచుండ, నెక్కడివా రక్కడినుండియె దిక్కామొగము లగుచున్నారు!

సంజ—సుయోధనున కిప్పుడు లోహకంచుకమే కాదు-ధైర్యకంచుకము కూడ విచ్ఛిన్నమైనట్లున్నది! ఆచార్యులవారి కడ కరిగి యేమో మొఱవెట్టుచున్నాఁడు.

వైశం—సరికాని—అర్జునుని యరద మరిగి యరిగి, యిప్పు డీయాటంకమును లేనిచోట నాఁగుచున్న దేమి చెపుమా!

(అంతట నర్జునుని రథము మరలఁ బ్రవేశించి నిలుచును)

అర్జు—బావా! యేమది రథ మాఁపితివి?

కృష్ణు—ఏమా?

ఉ. వ్రాలెను బ్రొద్దు తద్దయును, వారువము ల్గను డస్సి నేలపైఁ
గాళులు మోపలేక తలఁకంగఁ దొడంగెను, కార్య శేషమున్
జాలఁగఁ గల్గియున్న దొకసారి యొకించుక నిల్పి వీనికి
న్నీళులు వెట్టకున్నఁ జననేరవు ముందున కింక బావరో!

అర్జు—బావా! శత్రుమధ్యమున వీనికి నీర మెక్కడనుండి వచ్చును?

కృష్ణు—ఎక్కడినుండి వచ్చునా?—భీష్మపితామహున కెక్కడి నుండి వచ్చెనో వీనికి నక్కడినుండియే రాఁగలదు.

అర్జు—(మందహాసముతో) మంచిది కానిమ్ము—నీయానతి నాచే నేమి చేయింప నేరదు? (అని గాండీవముతోఁ గ్రిందికి దిగును.)

కృష్ణు—(రథము దిగి, గుఱ్ఱములను బరిశీలించి) అర్జునా! రెల్లిపూల కంటెం దెల్లనగు వీని మేనులు కొవ్వులు చెక్కినట్లు గాయపడుటయె కాక—యింకను నెన్ని యలుగులం గలిగి యున్నవో తిలకించితివా? (అని యలుగులం బెఱుకుటకు మొదలు పెట్టును.)

అర్జు—బావా! యినుమును గూడిన యగ్గికిని సమ్మెటదెబ్బలు తప్పవు గదా! (ముందునకుం జూచి) అదిగో! యచ్చటం బచ్చిక దట్టముగా నున్నది. పాతాళోదక సమాకర్షణమునకుం గూడ నదియే యుచితస్థలము. (అని నిష్క్రమించి మరలం బ్రవేశించి) బావా! జలము నాకర్షించుటయె కాక—శత్రువులవలన మన కార్యమున కంతరాయము కలుగకుండ నా ప్రదేశమున కంతకు నలుగులతోం బంజరము కూడ నిర్మించితిని. నీవు పోయి నీపని చూడుము—నే నిచ్చటం గావలిగా నుండెదను.

కృష్ణ—(రథముతో నిష్క్రమించును.)

(నేపథ్యమునం గలకలము.)

తెరలో—అర్జునా! మన మిప్పు డనువు తప్పియుంటిమని శత్రుసైన్యము తరంగన్యాయముగా వచ్చుచున్నది జాగ్రత్త సుమా!

అర్జు—(సంరంభముతో) రానిమ్ము. రానిమ్ము. (కొంచెము ముందున కేగి, బిగ్గఱగా) ఓ కౌరవ వాహినీపతులారా!

చ. దళమగు ఖాండవంబు భయదస్థితిం గాలిచి, కాలకేయ ము
ఖ్యుల రుధిరప్రవాహమునం గ్రుంకిన మత్పటుసాయకోత్కరం
బులు పసమించు మీ వసాసమూహముగాం జవిచూడం గోరి నా
ల్కలు వెలికి న్నిగిడ్చెను; విలంబము సైపవు; రండు వేగమే!

ఏమి! యొక్కసారిగ వచ్చి పైంబడం జూచుచున్నారా? ఇదిగో! యీ యైంద్రాస్త్రము మి మ్మెల్లర నెంతదూరము కొంపోయి పాఱవేయునో చూడుండు! (అని బాణము విడుచును.)

కృష్ణు—(ప్రవేశించి) అర్జునా! యేమోయి! నీ యైంద్రాస్త్రప్రభావము!

చ. విడుచుటయే విలంబముగ భీషణరావమునం జగంబు ది
బ్బడిపడం జేసి, శాతశరపంక్తు లపారిగ వెల్వరించుచుం

గడఁగి ప్రచండలీల- సుడిగాలి తృణావలి నెట్టు లట్లు, నె
వ్వడిఁ గొనిపోయి పోయి పడవైచెను దవ్వుల సర్వసైన్యముల్ !

తెరలో — ఓహో ! బంధు మిత్ర సామంత వీరవరేణ్యులారా !

ఉ. దండు భయంబు లేదు, కురురాజు సమీపమునందు నుండ నా
ఖండలుఁ డేని కన్దెఱచి కన్గొన నేరఁడు మిమ్ము, నింక నీ
గాండివి యెంతవాఁ-డితని కార్ముకపాండితి యెంతపాటి ? ప
చ్చండతరాశుగంబుల వెసం బరిమార్చెద వీని నిప్పుడే ?

కృష్ణు — (అదిరిపాటుతో) వీ రెవరు ! (అని తిరిగి చూచుచు.)

అర్జు — (చూచి) ఇంకెవరు ! — దుర్యోధనమహారాజుగారు !

కృష్ణు — ఇప్పుడేగదా చావుదెబ్బలు తిని పోయినాఁడు ! ఇంతలోనే మరల నింతపొగరుకొని వచ్చుట కేదియో కారణ ముండవలెను.

అర్జు — కారణము కానిపించుచునే యున్నది అతఁ డిప్పుడు ధరించిన కవచ మభేద్య మయినది. ఆ దివ్యకవచము నాచార్యులవారును నేను దక్క నన్యు లెఱుఁగరు. పోయి తనయవస్థను మొఱపెట్టుకొన మనసు కరగి యాయన దీని ననుగ్రహించి యుందురు.

కృష్ణు — అట్లయిన మనలను సాధారణముగ విడువఁడు. ప్రొద్దుకూడ విశేషముగ లేదు. ఇందుల కేమి సాధనము ?

అర్జు — అదియే యాలోచించుచున్నాఁడను.

కృష్ణు — ఇంకను నాలోచించుచునే యుంటివా ! మంచిది కానిమ్ము- గుఱ్ఱములు బాగుగా నేఁ డేటినవి; రథము పూన్చి తెచ్చెద నెక్కుము — పైసంగతి నేనె చూచెద. (అని పోయి రథము తెచ్చును.)

కృష్ణు, అర్జు — (పునల రథ మధిష్ఠింతురు.)

దుర్యో — (సంరంభముతోఁ బ్రవేశించి)

చ. నిలునిలు మెందుఁ బోయెదవు ? నీభుజసారము, నీదుబీరముల్
దెలిసికొనం దలంచి చనుదెంచినవాఁడను ; ధైర్య సాహసం
బులు గలవేని నిల్వఁబడి పోరుము ; కృష్ణుఁడు చూచుచుండ నీ
తల తెగఁగొట్టి నీదు శపథంబు వృథావృథ సేతు ఫల్గునా !

కృష్ణు—(మందహాసముతో) సరి కాని, బావా! నీయట్టిమానవంతుఁడు లేఁడని వాడుక !–చివర కింత కానిపని చేసితి వేమి ?

దుర్యో—ఏమి కానిపని చేసితిని ?

కృష్ణు—ఆచార్యుని బిచ్చమెత్తి యాకత్తళముం దెచ్చికొంటివి కదా! చూచినవారే మనుకొందురు ?

దుర్యో—(వెలవెలపాటుతో) ఏ మనుకొందురు ?

కృష్ణు—(పకపక నవ్వి) అదికూడ నేనే చెప్పవలెనా !—అర్జునుని యాశుగములకు వెఱచి దానిం దగిలించుకొని వచ్చె ననుకొనరా? పోనిమ్ము—దాని యాధారమున నొకవేళ నీవు గెలుతు వనుకొనుము- అప్పు డాప్రతిష్ఠ యాచార్యునకుఁ గాక-నీకెట్లు దక్కును?

దుర్యో—(రోషముతో) అట్లయిన, నిదిగో ! దీని నిప్పుడ తీసివేయుచున్నాఁడను. (అట్లు చేసి) మనపోరాటమున కానమ్మస్థల మనుకూలముగా నుండును,-రథ మచటికి రానిమ్ము (అని నిష్క్రమింతురు.)

అర్జు—బావా! యేమిటి యాలోచించుచున్నావు ?

మ॥ విసముం బెట్టగఁ జేసె నన్నమున, సుప్తింజెంది యుండంగ మా
బసఁ గాల్పించెను, మాయజూదమున సర్వస్వంబుఁ గాఁజేసె, నె
న్న సభామధ్యమునం గుభాబ్జముఖి మానం బార్ప యత్నించె, నీ
పసరంబుం బరిమార్ప నీక్షణమ బావా ! తేరు వోనీయుమా !

కృష్ణు—బాగు, బాగు ! నీపుణ్యము గాని—భీమసేనుని ప్రతిజ్ఞకు భంగము మాత్రము కలిగింపకుము (అని రథముతో నిష్క్రమింతురు.)

శకుని—(అంతటఁ బ్రవేశించి) అన్నన్నా ! దుర్యోధనుఁ డెంతవెట్టి పనిచేసినాఁడు! (ముందునకుఁ బరికించి) సరి, యింకేమున్నది!–సవ్యసాచి క్షణములో విల్లు దునిమి, సారథిం జంపి, గుఱ్ఱములం దెగటార్చి, యొడలు చిల్లులువడ నేయ రథంబునుండి గుబాలున నులికి పడిపడి వచ్చుచున్నాఁడు !

దుర్యో—(దగ్గుసికొంగుఁడై పారలఁ బ్రవేశించి) మామా ! యిదిగో! నే నిక్కడనే యుంటిని !—నీకొఱకే చూచుచున్నాఁడు.

శకు—ఈ సైంధవుననున్న మూఁకలం బురికొల్పి వెనకనుండి ముట్టడింపం జేయవలె నను తలంపుతో వచ్చి- నీవును నిటే వచ్చుచుండుట చూచి నిలిచినాఁడను.

దుర్యో—(ధైర్యముతో) మామా! "మహాగజాః పలాయంతే మశకానాంతు కాగతిః" యన్నట్లు- ఈ చిల్లరిమూఁక యేమి చేయఁగలదు!

శకు—నిజమే, నిజమే. ఇఁక మన మిప్పుడు చేయవలసిన పని యేమి?

దుర్యో—అదియే నా కేమియుఁ బాలుపోక నిన్ను స్మరించినాఁడను. (ఆకసమువంకఁ జూచి) నాలుగైదుగడియల పొద్దున్నట్లు లేదు. (ముందునకు దృష్టి నిగిడ్చి) కాని, యర్జునుఁ డదిగో! చక్రవ్యూహము వఱకుఁ బోయినాఁడు. అచ్చటనున్న యపార సైన్యమును గర్ణ శల్య భూరిశ్రవ స్సోమదత్త ప్రభృతి ప్రముఖులును, నతని కూపి రాడకుండఁ జేయగల రను నమ్మకము కలదు కాని—యేమో, యెటుపోయి యెటు వచ్చునో యను సందియము మాత్రము బాధించుచున్నది. పాడుసూర్యుఁడు నేఁడెంతకును గదలిపోకున్నాఁడు! మామా! యీరవంత ప్రొద్దుంగూడఁ గడచి పోయెనా—మన యదృష్టమే మని చెప్పుదును!

శకు—అట్లయిన, నే నొక యమోఘమయిన యాలోచన చెప్పెద నట్లు సేయుము.

దుర్యో—(ఆత్రముతో) నీమాట నీనోటిలో నుండఁగనే చేసెదను.

శకు—కాని, యిప్పు డది వెల్లడి కాఁగూడదు. (అని చెవిలోఁ జెప్పును)

దుర్యో—(శకుని వీపు తట్టుచు) సెబాసు, మామా! సెబాసు! సైంధవుని ప్రాణమును నా మానమును గూడఁ దక్కించితివి? రమ్ము రమ్ము-పోయి యట్లు చేయుదము. (శకునితో నిష్క్రమించు)

నంజ—వయస్యా! వ్యూహముఖమున నెంతదారుణ సంగ్రామము జరుగుచున్నదో చూచితివా? అంతలేసి మహారథుల నాతిఘన నిలువరించు నాచార్యులవారి పరాక్రమ మెంతని చెప్పవచ్చును! (పరికించి) అదేమి! పాండవయోధు లందఱు నాకస్మికముగ సంగ్రామము చాలించి యాకసమువంక విలోకించుచున్నారు!

వైశం—ఆ వైపునుండి యేదియో పుష్పక మొకటి వచ్చుచున్నది. (పరిశీలించి) ఇదేమి చిత్రము!—తన్మధ్యమున నున్నవాఁడు సైంధవునిఁ బోలి యున్నాఁడు!

సంజ—పోలియుండుట కాదు-సైంధవుఁడే! పుష్పకము చాలఁ గ్రిందికి వచ్చినందున నిప్పుడు స్పష్టముగ నగపడుచుఁ, గ్రిందివారినుద్దేశించి యేమో యనుచున్నాఁడు వినుము.

తెరలో—ఓ యుధిష్ఠిర భీమ నకుల సహదేవ విరాట ద్రుపద దృష్టద్యుమ్న సాత్యకి ప్రభృతులారా!

చ. తిరిగితిఁ బార్థుపుణ్యమున దిక్తటభూముల నెల్లఁ, గంటి దు
స్తర హిమవన్నగాగ్రమున, జాహ్నవి పుట్టినచోటఁ గ్రుంకితిన్
గర మలరారు వెండిమలఁ గాంచితి, చూచితి నేమదీప్తులన్
మరలితి నిర్విచారముగ మద్గృహసీమకుఁ బ్రొద్దు వ్రాలుటన్.

గీ. దేవసముఁడ నే నేఁడ! గాండీవి యేఁడ!
సందె వడకుండ నతఁడు నజ్ఞంపు కేఁడ!
ప్రతిన నెడఁ బ్రొద్దు గ్రుంకెఁగ వచ్చె నదిగో!
విజయు నెడ మీర లాసలు విడువుఁ డిఁక!

వైశం—సంజయా! అర్జునునకు గొప్ప యాశాభంగము సంభవించినది! అతఁడును సమీపించునంత, వారు సైంధవునిఁ బుష్పక మెక్కించి యచటినుండి పంపివైచినారు! శకుని రాహస్య మిదే కాపలెను!

సంజ—పాపము! యుధిష్ఠిరుఁడు మిన్ను విఱిగి మీఁదఁ బడినట్లు భీమసేనునితో నేమో యనుచు నిటు వచ్చుచున్నాఁడు!

(అంతట యుధిష్ఠిర భీమసేనులు ప్రవేశింతురు.)

యుధి—(కన్నీటితో) అయ్యో తమ్ముఁడా! దుఃఖము గాకేమున్నది!

ఉ. మోసము వచ్చె! సైంధవుఁడు మొగ్గరమందు కలం డటంచుఁ బే
రాస ధనంజయుం డరిగె నా దెస. కీ దెస నున్నవాఁ డతం!
డీసరవోయెఁ బ్రొద్దును నడే కనుఁగొమ్ము! ప్రతిజ్ఞ తప్పినన్
వాసవి యన్నపల్కు కలవంబును దప్పఁ! డిఁకేమి చెప్పుదున్!

న్నలు గల్గువారు వసుధ న్గల రెండఱ యేని. కాని, నా
యన్నలవంటి తమ్ము లిఁక దక్కిన రొక్కరికైన నంచు గ
ర్వమ్ము వహింతు; నం దెవరి పాదమునైన ముల్లు గ్రుచ్చుకొన్నఁ బ్రా
ణమ్ములు పోవు నా ; ఇఁక ధనంజయుఁ డైన వచింప నేటికిన్ !

భీము—(సంరంభముతో) అన్నగారూ ! యిప్పుడు మించిపోయిన దేమున్నది ? ఈ గదాదండమును గిరగిరఁ ద్రిప్పి వైచిన నా దురాత్ముఁడు పుష్పకముతోఁ గూడ నుగ్గునూచమై క్రిందఁ బడఁడా ?

యుధి—అప్పుడును నీతమ్మునకుఁ బ్రతిజ్ఞాభంగమే యగును. వీని నతఁడుగదా చంపవలసినవాఁడు ?

భీము—పోనిండు, తమ్ముఁడు వచ్చువఱకు సూర్యు నరికట్టెదను.

యుధి—తమ్ముఁడా ! నీసామర్థ్య మట్టిదే. కాని, ప్రకృతివిరుద్ధమైన కార్యమున కెన్నఁడును గడంగరా దని పెద్దలు చెప్పుదురు.

భీము—అట్లయిన మన మిప్పుడు సేయఁదగినపని యేమియు లేనేలేదా?

యుధి—ఒక్కటి యున్నది. వెంటనే పోయి తమ్మునకీసంగతి తెలిపి తత్క్షణ మిచటికిఁ దోడితెచ్చుటే తగిన పని.

భీము—దీని కింతయాలోచన మేల ? గాలికంటె ముందు వోయి కృష్ణార్జునుల నిరువురను మూఁపున నిడికొని క్షణములో నిక్కడ వ్రాలెదను. (వెనుకకుఁ జూచి,) విశోకా ! రథ మిటు రానిమ్ము !

విశో—(రథము తోలికొని వచ్చును.)

యుధి—తమ్ముఁడా ! నీవు సుఖముగఁ బోయిరమ్ము. నే నీలోపల సైంధవహాతకుం గనిపెట్టియుండుటకై ఘటోత్కచుని నియోగించి మీకొఱ కెదురుచూచుచుండెద. (అని నిష్క్రమించును.)

భీము—(రథమధిష్ఠించి) విశోకా! మనముపోవదము శీఘ్రముగా నాచార్యులవారివంకకుఁ బోనిమ్ము.

విశో—చిత్తము. (రథము నడపుచు) అయ్యా ! భారద్వాజులవారు మీ సన్నాహసంరంభము చూచి, నారి సారించి, వింట బాణము సంధించుచున్నారు:

భీము—(ముందునకుఁ జూచి) ఆచార్యోత్తమా!

క. గురులరు, కరుణారస సం
భరితుల రటుగాన మనసు పాఱదు మీతో
దుర మొనరింపఁగఁ దమ్ముని
కొఱకై చనుచుంటి నడ్డుకొనకుఁడు నన్నున్.

తెరలో—ఉ. ఏ నిట లేకయున్నతఱి నేఁగెను నీయనుజన్ముఁ; డేను వి
ల్లూని మొన న్గను త్రెఱచి ప్రోచుచునుండఁ ద్రినేత్రుఁడున్ రమా
జానియు లోనఁగా లిడఁగ శక్తులు గా, రిఁక నన్యు లెంత! హో
హో! నగరాజముం దగరు పోలిక ఢీకొన వచ్చితే నను౯!

భీము—(రోషముతో లేచి) ఓ కుంభసంభవా!

చ. గురుఁడ వటంచు గౌరవముకోసము పల్కితి నంతెగాక నీ
కరుణయుఁ బ్రాపును న్వలెనె! కాంచికొనంగల వేని చూచికో
మ్మురదముతోడ నిన్నిపుడ యంబరవీథికి వీచివైచి ని
ర్భరగతిఁ జొత్తు మొగ్గరము, వారణరాజము మస్తుసం బలె౯.
(అని నేలకు లంఘించి యాచార్యునివంకకు నిష్క్రమించును)

విశో—ఓహో! యేమి మా భీమసేన మహారాజుగారి పరాక్రమము!

గీ. బక జరాసంధ మల్లురఁ బట్టి చీల్చి
నట్టి బాహుయుగంబున నదిమి పట్టి
గురుని యురదం బదే గిరగిరను ద్రిప్పి
వీఁక వినువీధి కల్లన విసర్వైచె!

(మరలఁ బరికించి) అరే! అదెట్లు!—ఆచార్యులవా రుష్ణీష మూడ, జుట్టుముడి వీడఁ, బరుగుపరుగున నాదారిని బలాయితు లగుచున్నారు!—సరిసరి, తెలిసినది. భీమసేన మహారాజుగారి నెఱిఁగినవారె కనుక జప్పున వెనుకనుండి జాగ్రత్తపడియుందురు.

భీము—(ప్రవేశించి) విశోకా! అయినవా రందఱుఁ దమ్మునిచేతనే హతు లయినారు. హతశేషులు నన్నుఁ జూచినమాత్రముననే

పటాపంచ లగుచున్నారు. కావున నిరంకుశమైన మనయరదమును
తెప్పపాటులోఁ దమ్మునికడకుఁ బోనిమ్ము (అని రథమధిష్ఠించును.)

విశో—(రథమును గొంత నడిపి) అయ్యా! అదిగో! కపిధ్వజము!
కాని, యచ్చటఁ బోరు బహుఘోరముగా నున్నట్లు పొడకట్టుచు
న్నది. ఏలినవా రర్జునమహారాజుగారికిఁ దగుసమయమున సాయ
పడినవారు కాఁగలరు, (అని గుఱ్ఱముల నదల్చును.)

భీము—విశోకా! జగజ్జేతయగు తమ్మునకు నాకరిసాయము కూడనా!

చ. విను- మలగాండివస్వనము ; వీనుల వీఁకల్పెడి దేవదత్త సం
జనితనినాద ; మచ్యుతుఁడు సారెకు సల్పెడి సాధువాదముల్ ;
గను- మల శత్రుజాలముల ; గవ్వలగుత్తులలీల రాలు నో
ధనికర మస్త్రకావళుల, దవ్వులపట్టు శతాంగపాళులన్.

విశో—చిత్తము, చిత్తము. నాకించుకజ్ఞత నున్నంపుఁడు!

భీము—దాని కేమి గాని—మనరాక తమ్మున కిచ్చటినుండియే తెలి
యఁజేయుట యుక్తము కదా? (అని శంఖము తీసి పూరించును)

విశో—అదిగో! యేలినవారి శంఖధ్వని గుర్తించి యర్జునమహారా
జుగారు తిరిగిచూచి శ్రీకృష్ణులవారితో నేమో యనుచున్నారు.
... ... అదేమి చెప్పుచూ—ఆపాటున శ్రీకృష్ణులవారు రథము
మనవంకకు మరల్చుకొని వచ్చుచున్నారు!

అర్జు—(రథముతోఁ బ్రవేశించి, యాత్రముతో) అన్నా! మనయన్న
గారికి నేమమేనా? —

భీము—వెఱ్ఱితమ్ముఁడా! అన్నగారు నేమముగా నుండకున్న నీవు
నన్ను సజీవునిఁగా జూడఁగలుగుట యెట్లుసంభవించును? ఆయన
యాదేశముమీఁదనే నే నిచటికి వచ్చినది.

అర్జు—చెప్పుము చెప్పుము—ఏమని యన్నగారి యాదేశము!

భీము—తమ్ముఁడా! నీ వేమొలుకకొఱ కెంతకొండను దగ్గివ్వితివో
యామొలుక యిచ్చట లేదు.

అర్జు—(వెలవెలపాటులో) అదెట్లు?

భీము—దుర్యోధనుఁ డా సైంధవహాతకు నొక యాకాశయానమునఁ గూర్చుండఁబెట్టి యిచ్చటినుండి పంపివేయ, వాఁ డందందు మసలి మసలి, ప్రొద్దుగ్రుంకవచ్చినందున నొగిడి యేతెంచి యిప్పుడు మనసైన్యముపై నంబరవీథిం గ్రుమ్మరుచున్నాఁడు.

అర్జు—(నిరుత్సాహముతో) బావా! వింటివా యీ విపరీతము!

కృష్ణు—విపరీతము కాదు-దుష్టశకుని పన్నిన దుస్తంత్రము! ఈవిధముగా మనలను బొరపెట్టి కాలహరణము సేయుతలంపుతో సైంధవుని దాఁచి, యెవనికో సైంధవవేషము వేసి, యావంకకనిపియుందురు. నిజముగ సైంధవుఁ డిచ్చట లేకున్న దుర్యోధనుఁడు నీబాణాగ్ని కిందఱ నింధనములఁ గావించునాఁడు గాఁడు మఱియు రణరంగమునఁ నుంచి రక్షింపలేకపోయెనను నాక్షేపము వచ్చునని శంకింపనివాఁడును గాఁడు.

అర్జు—ఈసందేహ మచటికేఁగి తీర్చుకొనినచ్చుట మంచిదేమో?

కృష్ణు—ఈకాకదంతపరీక్ష కిప్పు డవకాశమేది! ప్రొద్దువంకఁ జూచితివా

చ. అరుణగభస్తియై తరణి యస్తగిరీంద్రము సేరఁబోచ్చె; భూ
ధరశిఖరాగ్రపాళులకుఁ దాఁగుచు నున్నది యెండ; మేఁతకై
తరలిన పక్షులు న్మరలెఁ దత్తఱపాటున గూళ్ళవంక కి
త్తఱి నటువోయి రాఁగలుగు దాఁకను జాలిన వేళ యున్నదే?

అర్జు—అట్లయిన నాలస్య మెందులకు?-కర్తవ్యమేమో నిరూపింపుము.

కృష్ణు—కర్తవ్యమున కేమున్నది?-యాదుష్టపురు డిచ్చటనే యున్నదని నానమ్మకము. కలుగులోనుండి దానిని బయికి రప్పించుటయే కర్తవ్యము. మేఘాస్త్రమున సూర్యునిం గప్పివేసిన ప్రొద్దు గ్రుంకిన దనుకొని యతఁడు బయటికి వచ్చెడును.

అర్జు—అట్లయిన నదెంతపని? చిన్నన్నా! నీయభిప్రాయ మేమి?

భీము—బావ చెప్పినట్లు చేయుటయే నా యభిప్రాయము.

అర్జు—అట్లయిన నాలస్య మేల-బావా! రథము పోనిమ్మా!

కృష్ణు—(రథమును గురుసేనవంకకు మరల్చును)

భీము—నేను ముందేగి, యచ్చట నడ్డుగా నున్న వేదండతండమును గదాదండమునఁ జెండాడి మీకుఁ గొంత తెఱపి కావించెదను.
(అని రథము డిగ్గి నిష్క్రమించును.)

తెరలో—ఓహో! వాహినీపతులార! చూచుచు నూరకుంటి రేమి?

ఆ. వె. క్షణములోనఁ దంతిసంతతిఁ బొలియించి,
పిడుగు మొత్తినట్లు భీమసేనుఁ
డరదగముల నెల్ల నఱవఱ లొనరిచెఁ
జొచ్చెఁ, గూల్చెఁ డతనిఁ జుట్టుముట్టి!

కృష్ణ—అర్జునా! అర్జునా! యిదే సమయము?—ఎల్లవారిదృష్టులు నిప్పుడు భీమసేనునిపై నున్నవి. నీ వీ సమయమున మేఘాస్త్రము ప్రయోగించి, చీఁకటులం గలిగింపుము.

అర్జు—ఇదిగో! ప్రయోగించుచున్నాఁడను (అని యట్లు చేయును.)

(తెరలో గొప్ప కలకలము.)

కృష్ణ—(జనాంతికముగా) అర్జునా! శాత్రవుల యానందము చూచితివా! నీమేఘాస్త్రము రవిబింబమును గప్పఁ, బ్రొద్దుక్రుంకెన దనుకొని వారు కోలాహలము చేయుచున్నారు! అదిగో!-యూకంచు తెరుల వెనుక వరాహధ్వజముతో సైంధవునియరదము కానవచ్చుచున్నది! అతఁ డందే యుండును. నీవు వింట బాణము సంధించి లక్ష్య మావంకనే నిలిపి, సిద్ధముగా నుండుము.

ఇద్దఱు—(తదేకదృష్టితో ముందునకుఁ జూతురు.)

కృష్ణ—(ఆత్రముతో) అర్జునా! అర్జునా!

ఆ. వె. అదుగో! సింధునృపతి—యుత్తరీ పడమటి
చాయ నరయు—నేయు! మేయు! మిపుడ:

అర్జు—సెబాసు! బావా సెబాసు! సర్వజ్ఞబిరుదము నీకే చెల్లును! ఈతనియునికిపట్ల నేను సందేహముతోనె యుంటిని! సరికాని—
శస్త్రహీను నతనిఁ జంపుబకైై నాదు
చేతు లాడ వేమి సేయువాఁడ!

కృష్ణు—(విసువుతో) అబ్బబ్బా! మీ ధర్మలోభమునకు మేర లేదు కదా! (పరికించి) సరి యింక నేమి! నీసందియము తీర్చుటకో యన నతఁ డదిగో విల్లెత్తి మనపై విశిఖములం గుప్పుచున్నాఁడు!

అర్జు—ఇదిగో! యిప్పుడు వానిమచ్చ మాపెదచూడుము. (అని శరము సంధించి విడుచును.)

కృష్ణు—సెబాసు! పార్థా! సెబాసు!

ఉ. వేఁగి భవచ్ఛరంబు తెగనేసి జయద్రథు శీర్షభాగముం
డేగ పులుంగునుంబలె వడిం గొనిపోయెడు మింటికి! కద్ది ధా
త్రిగతమైన హాని యగుఁ; దెల్పెద నప్పలుఁ గార్యశేష, మీ
వాఁగక తూపులం బఱపి యాఁపుము మింటన దాని నేర్పుతోఁ,

అర్జు—(స్మృతితో) అన్నట్లు సుభద్రాదేవి సూచన నేను మఱచియే పోయితిని! ఇదిగో నీవు చెప్పినట్లు చేయుచున్నాఁడను. (అని మీఁదికి బాణములు విడుచుచు) పయిసంగతి చెప్పుము.

కృష్ణు—మేఘాస్త్రము వారించి, పాశుపతమునఁ దచ్ఛిరము సింధురాజుతండ్రి యంకతలంబునం బడునట్లు చేయుము.

అర్జు—రెండుకార్యములును నేకకాలమునం దే కాఁగలవు. (అని రెండు బాణములను సంధించి ధ్యానము నభినయించి విడుచును)

కృష్ణు—విజయా! యిప్పుడు నీవు సాధితప్రతిజ్ఞుండవై, సఫలమనోరథుండవైతివి! ఇఁక స్థిమితపడి శత్రువుల కలవరము విలోకింపుము.

అర్జు—మా చిన్నన్న సంతోషము చూడవేమి?

గీ. ఛేదితంబైన సైంధవు శిరము చూచి,
పొదలుచు న్వండియుం దోఁచు పొద్దు చూచి,
యుబ్బి గొబ్బున నొకపెనబొబ్బ వైచు
వచ్చుచున్నాఁడు సంతోషవార్ధి భంగి!

భీము—(సంతోషముతోఁ బ్రవేశించి) తమ్ముఁడా! కృతకృత్యుఁడవై కులమునకు వన్నె తెచ్చిన నిన్నుఁ జూచి గర్వపడుచున్నాఁడను. బావా! యీచలువ యంతయు నీది! నేను ముందు పోయి అన్నగారికి విజయవార్త నివేదించెదను. (అని నిష్క్రమించును.)

ఈ సైంధవవధకుఁ బ్రథమప్రేరకులు నాలు [illegible]
సంతోషకార్త్య భూమము కలిఁగించుటకై [illegible]
యున్నది. ఇఁక నేను జేయవలసిన దేమేని యున్నదో

యుధి—ఇంకను నాకుఁ జేయవలసిన దేమున్నది! ... మున
నా మాతృభూమియెడ వినియోగింపుము.

కృష్ణు—అట్లయిన, నిదిగో !—

సీ. అన్నదమ్ములభాగ మపహరించెడుబుద్ధి
యుర్వి నెవరికిఁ బుట్టకుండుఁ గాక !
గాండీవి కెనవచ్చు కార్యశూరులతోడ
నఖిలమండలములు నిండుఁ గాక !
అధికాయురోపేతు లౌనభిమన్యు లిం
టింట నెల్లప్పు డుదయింత్రు గాక !
కాంతలెల్లరు వృద్ధగతి వీరమాత లై
గౌరవకీర్తులఁ గాంతురు గాక !
ప్రజలయం దైకమత్యము ప్రబలుఁ గాక
విద్యకే గౌరవంబు లభించుఁ గాక !
కవులవాక్కులకు సిద్ధి కలుగుఁ గాక !
భరతమాత సుఖస్థితిఁ బరఁగుఁ గాక !

శ్రీమజ్జగద్గురు శంకరభగవత్పాద ప్రసాదాసాదిత మహాకవిబిరుదాం
భారద్వాజ గోత్రార్ణవ శశాంక, కవిఘంటా కలాప హస్త
కాళ్ళకూర్యన్వయప్రశస్త, బంగారురాజ కవిరాజ
తనూజ, నారాయణరాయామాత్యవిరాజ,
ప్రణీతంబగు పద్మవ్యూహనాటకము
సంపూర్ణము.

For copies Apply to:-

CITY PRESS,

Main Road, COCANADA.